Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల నొప్పులకు సమూలంగా వైద్యంచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడ్డు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :24 | సంచిక :239 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | ఆదివారం 21 డిసెంబర్ 2025 | పేజీలు :12 | వేల రూ5 /-


## ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్..



**హైదరాబాద్, డిసెంబర్ 20:**తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంలో అత్యంత కీలకమైన పల్లె పోరు ముగిసింది. మూడు విడతలుగా జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఊహించిన దాని కంటే పెద్ద విజయాన్నే అందించాయి. రాష్ట్రవ్యాప్తంగా సామాన్యుడి తీర్పు హస్తంవైపు మొగ్గు చూపినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయితే ఈ భారీ విజయం వెనుక ఉన్న ఉత్సాహాన్ని పక్కనపెట్టి పార్టీలోని అంతర్గత లోపాలను సరిదిద్దే పనిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిమగ్నమయ్యారు. గెలిచామన్న గర్వం కంటే, పార్టీ క్రమశిక్షణే ముఖ్యం అన్నట్టుగా అధిష్ఠానం వ్యవహరించిన తీరు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురు వేసింది. మూడు విడతల ఎన్నికల సరళిని పరిశీలిస్తే కాంగ్రెస్ తన పట్టును నిరూపించుకుంటూ సుమారు 56 శాతం స్థానాలను కైవసం చేసుకుంది. తుది లెక్కల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12, 733 పంచాయతీ సర్పంచి పదవులకు గానీ దాదాపు ఏడు వేలకుపైగా కాంగ్రెస్ మద్దతు దారులు గెలుచుకున్నారు.రాష్ట్రంలోని మొత్తం 31 జిల్లాల్లో ఎన్నికల కోలాహలం నెలకొనగా, కాంగ్రెస్ పార్టీ తన ప్రభావాన్ని చాటుకుంది. ఒక్క సిద్ధిపేట జిల్లా మినహా, మిగిలిన 30జిల్లాల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యాన్ని కనబరిచింది. ముఖ్యంగా నల్గొండ, ఖమ్మం, రంగారెడ్డి, నిజామాబాద్, మహబూబ్‌నగర్ వంటి కీలక జిల్లాల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్ చేసింది. అయితే ఇంత ఘన విజయం సాధించినప్పటికీ కాంగ్రెస్ అధిష్ఠానం మాత్రం పార్టీ వైఫల్యాలపై లోతైన విశ్లేషణ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షితో కూడిన బృందం టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఫలితాలపై సమీక్ష నిర్వహించింది. ఈ క్రమంలో కొందరు ఎమ్మెల్యే తీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యంగా వరంగల్, పాలమూరు, నల్గొండ జిల్లాలకు చెందిన సుమారు 18 మంది ఎమ్మెల్యేల పని తీరుపై రేవంత్ రెడ్డి గుర్రుగా ఉన్నట్టు సమాచారం. పార్టీ గెలిచినా, కొన్ని ప్రాంతాల్లో స్థానిక నేతల మొండివైఖరి వల్ల పార్టీకి నష్టం జరిగిందని ఆయన అభిప్రాయపడ్డారని తెలుస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీకి వ్యతిరేకంగా నిలబడిన రెబల్స్‌ను బుజ్జగించడంతో, వారిని సమన్వయం చేయడంలో దాదాపు 16 మంది ఎమ్మెల్యేలు విఫలమయ్యారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. దీని వల్ల ఓట్లు చీలి పార్టీకి తీరని నష్టం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. బంధు ప్రీతిపై ఆగ్రహం:- కొందు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, ఎమ్మెల్యేలు తమ సొంత బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని అధిష్ఠానం తీవ్రంగా తప్పుపట్టింది. అర్హులైన కార్యకర్తలను కాదని, బంధువులకు - మిగతా3లో



## సజ్జనార్ నేతృత్వంలో సిట్...

### ఫోన్ ట్యాపింగ్ అప్ డేట్....

**హైదరాబాద్, డిసెంబర్ 20:**జూన్ 2024లో తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు సాధారణ పోలీస్ విచారణగా సాగుతున్న ఈ కేసును మరింత లోతుగా, పారదర్శకంగా విచారించేందుకు సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందిఈ కేసును హైదరాబాద్ పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. అయితే, దర్యాప్తులో వేగం తగ్గడం, కీలక సూత్రధారులను పట్టుకోవడంలో - మిగతా3లో

### గులాబీ కార్యవర్గ సమావేశానికి

## అంతా రెడీ..

**హైదరాబాద్, డిసెంబర్ 20 :**కాంగ్రెస్ పాలనకు రెండేళ్లు పూర్తవుతున్నాయి. కాంగ్రెస్ పాలన తీరుపైన, ప్రజా సమస్యలపైన బీఆర్ఎస్ క్షేత్ర స్థాయిలో పోరాటాలు చేస్తున్నా, ఆ పార్టీ అధినేత కేసీఆర్ మాత్రం రాజకీయ మౌనం పాటిస్తున్నారు. అయితే ఈ నెల 21వ తేదీన జరిగే బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గం, ఎల్పీ, పార్లమెంట్ సభ్యుల సమావేశంతో కేసీఆర్ రాజకీయ మౌనం విరమిస్తారన్న ప్రచారం గులాబీ పార్టీలో సాగుతోంది. ఈ సమావేశంలో పలు కీలక నిర్ణయాలను కేసీఆర్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు కారు పార్టీ నేతలు



చెబుతున్నారు. అయితే ఈ సమావేశంలో ఏం జరగనుందో ఈ కథనం ద్వారా తెలుసుకుందాం.మరో - మిగతా3లో

## మార్చి వరకు ఎన్నికలలే....

**వరంగల్, డిసెంబర్ 20:**పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన ఉత్సాహంతో మున్సిపల్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతుంది. వీలుంటే వచ్చే నెలలో ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తుంది. పంచాయతీ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలను దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ అదే ఊపులో మున్సిపల్ ఎన్నికలకు వెళ్లాలన్న నిర్ణయంతో ఉంది. ఈ మేరకు త్వరలోనే ఎన్నికల కమిషన్ కు లేఖ రాసే అవకాశముంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం నుంచి సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేఖ రాయనుంది. త్వరలో జరగనున్న మంత్రి వర్గ సమావేశంలో చర్చించి ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులుండవు. కానీ అదే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ గుర్తులుంటాయి. అందులో స్పష్టంగా ఎవరికి ఎన్ని స్థానాలు వచ్చాయన్నది



తేలుతుంది. పట్టణ ప్రాంత ఓటర్లు తమకు పట్టం కడతారని కాంగ్రెస్ భావిస్తుంది. ప్రభుత్వం తన పట్టును పట్టణాల్లో నిలుపుకునేందుకు ఈ మేరకు త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు జరిపితే ఆశించిన ఫలితాలు దక్కుతాయని కాంగ్రెస్ భావిస్తుంది. ముందుగా పట్టణాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటలను ఉండేలా ప్లాన్ చేసుకుంటుంది.మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి వెళితే మంచి ఫలితాలు సాధించవచ్చని నమ్ముతుంది. బీసీలు అండగా నిలుస్తారని, తద్వారా మున్సిపల్ ఎన్నికల్లో కూడా జెండా ఎగురవేయవచ్చని కాంగ్రెస్ నాయకత్వం భావిస్తుంది. మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఈ మేరకు మంత్రి వర్గ సమావేశంలో చర్చించి రాష్ట్ర ఎన్నికల కమిషన్ కు లేఖ రాయాల్సి ఉంది. మున్సిపల్ ఎన్నికల తర్వాత జడ్పీ ఎన్నికలు నిర్వహించాలన్నది ఎన్నికల కమిషన్ అభిప్రాయం కావడంతో ఆ మేరకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అంతా సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద ఇక మరో మూడు నాలుగు నెలలు తెలంగాణలో ఎన్నికల వేడి కొనసాగే అవకాశముంది.

### సర్వే ఆఫ్ ఇండియా

## సాయంతో హైడ్రా ...




**హైదరాబాద్, డిసెంబర్ 20:**హైదరాబాద్ పాతబస్తీలో అక్రమార్కుల చెరలో ఉన్న సుమారు రూ. 400 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా అధికారులు పకడ్బందీగా స్వాధీనం చేసుకున్నారు. సర్వే నంబర్ 28లోని మొత్తం 9.11 ఎకరాల్లో.. ఇప్పటికే ఇళ్లు నిర్మించుకున్న రెండు ఎకరాలను వదిలేసి, మిగిలిన ఏడు ఎకరాల ఖాళీ స్థలాన్ని కాపాడారు. వాస్తవానికి ఇది ఒక చెరువు అని, కబ్జాదారులు దీనిని మట్టితో పూడ్చి ప్లాట్లుగా మార్చేందుకు ప్రయత్నించారని అధికారులు గుర్తించారు. పోలీసుల సమక్షంలో అక్రమ ప్రహారీలను కూల్చివేసి.. ప్రభుత్వ బోర్డులు, ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు.హైదరాబాద్ నగరంలో చెరువులు, కుంటలు, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ ప్రొటెక్షన్ ఏజెన్సీ తాజాగా పాతబస్తీలో ఒక సంచలన విజయాన్ని నమోదు చేసింది. కబ్జాదారుల చెరలో ఉన్న దాదాపు ఏడు ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని అధికారులు పకడ్బందీగా స్వాధీనం చేసుకున్నారు. ప్రజా ఆస్తులను కాపాడటంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఈ చర్య ద్వారా ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది.పాతబస్తీలోని సర్వే నంబర్ 28లో మొత్తం 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీని బహిరంగ మార్కెట్ విలువ సుమారు నాలుగు వందల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా. రెవెన్యూ, పోలీసు అధికారుల సమక్షంలో హైడ్రా సిబ్బంది అక్కడికి చేరుకుని.. - మిగతా3లో...

### గ్రేటర్ పై

## కమలం దృష్టి..

**హైదరాబాద్, డిసెంబర్ 20:**జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు, పంచాయతీ ఎన్నికల్లో దెబ్బతిన్న తెలంగాణ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఫోకస్ పెట్టింది. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ తో సమానంగా అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న బీజేపీ ఈసారి హైదరాబాద్ మేయర్ పీఠాన్నిచేపట్టాలని కసితో ఎన్నికల బరిలోకి దిగాలని యోచిస్తుంది. ఇందుకోసం తెలంగాణలో బీజేపీకి ప్రత్యేక వ్యూహం అమలు చేయాలని నిర్ణయించింది. జీహెచ్ఎంసీ, స్థానిక ఎన్నికలపై దృష్టి పెట్టిన బీజేపీ నాయకులు ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో సత్తా చాటాలని చూస్తోంది. ఈరోజు ప్రత్యేకంగా ఢిల్లీ లో ఎనిమిది మంది పార్లమెంటు సభ్యులు సమావశమై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు లోక్ సభ, రాజ్యసభ్యులు పాల్గొన్నారని తెలిసింది.ప్రత్యేక ప్రచార వ్యూహాన్ని ముందు నుంచి అమలు చేయాలని నిర్ణయించారు. స్థానికంగా బలమైన అభ్యర్థులను గుర్తించడం, పార్టీకి అంకిత భావంతో పనిచేస్తున్న వారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. తెలంగాణలో పార్టీ బలాన్ని పెంచేందుకు కలిసి పనిచేయాలని బీజేపీ ఎంపీలు నిర్ణయించారు. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు, మున్సిపాలిటీలు, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా 'ప్రత్యేక వ్యూహం' అమలు చేయాలని వారు తీర్మానించారు. అభ్యర్థుల ఎంపిక కీలకం కావడంతో ఆయా నియోజకవర్గాల బాధ్యుల




అభిప్రాయాలతో పాటు క్యాడర్ బలపర్చిన వారికే పెద్ద పీట వేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.పార్టీ పనితీరుపై మోదీ ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ఢిల్లీలో సమావేశమైన పార్లమెంటు సభ్యులు మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు అవసరమైన శక్తియుక్తులను కూడదీసుకుని సమన్వయంతో పనిచేయాలని అందరూ అభిప్రాయపడ్డారు. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం, నిన్న రాత్రి ఢిల్లీలో కిషన్‌రెడ్డి నివాసంలో ఎంపీలు సమావేశమయ్యారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే మార్గాలు, రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు మార్గదర్శకత్వంలో పనిచేయడం వంటి అంశాలపై చర్చించారు. జీహెచ్ఎంసీ ఎన్నికలు, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీలు సహా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ - మిగతా3లో



### న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కి

## బిగ్ అలర్ట్..

**ఆ పనిచేస్తే జైలుకే..**

ఇటీవల తెలంగాణ లో హైదరాబాద్ పరిధిలో తరుచూ డ్రగ్స్ పట్టుబడటం చూస్తూనే ఉన్నాం. డ్రగ్స్ స్మగ్లర్ల పై సైబరాబాద్ పోలీసులు గట్టి నిఘా పెడుతున్నప్పటికీ కొత్త కొత్త పద్ధతుల్లో ఈ దందా కొనసాగిస్తున్నారు. మరికొన్ని రోజుల్లో నూతన సంవత్సర వేడుకలు రాబోతున్నాయి. ఈ క్రమంలోనే డ్రగ్స్ దందా చేసేవారిపై నార్కొటిక్స్ బ్యూరో తో పాటు హైదరాబాద్ పోలీసులు నిఘా పెట్టారు. తాజాగా ఓ ఇంజనీరింగ్ విద్యార్థిని అరెస్ట్ చేసిన ఘటన నగరంలో కలకలం సృష్టించింది. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కాలేజీలో చదువుతున్న బీటెక్ స్టూడెంట్ న్యూ ఇయర్ సందర్భంగా డ్రగ్స్ పార్టీ చేసుకునేందుకు ఎండిఎంఏ డ్రగ్స్ తీసుకువస్తున్న విషయం తెలుసుకున్న మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెంగుళూర్ నుంచి డ్రగ్స్ను తీసుకువస్తున్నట్లు సమాచారం. నిందితుడి దగ్గర నుంచి 6 గ్రాముల ఎండిఎంఏ స్వాధీనం చేసుకున్నామని మాదాపూర్ ఎస్ఓటి తెలిపారు. న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా పార్టీల్లో యుత్‌కి ఈ డ్రగ్స్ సప్లై చేసి భారీగా డబ్బు సంపాదించాలనే ప్లాన్ చేశాడు సదరు విద్యార్థి. మాదాపూర్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న విద్యార్థిని అనుమానించి - మిగతా3లో

# సంపాదకీయం

## బయో ఫ్యూయెల్‌కు ప్రోత్సాహం నిల్

మండించినపుడు శక్తిని ఉత్పత్తి చేసే పదార్థాన్ని ఇంధనం అంటారు. ఇంధన వాడకం నిత్యకృత్యం. వాహనాలు నడవడానికి, విద్యుత్ ఉత్పత్తి చేయడానికి, వంట చేయడానికి ఇలా ఇంధనం ఎన్నో రకాలుగా ఉపయోగ పడుతున్నది. మనం ప్రతిక్షణం ఎన్నోరకాల ఇంధనాలపై ఆధారపడి జీవిస్తున్నాం. నీరు, పెట్రోల్, డీజిల్, బొగ్గు, విద్యుత్, కట్టెపుల్లలు సహా ఎన్నో రకాల ఘన, ద్రవ, వాయు ఇంధనాలు, యురేనియం, థోరియం వంటి అణు రసాయన ఇంధనాలు నిత్య జీవితంతో పెన వేసుకుని పోయాయి. నిత్య జీవితంలో ఇంధనాలుగా ఉపయోగ పడుతున్నాయి. సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, పెట్రోల్, డీజిల్, అణు ఇంధనాలు ప్రకృతిలో పరిమితంగా మాత్రమే లభిస్తాయి. వాటిని ప్రస్తుతం వినియోగిస్తున్నట్లుగా విపరీతంగా వినియోగిస్తే ప్రమాదం తప్పదు. అవసరాలకు మించి వినియోగం చేస్తూ పోతే, భవిష్యత్తు అంధకారమే. అందుకే సంప్రదాయేతర ఇంధన వినియోగం ప్రత్యామ్నాయ మార్గంగా చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. పెట్రోల్ డీజిల్ గ్యాసులకు బదులుగా బయో ఇంధన వనరులను, బయోడీజిల్, బయో గ్యాస్ వంటి ఇంధన వనరులపై ఆధారపడడం వల్ల భవిష్యత్తు తరాలకు మేలు చేసినవారం అవుతాం. కొన్ని లక్షల సంవత్సరాల క్రితం భూమి అంతర్భాగంలో చేరి, భూమి లోపల విపరీతమైన ఉష్ణం, పీడనం కారణంగా మృత జీవజాలం నుండి శిలాజ నూనెలు/బొగ్గు ఏర్పడినవి. శిలాజ నూనెలు లేదా శిలాజ ఘన పదార్థాలను (నేల బొగ్గు వంటివి) తిరిగి సులభంగా పునరుత్పత్తి కావించుటకు సాధ్యం కాదు. అలా తిరిగి శిలాజ ద్రవ్యాలు ఏర్పడాలంటే మళ్లీ కొన్ని లక్షల సంవత్సరాలు పడుతుంది. అంటే శిలాజ ఇంధనాలను వాడే కొలది వాడి నిల్వలు తగ్గుతాయి కాని పెరగవు. 19వ శతాబ్ది నుండి శిలాజ ఇంధన వాడకం ప్రపంచ వ్యాప్తంగా పెరిగి పోయింది. పరిశ్రమల్లో బాయిలర్లలో, థెర్మోపవరు ప్లాంటు బాయిలరులో బొగ్గు వాడకం ఎక్కువ. పెట్రోలు, డీజిల్లను ఇంధనంగా వాడు వాహనాలు విపరీతంగా పెరిగిపోయాయి. అందువలన శిలాజ ఇంధనాల నిల్వలు త్వరగా కరిగి, తరిగి పోతున్నాయి. ఇలాగే శిలాజ ఇంధనాల వాడకం కొనసాగితే కొన్ని వందల సంవత్సరాల తరువాత శిలాజనిల్వలు తరిగి పోతూ, బైకులు, కార్లు, బస్సులు, ట్రక్కులు, విమానాలు, ఓడలు ఏవి కదలవు. మళ్ళీ మానవుడు ఎద్దుల బండ్లను, గుర్రపు బళ్ళను, సైకిళ్ళను వాడ వలసి వుంటుంది. కనుక కొంత మేరకు పెట్రోలియం ఇంధనాల వాడకం తగ్గించే నేపథ్యంలో ఈ జీవ ఇంధనాల వైపు ప్రపంచ దృష్టి మళ్ళింది. చెట్లగింజల నుండి తీసిన కొన్ని నూనెలు ఆహార యోగ్యం కాదు. ఉదాహరణకు వేప, కానుగ. జట్రోఫా (అడవి ఆముదం, నేపాళం) వంటి అనేక నూనెలు ఆహార యోగ్యం కాదు. ఈ నూనెలను అల్కహాలసిస్ అనబడు ఎస్టరిఫికేసన్ రసాయన చర్య ద్వారా బయోడీజిల్ గా పరివర్తించి,10% వరకు డీజిల్‌లో కలిపి డిజిల్‌ను ఇంధనంగా వాహనాల్లో వాడటం వలన డీజిల్ వాడకాన్ని చాలా వరకు తగ్గించవచ్చు. డీజిల్‌తో నడిచే వాహనాల్లోని అంతర్గత దహన యంత్రం యొక్క కార్బోరేటరులో తగు మార్పులు చేసిన నేరుగా బయోడిజిల్‌ను వాడవచ్చును. అలాగే డీజల్‌తో నడిచే రైలు ఇంజనులలో బయోడిజిల్‌ను వాడవటం వలన కూడా డీజల్ వాడకాన్ని గణనీయంగా తగ్గించ వచ్చు. పశువుల పేడ, మూత్రాలను ఉపయోగించి బయోగ్యాస్ ఉత్పత్తి కొన్ని దశాబ్దాలుగా ఉత్పత్తి చేస్తున్న విషయం తెలిసినదే. అలాగే ఏదైన జీవద్రవ్య ఘన ఇంధనాన్ని తక్కువ ఆక్సిజన్ అందేలా/లేదా ఆక్సిజన్ రహిత వాతావరణంలో 450ళీ%జ%వద్ద మండించడం వలన జీవ వాయు ఇంధనం ఏర్పడుతుంది. ఘనజీవ ద్రవ్య పదార్థాలను తాపవిచ్ఛేదన / ఉష్ణవిచ్ఛేదన కావించిన హైడ్రోజన్, కార్బన్ మొనాక్సైడ్, మిథేన్, ఈథేను, ఇథైలిన్ వాయువులు ఏర్పడుతాయి. ఈ వాయువులను కండెన్సరు/ద్రవీకరణకారి లోద్రవీకరించిన ద్రవ ఇంధనం/బయోడీజిల్ ఏర్పడుతుంది. భారత గత యూపీఏ కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి వ్యయం తగ్గించడం, వాతావరణ కాలుష్య నివారణకు, విలువైన విదేశీ మారక ద్రవ్యం మదింపుకోసం జీవ ఇంధనాల ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి నిలిపింది. ఇంధన భద్రతే విదేశాంగ విధానాలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేస్తున్న ప్రస్తుత కాలంలో శిలాజ ఇంధనాల నిల్వలు రోజురోజుకూ అడుగంటి పోతున్న కారణంగా కాక, భూ ఉష్ణోగ్రత వ్యాకోచానికి దారి తీస్తున్న, బొగ్గు పులుసు వాయువుల విడుదలను అరికట్టడానికి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను అభివృద్ధి చేయడం అనివార్యంగా మన్మోహన్ సింగ్ ప్రభుత్వం భావించింది. శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా జీవ ఇంధనాలు (బయో ఫ్యూయెల్) అన్ని విధాలా లాభసాటిగా గుర్తించారు. శిలాజ ఇంధనం పెట్రోలు స్థానంలో, కర్బనం తక్కువగా ఉండే బయో డీజిల్ ప్రత్యామ్నాయ రవాణా ఇంధనంగా అభివృద్ధి చేసే దిశలో, ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, బయో ఇంధన ఉత్పత్తులపై దృష్టి నిలిపింది. బయో డీజిల్ విపణి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని భావించి, నిర్ధారించి, చమురు ధరలు పెరిగిపోవడాన్ని దృష్టిలో ఉంచుకొని భారత దేశంలో బయో డీజిల్ అభివృద్ధికి పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందించే దిశగా కృషి చేసింది. బయో డీజిల్ అనగా కానుగ (శాస్త్రీయ నామం: పెన్నేటి) గింజలు లేదా పెద్ద నేపాళం (జట్రోటా) గింజలనుండి తీసే నూనె. బయోడీజిల్ రెండు దశాబ్దాల క్రితమే గుర్తించినా, అది కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతున్నది. సస్టేనెబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆఫ్ రూరల్ ఏరియాస్ (సూత్ర) అనే సంస్థ బెంగళూరులో బయో డీజిల్ తయారీ, వినియోగంపై విస్తృత పరిశోధన జరిపింది. బంజరు భూములు అధికంగాగల భారతావనిలో జీవ ఇంధనాన్ని ఉత్పత్తి చేయడానికి పలు పెద్ద సంస్థలు ప్రయత్నించాయి. కానుగ సాగుకు ఎంతో సాంకేతిక పరిజ్ఞానం అక్కరలేదు. కానుగ చెట్లు నెలకు ఒకటి, రెండు తడులతో మామిడి చెట్లంత పెరుగుతాయి. గృహావరణాల్లో, రోడ్ల కిరువైపులా కానుగ నాటితే ఆహ్లాదకరమైన నీడతోపాటు, వేణ్ణీళ్ళకు చన్నీ ళ్ళ తోడు లాగా ఆదాయం పెరుగుతుంది. ఈ చెట్లు 5 సంవత్సరాలు కాపు ప్రారంభించి, 30 ఏళ్ళ వరకు పంట నిస్తాయి. కానుగ స్వయంగా చీడ పీడల నివారణి అయినందున దానిపై ఎటువంటి చీడ పీడలుండవు. నరేంద్ర మోడీ గత ప్రభుత్వం ఇటీవలి కాలంలో పునరుత్పాదక ఇంధన పథకాలకు విశేష కృషి చేసింది. స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి, అవి అందు బాటు యోగ్యంగా ఉండేలా చూడటానికి ప్రాధాన్యం ఇచ్చింది. దేశంలో సులభతర వాణిజ్య నిర్వహణకు ఎంతో చేయూత అందిస్తున్నది. స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సదుపాయంగా ఉండేలా, అన్ని మంత్రిత్వ శాఖల్లో ప్రాజెక్ట్ అభివృద్ధి విభాగాలను విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విభాగాలను ఏర్పాటు చేసింది. ఇంధన పేదరికాన్ని అంతం చేసే దిశగా, స్వచ్ఛమైన శిలాజ ఇంధనాలను, పర్యావరణ హితమైన ఇంధనాలను తగిన పరిమాణంలో అందుబాటులో ఉంచుకోవడానికి మార్గ నిర్దేశం చేసింది. స్వచ్ఛందంగా శిలాజ ఇంధన వినియోగం, స్వదేశీ ఇంధనాలపై మరింత ఎక్కువగా ఆధారపడటం, విద్యుత్ సేవలను పెంచడం, తాజాగా ఆవిర్భవిస్తున్న హైడ్రోజన్ వంటి ఇంధనాలవైపు మరలడం, అన్ని ఇంధన వ్యవస్థల్లో డిజిటల్ సృజనాత్మక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించడం తదితర అంశాలపై ప్రభుత్వ దృష్టి కేంద్రీకృతం చేసింది.

## 5 ఏళ్లలో లక్ష 80 వేల మంది

# రోడ్డు ప్రమాదాల్లో మృతి...

**ముంబై, డిసెంబర్ 20:**కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ భారతదేశంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని ఒక పెద్ద జాతీయ సమస్యగా అభివర్ణించారు. పార్లమెంటులో తన ప్రసంగంలో, గణాంకాల ప్రకారం, భారతదేశంలో సంవత్సరానికి సుమారు 4.8 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని, వీటిలో దాదాపు 1.8 లక్షల మందికిపైగా మరణిస్తున్నారని ఆయన తెలిపారు. రోడ్డు ప్రమాదాల విషయంలో అత్యంత దారుణమైన రికార్డు మన దేశానిదేనని ఆయన అంగీకరించారు.గడ్కరీ మాట్లాడుతూ, తాను ఏదైనా అంతర్జాతీయ సమావేశానికి హాజరైనప్పుడు, అక్కడ రోడ్డు ప్రమాదాలు లేదా సంఘటనలకు సంబంధించిన ప్రశ్నలు అడిగినప్పుడు, తాను ముఖం దాచుకోవడానికి ప్రయత్నిస్తానని చెప్పారు. అయితే, భారతదేశంలో ఎన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయో, వాటి కారణంగా కేంద్ర రోడ్డు మంత్రి తన ముఖం దాచుకోవాల్సి వస్తుందో మీకు సందేహం రావచ్చు. దాని గురించి తెలుసుకుందాం.భారతదేశంలో గత 5 సంవత్సరాల గణాంకాలు 2018 నుంచి 2022 మధ్య రోడ్డు ప్రమాదాల్లో 7.77 లక్షల మందికిపైగా ప్రాణాలు కోల్పోయారని, ఇది చాలా దారుణమైన రికార్డు అని తెలియజేస్తున్నాయి. ఈ ప్రమాదాలు తగ్గడం లేదు. 2024లో ఈ సంఖ్య సుమారు 1.80 లక్షలకు చేరుకుంది. అంటే, ప్రతిరోజూ సుమారు 485 మంది రోడ్డు ప్రమాదాలలో తమ ప్రాణాలను కోల్పోతున్నారు. 2014లో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోడ్డు ప్రమాదాలను 50 శాతం తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నానని, కానీ తాను దానిని సాధించలేకపోయానని, రోడ్డు ప్రమాదాలు తగ్గడానికి



బదులుగా పెరిగాయని గడ్కరీ బహిరంగంగా అంగీకరించారు.కేంద్ర రోడ్డు రవాణా మంత్రి నితిన్ గడ్కరీ రోడ్డు ప్రమాదాలను దేశానికి ఒక పెద్ద సమస్యగా అభివర్ణించారు. ఆయన ప్రకారం, రోడ్డు ప్రమాదాలలో ప్రాణాలు కోల్పోయిన వారిలో ఎక్కువ సంఖ్య యువతదే. మరణించిన వారిలో దాదాపు 60 శాతం మంది 18 నుంచి 34 సంవత్సరాల మధ్య వయస్సు వారేనని, అంటే చదువు, ఉద్యోగం కుటుంబ బాధ్యతల దశలో ఉన్నారని ఆయన చెప్పారు.కొన్ని ఇతర నివేదికల ప్రకారం, 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు గల వారిలో 66.4 శాతం మంది రోడ్డు ప్రమాదాలలో మరణిస్తున్నారు. గడ్కరీ దీనిపై తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, ఈ వయస్సు వారే దేశ ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధి, భవిష్యత్తుకు వెన్నెముక అని అన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా భారతదేశం ప్రతి సంవత్సరం తన %+ణూ%లో దాదాపు 3 శాతం నష్టాన్ని ఎదుర్కొంటుందని కూడా ఆయన తెలిపారు.దేశంలో రోడ్డు ప్రమాదాల గణాంకాల ప్రకారం, 2018 నుంచి 2022 మధ్య ఉత్తరప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది, ఇక్కడ 1,08,882 మంది రోడ్డు ప్రమాదాలలో తమ ప్రాణాలను కోల్పోయారు. తమిళనాడు రెండో స్థానంలో ఉంది, ఇక్కడ 84,316 మంది మరణించారు. మహారాష్ట్ర మూడో స్థానంలో ఉంది, ఇక్కడ 66,370 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ గణాంకాలు నిజంగా ఆశ్చర్యకరమైనవి.

**సంవత్సరం వారీగా ప్రమాదాలు, మరణాల సంఖ్య**

గణాంకాల ప్రకారం, 2018లో దేశంలో మొత్తం 4,70,403 రోడ్డు ప్రమాదాలు జరిగాయి, ఇవి అన్ని సంవత్సరాల్లో అత్యధికం. ఈ సంవత్సరంలో 1,57,593 మంది మరణించారు. 2019లో ప్రమాదాలు 4,56,959కి తగ్గాయి, కానీ మరణాల సంఖ్య 1,58,984కి పెరిగింది. 2020లో కరోనా లాక్‌డౌన్ కారణంగా రోడ్లపై వాహనాలు తక్కువగా నడిచాయి, కాబట్టి ప్రమాదాలు 3,72,181కి, మరణాలు 1,38,383కి తగ్గాయి, ఇవి ఈ సంవత్సరాలలో అత్యల్పం. 2021లో పరిస్థితులు సాధారణం కావడంతో, ప్రమాదాలు 4,12,432కి పెరిగాయి. మరణాల సంఖ్య 1,53,972కి చేరుకుంది. 2022లో ప్రమాదాలు 4,61,312గా నమోదయ్యాయి, కానీ అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ సంవత్సరంలో 1,68,491 మంది మరణించారు, ఇది అన్ని సంవత్సరాలలో అత్యధికం.

# పాకిస్తాన్ కంటే బంగ్లాదేశ్ తోనే ముప్పు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:**మన దేశానికి అతిపెద్ద శత్రువు పాకిస్తాన్.. ఆ దేశం నుంచే మనకు ముప్పు పొంచి ఉంది. సరిహద్దుల్లో పాకిస్తాన్ వెంటనే మన భద్రతా దళాలు నిత్యం గస్తీ కాస్తుంటాయి. అయితే పాకిస్తాన్ నుంచి కాకుండా, మనకు ప్రధాన ముప్పు బంగ్లాదేశ్ నుంచి పొంచి ఉందని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ హెచ్చరించింది.. బంగ్లాదేశ్ లో విముక్తి యుద్ధం తర్వాత అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని.. అది భారతదేశానికి అతిపెద్ద ఇబ్బందిగా మారుతోందని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హెచ్చరించిందికాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ సభ్యుడు శశిధరూర్ నేతృత్వంలోని ప్యానెల్ బంగ్లాదేశ్ లో చోటు చేసుకుంటున్నా రాజకీయ మార్పులు, చైనా, పాకిస్తాన్ నుంచి పెరుగుతున్న రకరకాల ప్రభావాలు, పాకిస్తాన్ ప్రధానమంత్రి షేక్ హసీనా తన పదవి కోల్పోవడం.. ఈ పరిణామాలపై భారత జాగ్రత్తగా ఉండాలని పార్లమెంటరీ కమిటీ హెచ్చరించింది. బంగ్లాదేశ్ విషయంలో భారత్ తన వ్యూహాన్ని మరోసారి సమీక్షించుకోవాలని సూచించింది."1971లో అనేక సవాళ్ళు



ఎదురయ్యాయి. ఈ క్రమంలో అవి ఒక కొత్త ఆవిర్భావానికి దారితీసాయి. ఇప్పుడు ఆ సవాల్ మరింత తీవ్రంగా మారింది.. తరాల మధ్య అంతరం ఏర్పడిన నేపథ్యంలో రాజకీయ వ్యవస్థలో మార్పు కావాల్సిందే. భారతదేశం ఇప్పుడు ఈ విషయాల గురించి ఆలోచించాలని" పార్లమెంటరీ కమిటీ సూచించింది. అంతేకాదు పాకిస్తాన్ తో బంగ్లాదేశ్ సాగిస్తున్న సంబంధాలు, బంగ్లాదేశ్ లో చిన్న పెడుతున్న పెట్టుబడులు ఆందోళన కలిగిస్తున్నాయని పార్లమెంటరీ కమిటీ హెచ్చరించింది.. %వీశీఅస్త్రశ్రీఖ జూశీతీ%, లాల్మో నిర్హాట్ ఎయిర్ బేస్, పెకువా జలాంతర్గామే స్థావరం వంటి విషయాలను పార్లమెంటరీ కమిటీ ప్రముఖంగా ప్రస్తావించింది.బంగ్లాదేశ్లో జమాతే ఇస్లామి అనే సంస్థ బలంగా కూతలు ఉందని.. దీన్ని కూడా చైనా కలుపుకుపోతోందని.. తన స్థావరాలను ఏర్పాటు చేసుకోవడానికి చైనా ముమ్మరంగా అడుగులు వేస్తోందని పార్లమెంటరీ కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. డెవలప్మెంట్, కనెక్టివిటీ, పోర్ట్ ల అనుసంధానం వల్ల బంగ్లాదేశ్ ను చైనా నుంచి దూరం చేయవచ్చని పార్లమెంటరీ కమిటీ సూచించింది. బంగ్లాదేశ్ లో రాడికల్ ఇస్లామిక్ శక్తులు బలపడుతున్నాయని, షేక్ హసీనా అవామీ లీగ్ పార్టీపై నిషేధం విధించడం వంటి పరిణామాలు బంగ్లాదేశ్లో ఏమైనా చేస్తాయని.. వచ్చే ఎన్నికల్లో అందరిని కలుపుకొని పోయే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని పేర్కొంది

# బెట్టింగ్ యాప్... సెలబ్రిటీల ఆస్తుల జప్తు

**ముంబై, డిసెంబర్ 20:**బెట్టింగ్ యాప్ కేసులో ఈడీ భారీ చర్యలు చేపట్టింది. ఈడీ కోట్లాది రూపాయల ఆస్తులను అటాచ్ చేసింది. ఆస్తులు అటాచ్ అయిన వారిలో యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, ఉర్వశి రౌతేలా, సోనూ సూద్, మిమీ చక్రవర్తి, అంకుష్ హజ్రా, నేహా శర్మ ఉన్నారు.యువరాజ్ సింగ్ - 2.5 కోట్లు రాబిన్ ఉతప్ప - 8.26 లక్షలు ఉర్వశి రౌతేలా - 2.02 కోట్లు (ఈ ఆస్తి వీరి తల్లి పేరు మీద ఉంది..)

**సోనూ సూద్ - 1 కోటి..**

మిమీ చక్రవర్తి - 59 లక్షలు అంకుష్ హజ్రా - 47.20 లక్షలు నేహా శర్మ - 1.26 కోట్లు ఈడీ నేటి చర్యలో భాగంగా 7.93 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది.. ఇంతకుముందు ఇదే కేసులో ఈడీ శిఖర్ ధావన్ ఆస్తులను 4.55 కోట్ల రూపాయలు జప్తు చేసింది.

సురేష్ రైనా ఆస్తులను 6.64 కోట్ల రూపాయలు అటాచ్ చేసింది.ఇప్పటివరకు 1%ఇ% బెట్ కేసులో ఈడీ 19.07 కోట్ల ఆస్తులను అటాచ్ చేసింది.

**కేసు ఏమిటి**

ఈడీ దర్యాప్తులో 1 **xBet** , దాని ఇతర బ్రాండ్లు 1 **xBat, Sporting Lines** భారతదేశంలో ఎటువంటి అనుమతి లేకుండా ఆన్‌లైన్ బెట్టింగ్, జూదం వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయని తేలింది.ఈ సెలబ్రిటీలు విదేశీ కంపెనీలతో ఎండార్స్‌మెంట్ అంటే ప్రకటనల ఒప్పందాలు చేసుకున్నారని, 1 **xBet** ప్రమోషన్ కోసం వీడియోలు, సోషల్ మీడియా పోస్ట్‌ల ద్వారా ప్రకటనలు చేశారని దర్యాప్తులో తేలింది.ఈ చెల్లింపులు నేరుగా భారతదేశంలో కాకుండా, అసలు మూలాన్ని దాచిపెట్టడానికి విదేశీ మార్గాల ద్వారా మళ్లించారు. ఈడీ ప్రకారం, ఈ డబ్బు అక్రమ బెట్టింగ్ ద్వారా సంపాదించిన డబ్బు, దానిని చట్టబద్ధం చేయడానికి ఈ ఒప్పందాలు చేసుకున్నారు.ఈడీ దర్యాప్తులో 1%ఇదీవ్% భారతదేశంలో బెట్టింగ్ కోసం వేలాది నకిలీ లేదా ఇతరుల పేర్లతో ఖాతాలను ఉపయోగించినట్లు తేలింది. ఇప్పటివరకు 6000కు పైగా ఇలాంటి ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాలలో బెట్టింగ్ డబ్బు జమ చేశారు, ఆపై డబ్బును ట్రాక్ చేయకుండా ఉండటానికి అనేకసార్లు వివిధ చెల్లింపు గేట్‌వేల ద్వారా బదిలీ చేశారు.ఈడీ దేశంలోని నాలుగు చెల్లింపు గేట్‌వేలపై దాడులు నిర్వహించింది. ఇప్పటివరకు 60కి పైగా బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఈ ఖాతాలలో సుమారు 4 కోట్ల రూపాయలను నిలిపివేశారు.

# కరాచీ బేకరీలో... క్రిస్మస్ పండుగ వాతావరణం

**హైదరాబాద్:**క్రిస్మస్ సందర్భంగా కరాచీ బేకరీ తమ స్టోర్లలో ప్రత్యేకమైన పండుగ వాతావరణాన్ని అందిస్తోంది. వినియోగదారుల్ని ఆకట్టుకునేందుకు దుకాణదారులు... స్టోర్లలోని క్రిస్మస్ అలంకరణలు, ఫెస్టివ్ డెకార్ మరియు మొత్తం ఇన్-స్టోర్ అనుభూతి ప్రత్యేక ఆకర్షణగా అలంకరించారు. ఈ సందర్భంగా కరాచీ బేకరీ తమ ప్రసిద్ధ ప్లమ్ కేక్ శ్రేణిని కూడా ప్రదర్శిస్తోంది. తాజాగా ప్రారంభించిన జగ్గరీ ప్లమ్ కేక్ మరియు చాకో చిప్ ప్లమ్ కేక్ వేరియంట్లు కూడా వినియోగదారులకు అందుబాటులో ఉన్నాయి. పండుగ గిఫ్టింగ్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, కరాచీ బేకరీ ప్రత్యేక క్రిస్మస్ గిఫ్ట్ బాక్సులు మరియు ఫెస్టివ్ ప్యాకేజింగ్ ఆప్షన్లను కూడా పరిచయం చేసింది. క్లాసిక్ ప్లమ్ కేక్, జగ్గరీ ప్లమ్ కేక్, కస్టర్డ్ సాస్, చాక్లెట్ సాస్, స్ప్రింకిల్స్, దుబాయ్ కునాఫే కుకీస్ మరియు క్రిస్మస్ కునాఫా చాక్లెట్ వంటి అంశాలు ఉన్నాయి. అలాగే, పండుగ సందర్భాల కోసం ప్రత్యేకంగా రూపొందించిన కస్టమైజ్డ్ హాంపర్లను కూడా ప్రవేశపెట్టింది. ఇంకా, క్రిస్మస్ అడ్వెంట్ క్యాలెండర్తో పాటు సాంటా, లేడీ సాంటా, రీండీర్ వంటి పండుగ ఆకారాల్లో రూపొందించిన కోకోటిని చాక్లెట్ ఫిగరిన్లను కూడా ఈ సీజన్లో అందిస్తోంది. అదనంగా, ప్రత్యేకంగా ప్రారంభించిన చాక్లెట్ అడ్వెంట్ క్యాలెండర్ కూడా ఈ పండుగ సీజన్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



# గులాబీ కార్యవర్గ సమావేశానికి అంతా రెడీ..

- మొదటి పేజీ తరువాయి

జల ఉద్యమానికి కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నారా..?ఈ నెల 21వ తేదీన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరగనుంది. ఇందులో పార్టీ కార్యవర్గ సభ్యులతోపాటు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పాల్గొననున్నారు. గులాబీ బాస్ కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో రెండేళ్ల కాంగ్రెస్ పాలన తీరు, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు తీరుతెన్నులపైన ప్రధానంగా చర్చ జరగనుంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ఫలితాలు, సర్పంచ్ ఎన్నికల ఫలితాల పైన సమీక్ష జరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. దీంతో పాటు ప్రధానంగా నదీ జలాల అంశాలపై ఓ కార్యాచరణకు కేసీఆర్ శ్రీకారం చుట్టనున్నట్లు తెలంగాణ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

**1. కృష్ణా జలాల వివాదం – కార్యాచరణ**

కృష్ణా నదీ జలాల నిర్వహణను కు తెలంగాణ ప్రభుత్వం అప్పగించిందని, రాష్ట్ర ప్రయోజనాలను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రానికి తాకట్టు పెట్టిందని గులాబీ బాస్ కేసీఆర్ చెబుతున్నట్లు పార్టీ ముఖ్య నేతలు అంటున్నారు. దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్న వ్యూహంతో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది.

**2. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టు జాప్యంపై సర్కార్‌పై ఒత్తిడి**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులు దాదాపు 90 శాతం పూర్తి చేసినట్లు గులాబీ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు వరప్రదాయిని అయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనుల్లో జాప్యం జరుగుతుందన్నది బీఆర్ఎస్ నేతల ఆరోపణ. పది శాతం పనులను పూర్తి చేస్తే ఆ క్రెడిట్ కేసీఆర్‌కు దక్కుతుందన్న కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తోందన్నది బీఆర్ఎస్ లీడర్ల వాదన. దీంతో పాటు ఈ ప్రాజెక్టు కింద గత బీఆర్ఎస్ ప్రభుత్వం 90 %uవీజ%ల కేటాయింపుల కోసం పోరాడితే, ప్రస్తుత ప్రభుత్వం కేవలం 45 %uవీజ%లకే అంగీకరించిందని విమర్శిస్తున్నారు. ఈ నిర్ణయం తెలంగాణకు తీవ్రంగా అన్యాయం చేసే చర్యగా అభివర్ణిస్తున్నారు. ఈ అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్న యోచనలో కేసీఆర్ ఉన్నట్లు ఆయనకు సన్నిహితంగా ఉండే నేతలు చెబుతున్నారు.

**3. నల్లమల సాగర్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గళం**

ఇటీవలే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెరపైకి తెచ్చిన పోలవరం – నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై కేసీఆర్ సీరియస్‌గా ఉన్నట్లు సమాచారం. గోదావరి జలాలను కృష్ణా బేసిన్‌కు మళ్లించే ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు, ముఖ్యంగా దక్షిణ తెలంగాణకు అన్యాయం జరుగుతుందన్నది కేసీఆర్ భావన. దీనిని అడ్డుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని మండిపడుతూ, న్యాయపోరాటంతో పాటు ప్రత్యక్ష పోరాటాలకు కూడా పిలుపునిచ్చే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు.

**భారీ బహిరంగ సభ, క్షేత్ర స్థాయి కార్యాచరణకు పిలుపు**

నదీ జలాల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను పెద్ద ఎత్తున ప్రజల ముందు పెట్టాలన్న ఆలోచనలో బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఉన్నట్లు నేతలు చెబుతున్నారు. ఇందుకు అనుగుణంగా "తెలంగాణ సమాజం మళ్లీ మేల్కొనాలి" అనే నినాదంతో మరోసారి జల ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. గత కొద్ది రోజులుగా ఈ అంశాలపై కేటీఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, నిరంజన్ రెడ్డి వంటి నేతలతో ఫాం హౌస్‌లో చర్చిస్తున్నట్లు సమాచారం. ప్రజా ఉద్యమంగా దీన్ని తీసుకెళ్లడం ద్వారా తెలంగాణ ప్రజల్లో మరోసారి చైతన్యం వస్తుందని, దీంతో పాటు గత కొద్ది కాలంగా స్తబ్ధుగా ఉన్న పార్టీ శ్రేణుల్లో మునుపటి ఉత్సాహం వస్తుందన్న ఆలోచనలో కేసీఆర్ ఉన్నట్లు తెలుస్తోంది.అయితే ఈ అంశాలపై మహబూబ్‌నగర్ జిల్లాలో భారీ బహిరంగ సభ పెట్టే యోచనలో ఉన్నట్లు సమాచారం. అదే రీతిలో నల్గొండలో కూడా బహిరంగ సభ పెడితే ఎలా ఉంటుందన్న చర్చ సాగినట్లు నేతలు చెబుతున్నారు. జిల్లాల వారీగా పర్యటనలు చేపట్టాలా, లేదా భారీ బహిరంగ సభ నిర్వహించాలా అన్న చర్చ ప్రస్తుతం సాగుతోంది.

# సజ్జనార్ నేతృత్వంలో సిట్...

- మొదటి పేజీ తరువాయి

జాప్యం జరగడంపై ప్రభుత్వం అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో కేవలం కొంతమంది అధికారుల అరెస్టుతోనే ప్రక్రియ ఆగిపోయిందని, అసలైన రాజకీయ కోణాన్ని వెలికితీయడంలో ఇప్పటివరకు జరిగిన విచారణ సరిపోలేదని భావించిన సర్కార్, ఈ బాధ్యతను సజ్జనార్‌కు అప్పగించింది. తాజాగా నియమితులైన సిట్ ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఎక్కడి నుంచి వచ్చాయి? దీని వెనుక ఉన్న రాజకీయ పెద్దలెవరు? అనే కోణంలో సిట్ విచారణ జరుపుతుందని భావిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వ్యక్తుల సహాయంతో ఇజ్రాయెల్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకున్న పరికరాలను ఎలా వాడారు? అనేది నిగ్గు తేల్చనుంది. ఎస్ఐబీ కార్యాలయంలో సాక్ష్యాలను మాయం చేసేందుకు ధ్వంసం చేసిన కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌ల నుంచి డేటాను రీట్రీవ్ చేయడంపై దృష్టి పెట్టనుంది. హవాలా మార్గాల్లో నగదు రవాణాకు మరియు ఎన్నికల సమయంలో ప్రతిపక్షాల ఫోన్లను ట్రాక్ చేయడానికి ఈ వ్యవస్థను ఎలా ఉపయోగించుకున్నారో సిట్ ఆధారాలు సేకరిస్తుందివివాదాస్పద, క్లిష్టమైన కేసులను ఛేదించడంలో సీనియర్ అధికారి వీసీ సజ్జనార్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. టెక్నాలజీపై అవగాహన ఉండటంతో పాటు, కఠినమైన అధికారిగా ఆయనకున్న ఇమేజ్ ఈ కేసులో బాధితులకు నమ్మకాన్ని కలిగిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఆయనకు సహకరించేందుకు మరికొందరు దక్షత కలిగిన అధికారులను కూడా ఈ బృందంలో చేర్చారు. నిందితులను అరెస్టు చేసి చాలా రోజులు జైల్లో పెట్టారు. ప్రభాకర్ రావును అమెరికా నుంచి రప్పించి ప్రశ్నించారు. అయితే ఈ కేసులో ఆధారాలేమీ లభించడండ లేదని తెలుస్తోంది. అందుకే సజ్జనార్ రంగంలోకి దింపారని భావిస్తున్నారు. సిట్ రంగంలోకి దిగిన తర్వాత ఈ కేసులో కీలకమైన మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేశారని అప్పటి విపక్ష నేతలు రేవంత్ రెడ్డి, బండి సంజయ్ సహా చాలా మంది ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక.. ఇంటలిజెన్స్ విభాగంలో అత్యంత సున్నితమైన డేటా కనిపించుకండా పోవడంతో విచారణ చేపట్టారు. దీంతో ఫోన్ ట్యాపింగ్ కేసు వెలుగులోకి వచ్చింది. కానీ ఆధారాలు సేకరించడంలో పోలీసులు సక్సెస్ లేకపోవడంతో సిట్ కు కేసును అప్పగించాలని చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది.

# ఎమ్మెల్యేలకు రేవంత్ క్లాస్..

- మొదటి పేజీ తరువాయి


టికెట్ ఇవ్వడం పార్టీ నియమ నిబంనలకు విరుద్ధమని స్పష్టం చేశారు. నియోజకవర్గాల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరించిన నేతలకు సీఎం రేవంత్ రెడ్డి గట్టిగా హెచ్చరిక జారీ చేశారు. భవిష్యత్‌లో ఇలాంటివి రిపీట్ అయితే ఊరుకునేది లేదని ఆయన స్పష్టం చేశారు. పార్టీ క్రమశిక్షణకు లోబడి , నియమ నిబంధనలు పాటిస్తూ పని చేయాలని తమ వైఖరి మార్చుకోవాలని ఆదేశించారు. అధికారంలో ఉన్నామన్న అశ్రద్ధ పనికిరాదని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన గుర్తు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో సరిగ్గా పని చేయలేదంటూ 16 మంది ఎమ్మెల్యేలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం టెలికాన్ఫరెన్స్ నిర్వహించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు. పంచాయతీ ఎన్నికల



ఫలితాలపై చర్చించారు.పలు ప్రాంతాల్లో రెబల్స్‌ను సమన్వయం చేయలేకపోయారంటూ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లపై రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు.రెబల్స్‌తో సమన్వయ లోపం, బంధువులను అభ్యర్థులుగా నిలబెట్టడం ద్వారా పార్టీకి తీరని నష్టం చేశారని సీఎం అన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ నియమ నిబంధనలకు లోబడి పని చేయాలని ఆదేశించారు.తెలంగాణలో జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో 12,733 స్థానాలకు గాను కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 7,000కు పైగా స్థానాల్లో గెలవగా, బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులు 3,502కు పైగా స్థానాల్లో, బీజేపీ 688 స్థానాల్లో విజయం సాధించారు. తమకు పట్టున్న కొన్ని స్థానాలను కోల్పోవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా ఉంది. ఈ క్రమంలో బాధ్యులపై అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది.తెలంగాణ పంచాయతీ ఫలితాలు కాంగ్రెస్ పార్టీకి ఒకవైపు తిరుగులేని బలాన్ని ఇస్తే, మరోవైపు అంతర్గత ప్రక్షాళనకు అవసరమైన సంకేతాలను ఇచ్చాయి. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ విజయాన్ని కేవలం అంకెల్లోనే చూడటం లేదు. క్షేత్రస్థాయిలో నాయకత్వ జవాబుదారీతనాన్ని కోరుకుంటోంది. ఎమ్మెల్యేలు తమ పనితీరు మార్చుకోకపోతే భవిష్యత్‌లో పార్టీ నుంచి కఠిన చర్యలు తప్పవు అన్న సందేశం సమావేశం ద్వారా స్పష్టమైంది.

# నవ్వుల పాలవుతున్న ఫిరాయింపుల చట్టం

ఒక పార్టీలో గెలవడం, మరో పార్టీలో చేరడం. అక్కడ మంత్రి పదవి రాక పోతేనో, మరో కారణంతోనో మరో పార్టీ లోకి మారడం. పార్టీ అధికారం కోల్పో తుందంటే అధికారం చేపట్టే పార్టీలో చేర డం వంటివి ఈ మధ్య కాలంలో తరచూ వింటున్నాం.. చూస్తున్నాం. వాస్తవానికి ప్రజాస్వామ్యానికి ప్రధాన మూలస్థంభ మైన రాజకీయాలను నెరపే ప్రజా ప్రతిని ధులు ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పనిచేయాలిరాజకీయాల్లో పార్టీ ఫిరాయింపులు సర్వసాధారణంగా మారాయి. ఒక పార్టీలో గెలిచి, మరొక పార్టీలోకి వెళ్లడాన్ని నిరోధించేందుకు చట్టంతెచ్చినా, పెద్దగా ప్రయోజనమైతే కనిపించడం లేదు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న నేతల గోడదూకుళ్లకు అడ్డకట్ట పడాలంటే -ఫిరాయింపుల నిషేధ చట్టాన్ని పటిష్టం చేయాలి. రాజకీయ నేతలు ఒక పార్టీ నుంచి మరొక పార్టీ గూటికి చేరడాన్ని సూచించే ఆయా రామ్- గయా రామ్ సంస్కృతి భారతదేశంలో కొత్తేమీ కాదు.చాలా రాష్ట్రాల్లో నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలు మారిన ఉదంతాలు కోకొల్లలు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలులో పొందుపరచిన ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని 1985లో తీసుకొచ్చారు. 1960ల్లో, 70ల్లో పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలకు ఎన్నికైన సభ్యులు ఇష్టారీతిన పార్టీ ఫిరాయింపులకు పాల్పడేవారు.దాన్ని నిరోధించేందుకు ఈ చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే, చట్టం అమలులోకి వచ్చిన తరవాత కూడా దేశంలో పెద్దసంఖ్యలో ఫిరాయింపులు చోటుచేసుకున్నట్లు రాజ్యాంగం పనితీరును సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ కమిషన్



ఆక్షేపించింది. పదో షెడ్యూలు ఎందుకిలా అచేతనంగా మారిపోయిందనేది ప్రశ్నగానే మిగిలిపోయింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక, గోవా, మణిపూర్, మధ్యప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్. ఇలా అనేక రాష్ట్రాలలో ఫిరాయింపుల పేరిట ప్రజాప్రతినిధులు సులువుగా పార్టీలు మారుతున్నారు. మరి, ప్రజాతీర్పునకు, పార్టీ ఆదేశాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిని అనర్హులను చేయాలంటూ 38 ఏళ్ల కిందట తీసుకొచ్చిన ఫిరాయింపులు నిరోధక చట్టం ఏం చేస్తోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం స్వార్థపూరిత రాజకీయాల చుట్టూనే ప్రజా ప్రతినిధులు తిరుగుతున్నారు. అటు రాజకీయ పార్టీల కు, ఇటు ప్రజా ప్రతినిధులకు నైతిక విలువ లే లేని పరిస్థితి దాపురించింది. పార్టీలు ఫిరాయించడమనేది సర్వసాధారణమై పోయింది. ఫిరాయింపులు పెచ్చరిల్లిపోవ డానికి అన్నీ పార్టీలూ కారణమే. దీనికి అన్నిపార్టీలు బాధ్యత వహించాల్సిన అవ సరముంది. రాజకీయ అవినీతికి, అనిశ్చితి కి, అస్థిరతకు కారణమవుతున్న పార్టీ ఫిరా యింపుల చట్టం గురించి తెలంగాణలో ఇప్పుడు జోరుగా చర్చ సాగుతోంది.రాజ్యాంగం ప్రసాదించిన రాజకీయ స్వేచ్ఛతో తమ రాజకీయ పార్టీల సిద్ధాం తాల బలంతో ప్రజల సమస్యలను పరిష్క రిస్తూ వారి తలలో నాలుకగా మారి వారి అభిమానాన్ని చూ రగొనాల్సిన రాజకీయ విధానానికి కాలం చెల్లింది. ప్రస్తుతం కులాల కుంపట్లు రాజే స్తూ, మత విద్వేషాలను రెచ్చగొడుతూ, ఓటర్లను ప్రలోభపెడుతూ నోట్ల కట్టల ద్వారా ధనవంతులే చట్ట సభల్లోకి ప్రవేశించగలుగుతున్నారు.పార్టీలు సైతం కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఓ ప్రజాప్రతినిధిని గెలిపించుకోవడం కన్నా అందులోని సగం ఖర్చుతో ఫిరాయింపు ద్వారా తమ పార్టీలో కలుపుకోవడం సులభమనే కొత్త సిద్ధాంతం వెలుగు లోకి వచ్చింది. ఫిరాయింపులు జరిగినప్పుడు హార్స్ ట్రేడింగ్ ద్వారా ఎమ్మెల్యేలను అంగట్లో సరుకుల్లా కొనుగోలు చేస్తున్నారు. కానీ ప్రభుత్వాలు మాత్రం మా అభివృద్ధి కార్యక్రమాలతో ఆకర్షితులై మా ప్రభుత్వంలో చేరుతున్నారని బుకాయిస్తూ ఫిరా యింపులను ప్రోత్సహిస్తున్నాయి.ఇటు గెలిచిన ఎమ్మెల్యేలు సైతం అధికారంలో వున్న వారికే అన్ని అభివృద్ధి పథకాలు, ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు అవకాశం ఉంటుందని.. రాజ్యాంగాన్ని విస్మరించి ఫిరాయింపుల ద్వారా అధికారానికి చేరువై స్వామి కార్యంతో పాటు కోట్లకు పడగెత్తాలనే తమ స్వకార్యం కూడా నెరవేరుతోందని భా విస్తున్నారు. ఫలితంగా ప్రతిపక్షమే లేని ప్ర భుత్వాలు కొనసాగుతున్నాయి

# సర్వే ఆఫ్ ఇండియా సాయంతో హైడ్రా ...

- మొదటి పేజీ తరువాయి

అక్రమంగా నిర్మించిన భారీ ప్రహరీ గోడలను నేలమట్టం చేశారు. స్వాధీనం చేసుకున్న ఏడు ఎకరాల భూమి చుట్టూ వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయడమే కాకుండా.. ఇది ప్రభుత్వ భూమి అని తెలిపే హెచ్చరిక బోర్డులను కూడా ఏర్పాటు చేశారు. అదే సర్వే నంబర్‌లోని సుమారు రెండు ఎకరాల్లో ఇప్పటికే పేదలు ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. అయితే.. నివాసాల జోలికి వెళ్లకుండా కేవలం ఖాళీగా ఉన్న కబ్జా భూమిని మాత్రమే హైడ్రా స్వాధీనం చేసుకోవడం విశేషం.ఈ ఆపరేషన్ చేపట్టే ముందు అధికారులు పక్కా ఆధారాలను సేకరించారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లను పరిశీలించగా.. గతంలో అక్కడ ఒక పెద్ద చెరువు ఉన్నట్లు స్పష్టంగా తేలింది. కబ్జాదారులు ఆ చెరువును మట్టితో పూడ్చివేసి, ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు ప్రయత్నించారు. గతంలో కోర్టు వీరికి ఒక కోటి రూపాయల భారీ జరిమానా విధించినప్పటికీ.. కబ్జాదారుల తీరులో మార్పు రాకపోవడంతో హైడ్రా నేరుగా రంగంలోకి దిగింది.హైడ్రా చేపట్టిన ఈ చర్యపై స్థానిక ప్రజల నుండి పెద్ద ఎత్తున ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కుమ్మరి వాడి పీస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అక్రమంగా పూడ్చివేసిన నాలాలు, కుంటలను పునరుద్ధరిస్తే.. వర్షాకాలంలో తమ ప్రాంతానికి వరద ముప్పు తప్పుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. భవానీపురం పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే అక్రమార్కులపై కేసులు కూడా నమోదయ్యాయి. ప్రభుత్వ భూములను కాపాడటం వల్ల భవిష్యత్తు తరాలకు పర్యావరణ సమతుల్యత దక్కుతుందని అధికారులు పేర్కొంటున్నారు.

# న్యూ ఇయర్ సెలబ్రేషన్స్‌కి బిగ్ అలర్ట్..

- మొదటి పేజీ తరువాయి



ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా డ్రగ్స్ బయటపడ్డాయి. నిందితుడు ఎంత తీసుకువచ్చాడు? దీని వెనుక ఎవరు ఉన్నారు అనే కోణంలో ఆర్జిఏఐ విచారణ జరుపుతున్నారు.హైదరాబాద్ వెస్ట్ జోన్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్ ఏబీఎన్ తో మాట్లాడుతూ.. న్యూ ఇయర్ వేడుకలు కేవలం ఆనందం, అహ్లాదం కోసం మాత్రమే ఉండాలి, హద్దు మీరి డ్రగ్స్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. న్యూ ఇయర్ వేడుకలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి తీసుకోవాలి.. అనుమతులు లేకుండా పార్టీలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం. పార్టీలు, పబ్బులలో డ్రగ్స్ వినియోగం లేకుండా నిర్వాహకులు చూసుకోవాలి. డ్రగ్స్‌పై లా అండ్ ఆర్డర్ పోలీసులతోపాటు ఈగల్ టీం నిఘా ఉంటుంది. ప్రైవేట్ ఈవెంట్లకు సామర్థ్యానికి మించి టికెట్లను విక్రయించకూడదు. ఒకవేళ ఈవెంట్స్ కి ఎవరైనా సెలబ్రెటీలు వస్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. ముందస్తు సమాచారాన్ని ఇవ్వడం వల్ల భద్రత కల్పించడం తేలిక అవుతుంది. పార్టీలకు, పబ్బులకు మైనర్లను అనుమతించకూడదు. డిసెంబర్ 31 అర్ధరాత్రి ఆకస్మిక తనిఖీలు ఉంటాయి. సంబరాల పేరుతో మద్యం సేవించి రోడ్లమీదకి రాకూడదు. మైనర్లు వాహనాలు తీసుకుని రోడ్ల మీద కాకుండా తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకోవాలి. న్యూ ఇయర్ సందర్భంగా ఎక్కడికక్కడ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తాం.. ఒకవేళ పట్టుబడితే జరిమానాతో పాటు జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# గ్రేటర్ పై కమలం దృష్టి..




- మొదటి పేజీ తరువాయి

విజయం సాధించేందుకు ప్రత్యేక వ్యూహంతో ముందుకెళ్లాలని ఎంపీలు నిర్ణయించారు.

**పవన్ కు కీలక బాధ్యతలు**

జనసేన అధినేత పవన్ కల్యాణ్ హస్తిన వైపు వెళ్లడం లేదు. ఆయన ఢిల్లీకి వెళ్లి చాలా రోజులవుతుంది. బీజేపీ పెద్దలతో ఆయన టచ్ లో ఉన్నప్పటికీ ఆయన పెద్దగా ఢిల్లీకి వెళుతున్నట్లు కనిపించడం లేదు. మరొకవైపు జనసేనానితో బీజేపీ అగ్రస్థాయి నేతలు టచ్ లోనే ఉన్నారని తెలుస్తోంది. ఆయనను ఏ రకంగా ఉపయోగించుకోవాలన్న దానిపై బీజేపీ కేంద్ర నాయకత్వం ఒక రోడ్ మ్యాప్ ను కూడా తయారు చేసిందని అనాలి. దక్షిణాది రాష్ట్రాల్లో బలపడాలనుకుంటున్న బీజేపీ పెద్దలకు పవన్ కల్యాణ్ ఒక ఆయుధంగా కనిపించారు. ముందుగా తమిళనాడులో పవన్ కల్యాణ్ సేవలను ఎక్కువగా వినియోగించుకోవాలని బీజేపీ కేంద్ర నాయకత్వం ఇప్పటికే డిసైడ్ అయింది.జనసేన ఇప్పుడు తెలంగాణలోనూ బలోపేతం కావాలని పవన్ కల్యాణ్ భావిస్తుండటానికి వెనక కూడా బీజేపీ పెద్దల ఆలోచన ఉందని తెలుస్తోంది. ప్రధానంగా జనసేనను తెలంగాణలో బలోపేతం చేసినట్లయితే అందిన నిఘా నివేదికల ప్రకారం అవసరమైతే పొత్తు పెట్టుకోవచ్చు. లేకుంటే యువత, కొన్ని సామాజికవర్గం ఓట్లను చీలిస్తే ప్రత్యర్థి పార్టీలు నష్టపోతాయన్న అంచనా కావచ్చు. అందుకే ఎప్పుడూ లేనిది జనసేనాని తెలంగాణ జనసేన నాయకత్వంపై దృష్టి పెట్టడం కూడా అందులో భాగమేనని అంటున్నారు. నిజానికి టీడీపీ, వైసీపీ వంటి పార్టీలే తెలంగాణను వదిలేశాయి. కానీ పవన్ కల్యాణ్ తెలంగాణ రాజకీయాలపై దృష్టి పెట్టారంటే బీజేపీ వ్యూహంలో భాగమేనంటున్నారుఇక తమిళనాడు, కేరళ, కర్ణాటక ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ ఒక తురుపు ముక్కగా బీజేపీ కేంద్ర నాయకత్వం భావిస్తుంది. చూసేవారికి పవన్ కల్యాణ్ బీజేపీ నేతలతో పెద్దగా టచ్ గా లేరనిపిస్తుంది. కానీ ఆయన సనాతన ధర్మం, హిందూ ధర్మం వంటి నినాదాలు బీజేపీ నుంచి వచ్చినవేనని ఖచ్చితంగాచెబుతున్నారు. ఆంధ్రప్రదేశ్ లోనూ రాబోయే రోజుల్లో కాబోయే ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని బీజేపీ నాయకత్వం కూడా గట్టిగా భావిస్తుంది. చంద్రబాబు నాయుడు రాజకీయాల్లో ఉన్నంత వరకూ ఓకే. తర్వాత పవన్ కల్యాణ్ తో గేమ్ ఏపీలో నడిపించవచ్చున్న భావన కూడా ఉండిఉండవచ్చు అని అంటున్నారు. మొత్తం మీద పవన్ కల్యాణ్, బీజేపీ డైరెక్షన్ లోనే నడుస్తున్నారని స్పష్టంగా కనిపిస్తుంది.

వార్తాతరంగాలు

ఆదివారం 21 డిసెంబర్ 2025

## అది 'సిగ్గులేని సంసారం': తలసాని శ్రీనివాస్ యాదవ్



**హైదరాబాద్, డిసెంబర్ 20:** కాంగ్రెస్‌లో చేరినా బీఆర్‌ఎస్‌లోనే ఉన్నామని చెప్పుకునే ఆ పది మంది ఎమ్మెల్యేల జీవితం 'సిగ్గులేని సంసారం'అంటూ బీఆర్‌ఎస్ సీనియర్ నేత, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాట్ కామెంట్ చేశారు. ఇవాళ తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన.. కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. స్పీకర్ విచిత్రమైన తీర్పు ఇచ్చారని, ఆ ఎమ్మెల్యేలు బీఆర్‌ఎస్‌లో ఉంటే తమతోపాటు వచ్చి కూర్చోవాలని సవాల్ విసిరారు. 'చేర్చుకున్న వాళ్లు మా వాళ్లు కాదు' అని కాంగ్రెస్ చెబుతోందని ఎగతాళి చేశారు. కేసీఆర్.. తెలంగాణ సాధన వల్లే రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని, లేకపోతే వారికి పదవులే లేవని తలసాని చెప్పారు. 'ఇంకా రెండేళ్లే... తర్వాత మనమే వస్తాం. ఎలా డ్యాన్స్ ఆడిస్తామో అలా ఆడిస్తాం' అని తలసాని హెచ్చరికలు జారీ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా సీఎం రేవంత్ రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల హామీతో కాంగ్రెస్ మోసం చేసిందని, సంక్షేమ నిధులు ఎమ్మెల్యేల ఇళ్ల నుంచి వస్తున్నాయా అని ప్రశ్నించారు. సచివాలయం, ప్రజాభవన్ బాగాలేవని కాంగ్రెస్ అంటోంది.. మరి.. రోజూ అక్కడే ఎందుకు కూర్చొంటారని తలసాని ఎద్దేవా చేశారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచినా ఇలాంటి దరిద్రమైన ప్రభుత్వం చూడలేదని తలసాని అన్నారు. రాష్ట్రంలో 25 ఏళ్ల వరకు కాంగ్రెస్ అనే మాటే రాదని తలసాని జోస్యం చెప్పారు.

## స్టేషన్ ఘన్‌పూర్‌లో ఫ్లెక్సీ పాలిటిక్స్...

**జనగామ, డిసెంబర్ 20**: జిల్లాలోని స్టేషన్ ఘన్‌పూర్‌లో ఫ్లెక్సీల రాజకీయం హాట్‌టాపిక్‌గా మారింది. తిరుమలనాథ స్వామి దేవస్థాన నూతన కమిటీ ప్రమాణ శ్రీకారోత్సవానికి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి స్వాగతం అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ రాజకీయంగా చర్చకు దారితీసింది. ఫ్లెక్సీతో బీఆర్‌ఎస్ శ్రేణులు వినూత్న రీతిలో నిరసన చేపట్టారు. తమ పార్టీలోనే ఉన్నట్టు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు లిఖితపూర్వకంగా కడియం శ్రీహరి వివరణ ఇవ్వడంతో ఈ ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని బీఆర్‌ఎస్ నాయకులు చెబుతున్నారు. ఓవైపు ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఫోటో.. మరోవైపు మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ఫోటోలతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం స్టేషన్ ఘన్‌పూర్ ఫ్లెక్సీ పాలిటిక్స్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బీఆర్‌ఎస్ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

## రాజీ మార్గమే రాజ మార్గం...

**ఈ నెల 21 న జాతీయ లోక్ అదాలత్**

**జాతీయ లోక్ అదాలత్ ద్వారా ప్రజలకు తక్షణ న్యాయం**

**కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలి**

**జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల**



**నిర్మల్:** శనివారం,ఆదివారం జరిగే జాతీయ లోక్ అదాలత్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించబడనుంది. ఈ సందర్భంగా కక్షిదారులు కోర్టు పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. చాలా మంది ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన , తక్కువ ఖర్చుతో పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగపరచుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని తెలియ జేశారు. ఇందులో చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు , సివిల్ డిస్ప్యూట్లు వంటి వివాదాలు లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని,న్యాయ స్థానాల్లో పెండింగ్లో ఉన్న కేసులను తక్కువ సమయంలో ముగించుకోవచ్చన్నారు. అంతేకాకుండా, ఇది ఒక శాంతియుత పరిష్కార విధానం కావున, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. కోర్టు లో గల కేసులలో త్వరగా పరిష్కారం చేసుకుని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల తెలిపారు.

## బేల్ ట్రీ హెూటల్స్ కిచెన్ సెక్షన్ ను ప్రారంభించిన 'కుంభమేళా' ఫేమ్ మోనాలిసా



**హైదరాబాద్:** నగరంలోని ప్రముఖ ఆతిథ్య రంగ సంస్థ 'బేల్ ట్రీ హెూటల్' తన సేవలను మరింత విస్తరిస్తూ, అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన నూతన కిచెన్ విభాగాన్ని ఘనంగా ప్రముఖ సినీ నటి, 'కుంభమేళా' ఫేమ్ మోనాలిసా శనివారం ఉదయం ప్రారంభించారు. హెూటల్ యాజమాన్యం మరియు సిబ్బంది మోనాలిసాకు ఘనస్వాగతం పలికారు. రిబ్బన్ కట్ చేసి, సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆమె కిచెన్ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హెూటల్ పరిసర ప్రాంతాలు అభిమానుల కోలాహలంతో కిక్కిరిసిపోయాయి. కిచెన్‌ను ప్రారంభించిన అనంతరం మోనాలిసా మాట్లాడుతూ.. "బేల్ ట్రీ హెూటల్ కిచెన్ విభాగం చాలా శుభ్రంగా, అంతర్జాతీయ ప్రమాణాలతో ఉండటం సంతోషంగా ఉంది. ఆహార ప్రియులకు ఇక్కడ అద్భుతమైన రుచులు అందుతాయని నాకు నమ్మకం ఉంది. ముఖ్యంగా ఇక్కడి వాతావరణం, ఆతిథ్యం చాలా బాగున్నాయి" అని కొనియాడారు. స్వయంగా కొన్ని వంటకాలను పరిశీలించిన ఆమె స్వయంగా కిచెన్ లో కాఫీ కూడా తయారుచేసి అందరిని ఆశ్చర్యపరిచారు అక్కడ చేయబోయే వంటకాల గురించి మాట్లాడుతూ షెఫ్‌ల నైపుణ్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా.. బేల్ ట్రీ హెూటల్స్ అధినేత రాజారెడ్డి హెూటల్స్ పేరు వెనుక ఉన్న ఆధ్యాత్మిక నేపథ్యం, పరమశివునిపై తనకున్న భక్తి గురించి ఆసక్తికర విశేషాలు వెల్లడించారు."మేము మా హెూటల్‌కు 'బేల్ ట్రీ' అని పేరు పెట్టడానికి ప్రధాన కారణం శివుడు. బేల్ ట్రీ అంటే తెలుగులో బిల్వ వృక్షం. బిల్వ పత్రం అంటే ఆ పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైనది. 'త్రిదళం త్రిగుణాకారం' అంటూ మనం పూజించే ఆ బిల్వ దళాల చెట్టు పేరునే మా సంస్థకు పెట్టుకోవడం మాకు గర్వకారణం. శివుడు అన్నదాత కూడా. కాశీ అన్నపూర్ణేశ్వరి సమేతుడైన ఆ విశ్వేశ్వరుడి ఆశీస్సులు మాపై ఉండాలని కోరుకుంటున్నాము. మా హెూటల్స్ కు వచ్చే ప్రతి కస్టమర్‌కు మేము అందించే భోజనం ఒక ప్రసాదం లాంటిదని, అది వారికి పూర్తి తృప్తిని ఇవ్వాలని మేము ఆశిస్తున్నాము. ఆ తృప్తిని ఇచ్చే శక్తి ఆ భోలేనాథుడిదే అని నేను నమ్ముతాను. వ్యాపార పరంగా ఎన్నో పేర్లు ఉన్నప్పటికీ, ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత ఉన్న బిల్వ వృక్షం పేరును ఎంచుకోవడం వెనుక ఒక పాజిటివ్ వైబ్రేషన్ ఉంది. ఈ పేరు విన్నప్పుడల్లా ఆ శివయ్య గుర్తుకు వస్తారు. హెూటల్‌కు వచ్చే వారికి కూడా ఆ ప్రశాంతత, పవిత్రత అందాలనేది మా సంకల్పం. ఏ పని మొదలుపెట్టినా ఆ మహాశివుడి అనుమతి, ఆశీస్సులు ఉండాలి. అందుకే ఈ రోజు ఈ కిచెన్ విభాగాన్ని ప్రారంభించే సమయంలో కూడా మేము ఆయన్నే స్మరించుకున్నాము. శివుడికి ప్రియమైన ఈ 'బేల్ ట్రీ' పేరుతో మేము అందిస్తున్న ఈ సేవలు అందరికీ చేరువవ్వాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను." అని చెప్పారు.

# ఫ్యూర్ జోన్‌లో మిడిల్ క్లాస్ కాలనీలు



**హైదరాబాద్, డిసెంబర్ 20:** హైదరాబాద్ విశ్వనగరంగా గుర్తింపు పొందింది. దీనిని మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం చేపట్టింది. ఇదే సమయంలో క్యూర్, ప్యూర్, రేర్‌ఈ పేరుతో రాష్ట్రాన్ని మూడు భాగాలు విభజించింది. ఈ నేపథ్యంలో హైదరాద్‌లో సొంత ఇళ్లు కొనడం భారంగా మారింది. హైదరాబాద్ చుట్టుపక్కల భూమి ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం 'అఫర్డబుల్ హౌసింగ్' విధానాన్ని ప్రవేశపెట్టింది. గృహ నిర్మాణ శాఖ మంత్రి పి. శ్రీనివాసరెడ్డి 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' వేదికగా ఈ విషయాన్ని ప్రకటించారు. 'తెలంగాణ%-%2047 విజన్' లక్ష్యాల్లో భాగంగా, మూడు ఆర్థిక జోన్‌లకు సంబంధించి సమగ్ర గృహ నిర్మాణ ప్రణాళికను అమలు చేస్తారు. ఓఆర్‌ఆర్(ఔటర్ రింగ్ రోడ్), రాబోయే ట్రిపుల్ ఆర్(రీజనల్ రింగ్ రోడ్) మధ్య ఉన్న (పెరీ%-%అర్బన్) ప్రాంతాలపై ప్రభుత్వం ప్రధాన దృష్టి పెట్టింది. ఆదాయ స్థాయిపై ఆధారపడకుండా అందరికీ అందుబాటులో ఉండేలా, కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ)తరహాలో పెద్ద ఎత్తున కొత్త కాలనీలను నిర్మించనున్నారు. ఈ కాలనీల్లో రోడ్లు, తాగునీరు, విద్యుత్, పార్కులు, పాఠశాలలు వంటి పూర్తి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ఈ విధానం మధ్యతరగతి, సామాన్య ప్రజలకు చవక్కు ధరలో నాణ్యమైన ఇళ్లు అందించడమే లక్ష్యం. హైదరాబాద్‌లోని కేంద్రీకృత పట్టణీకరణకు బదులు, పరివర్తన ప్రాంతాల అభివృద్ధిని ప్రోత్సహిస్తూ సమతుల్య పెరుగుదల సాధిస్తుంది. పెరిగే జనాభానికి సరిపడా సురక్షిత గృహాలు కల్పిస్తూ, భవిష్యత్ తరాల అవసరాలను దూరదృష్టితో తీర్చనున్నారు. ఈ చర్యలు హైదరాబాద్ పరిధిలో భూసేకరణ ఒత్తిడిని తగ్గించి, దూర ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచుతాయి. గృహ నిర్మాణ రంగానికి కొత్త ఊపు దొరకడంతో ఆర్థిక వృద్ధికి దోహదపడుతుంది. మొత్తంగా, ఈ విధానం రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధికి మైలురాయిగా మారనుంది.

# అబద్ధాలు ఆడటంలో నోబెల్ ఇస్తే అది సీఎం రేవంత్‌కే వస్తది.. హరీశ్‌రావు సెటైర్లు



పంచాయతీ ఎన్నికలు బీఆర్‌ఎస్ సత్తా ఏంటో చూపించాయని మాజీ మంత్రి హరీశ్‌రావు తెలిపారు. కారు జోరుతో కాంగ్రెస్ బేజారయ్యారని ఎద్దేవా చేశారు. ఎప్పుడైనా లోకల్ బాడీ ఎలక్షన్స్‌లో అధికార పార్టీ 90 శాతం గెలిస్తే.. పది శాతం ప్రతిపక్ష పార్టీలు గెలుస్తాయని తెలిపారు. కానీ బీఆర్‌ఎస్ 40 శాతం అంటే.. 4 వేలకు పైగా బీఆర్‌ఎస్ సర్పంచ్ అభ్యర్థులు గెలిచారని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఇవాళ సన్మాన కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కేసులు పెట్టినా.. ఎన్ని డబ్బులు పంచినా.. గుండాయిజం చేసినా అద్భుతంగా ఎదురించి గెలిచారని అన్నారు. గెలిచిన సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి మందికి పుట్టిన బిడ్డను కూడా తన బిడ్డ అనే అంటాడని హరీశ్‌రావు విమర్శించారు. మనం గెలిచిన సర్పంచ్‌లను కూడా రేవంత్ రెడ్డి తన ఖాతాలోనే వేసుకుంటున్నాడని తెలిపారు. సంగారెడ్డిలో బీఆర్‌ఎస్ 35 గెలిస్తే 25 మాత్రమే గెలిచామని అంటున్నాడని మండిపడ్డారు. రాజకీయాల్లో అబద్ధాలు ఆడటంలో నోబెల్ ప్రైజ్ ఇస్తే అది రేవంత్ రెడ్డికే వస్తుందని విమర్శించారు. నంబర్‌వన్ జూటాకోర్ అని ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 50 శాతం లోపే గెలిస్తే.. 66 శాతం గెలిచామని బుకాయిస్తున్నాడని అన్నారు. వచ్చే ఎన్నికల్లో వచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 10, 12 స్థానాలకు మించి గెలవదని అన్నారు. ప్రజలందరూ మళ్లీ కేసీఆర్ కావాలని ఎదురుచూస్తున్నారని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎరువులు ఇచ్చే తెలివి ఉందా అని హరీశ్‌రావు మండిపడ్డారు. పంట పండాలంటే నీళ్లు, కరెంటు, ఎరువులు కావాలని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం యాప్‌లు, మ్యాప్‌లు కావాలంటున్నాడని అసహనం వ్యక్తం చేశారు. నీ ముఖానికి ఎప్పుడైనా వ్యవసాయం చేశావా అని రేవంత్ రెడ్డిని నిలదీశారు. కేసీఆర్ హయాంలో కరెంటు ఫుల్లు.. నీళ్లు ఫుల్లు, ఎరువులు ఫుల్లు అని అన్నారు. కానీ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. పోయిన యాసంగికి బోనస్ ఎగ్గొట్టారని.. రెండు పంటలకు రైతుబంధు ఎగ్గొట్టారని విమర్శించారు. కేసీఆర్ హయాంలో సకాలంలో ఎరువులు ఇచ్చామని గుర్తుచేశారు. రైతుల గ్రామాల్లోకి ఎరువుల లారీలు పంపించామని అన్నారు. యూరియా ఇవ్వడం చేతగాని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్‌ది అని విమర్శించారు. ఏడాదిన్నర నుంచి జిల్లా పరిషత్‌లకు, మున్సిపాలిటీలు, కోఆపరేటివ్ సంస్థలకు ఎన్నికలు పెట్టడం లేదని హరీశ్‌రావు విమర్శించారు. రైతులు తిరగబడతారని రేవంత్‌కు అర్థమైందని.. అందుకే ఎన్నికల జోలికి వెళ్లడం లేదని అన్నారు. బీఆర్‌ఎస్ సర్పంచ్‌లను గెలిపిస్తే నిధులు ఆపేస్తామని కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో చేసిన ప్రచారంపైనా హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. 15వ ఆర్థిక సంఘం 85 శాతం నిధులు ఢిల్లీ నుంచి గల్లీకి నేరుగా వస్తాయని తెలిపారు. ఆ నిధులను మధ్యలో రేవంత్, మంత్రులు ఎవరూ ఆపలేరని పేర్కొన్నారు. ఢిల్లీ నుంచి డబ్బులు డైరెక్ట్‌గా సర్పంచ్ అకౌంట్లలోకి వస్తాయని చెప్పారు. సర్పంచ్ ఎంత పవర్‌ఫుల్ అంటే ఎమ్మెల్యేకి చెక్ పవర్ లేదని.. మంత్రికి చెక్‌పవర్ లేదని.. ముఖ్యమంత్రికి చెక్ పవర్ లేదని.. కానీ గ్రామ సర్పంచ్‌కు చెక్‌పవర్ అని తెలిపారు. ధైర్యంగా పనిచేయండి.. త్వరలో గెలిచిన సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమాలు పెడతామని తెలిపారు. సర్పంచ్ విధివిధానాలు, బాధ్యతలపై ట్రైనింగ్ ప్రోగ్రామ్ పెడదామని చెప్పారు. ఏమున్నా రెండేళ్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని.. మీరు ఐదేళ్ల కోసం సర్పంచ్‌గా గెలిచారని తెలిపారు. మీ పదవీకాలంలో మళ్లీ మూడేళ్లు బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే ఉంటారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన పనులు వీలైనంత వరకు చేయండని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాగానే నేను దగ్గరుండి మీ పనులు చేయించే బాధ్యత నాది అని హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు సూచించారు. తలలో నాలుకలా ఉండాలని.. ఓడిపోయిన వారికి భవిష్యత్ ఉంటదని పేర్కొన్నారు. గెలిచిన వారికి బాధ్యత ఉంటుందని చెప్పారు. ఎదిగినకొద్దీ ఒదగాలి.. ఓపికతో ఉండాలన్నారు. నిన్నటి వరకు దండం పెట్టి ఓటు అడిగి గెలువంగనే మారిపోకూడదని సూచించారు.

# వనపర్తి కాంగ్రెస్ లో 3 ముక్కలాట



**వరంగల్, డిసెంబర్ 20:** సిట్టింగ్ ఎమ్మెల్యే, క్యాబినెట్ ర్యాంకు పదవి ఉన్న సీనియన్ లీడర్. ఈ ఇద్దరి మధ్యే కోల్డ్‌వార్ నడుస్తుంటే..కార్పొరేషన్ ఛైర్మన్ పైగా..డీసీసీ పదవితో మరో లీడర్ ఎంటర్ అయ్యారు. ఈ ముగ్గురిది ఒకే నియోజకవర్గం. పైగా అధికార కాంగ్రెస్ పార్టీ. ఇంకే ముంది వర్గపోరు ఎలా ఉంటుందో అర్థమయ్యే ఉంటుంది. అవును వనపర్తి జిల్లా కాంగ్రెస్‌లో గ్రూప్ పాలిటిక్స్ పీక్ లెవల్‌కు చేరాయి. వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి వర్సెస్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి మధ్య ఉప్పు-నిప్పులా వ్యవహారం నడుస్తోంది. వీరిద్దరి మధ్య మొదటి నుంచి కూడా పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది. వీరిద్దరికి తోడు ఇప్పుడు మరో నేత ఎంట్రీ ఇవ్వడంతో వనపర్తి కాంగ్రెస్ పాలిటిక్స్ మరింత రంజుగా మారాయి. ఇప్పటికే ఇద్దరు కీలక నేతల మధ్య నిత్యం ఓ యుద్ధం నడుస్తుండగా..కాంగ్రెస్ పార్టీ నిర్ణయంతో మరో వర్గం తయారైనట్లు అయిందట. లేటెస్ట్‌గా ప్రకటించిన డీసీసీల జాబితాలో స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనరెడ్డికి వనపర్తి జిల్లా డీసీసీ పగ్గాలు కట్టబెట్టారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన శివసేనరెడ్డి.. గత అసెంబ్లీ ఎన్నికల్లో వనపర్తి టికెట్ కూడా ఆశించారు. ఇప్పుడు శివసేన ఎంట్రీతో వనపర్తి కాంగ్రెస్ రాజకీయం రంజుగా మారిందిపంచాయతీ పోరు నేతల మధ్య వర్గపోరును మరోసారి బట్టబయలు చేసింది. గ్రూప్ వార్ కారణంగా పంచాయతీ పోరులో వనపర్తి కాంగ్రెస్ అనుకున్న ఫలితాలు సాధించలేకపోయిందట. నియోజకవర్గంలో మొత్తం 140 గ్రామ పంచాయతీలు ఉండగా..కాంగ్రెస్ సానుభూతిపరులు 85 చోట్ల గెలుపొందారు. బీఆర్‌ఎస్ మద్దతుదారులు 51 చోట్ల గెలుపొందారు. దీంతో నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్ పార్టీకి బీఆర్‌ఎస్ గట్టి పోటీ ఇచ్చినట్లు అయింది. పంచాయతీ రిజల్ట్స్ ఆశించిన స్థాయిలో రాకపోవడంతో ఎమ్మెల్యే మేఘారెడ్డి గరం గరం అవుతున్నారట. ఎప్పుడూ సౌమ్యంగా.. నెమ్మదస్తుడిగా ఉండే మేఘారెడ్డి..ఆగ్రహంతో ఘాటు వ్యాఖ్యలు చేస్తున్నారు. మొదటి, రెండో విడతల్లో రిజల్ట్ సరిగా రాకపోయేసరికి మూడో విడత ప్రచారంలో భాగంగా ప్రత్యర్థి పార్టీలపై అటాకింగ్ కామెంట్స్ చేశారు. తాను మద్దతిచ్చిన వారు కాకుండా ఇతరులు ఎవరు గెలిచినా..తన ఆఫీస్ గేట్ బయటే మెడపట్టి గెంటేస్తా.. గ్రామ అభివృద్ధికి నిధులు ఇవ్వనని ప్రకటించారు మేఘారెడ్డి. కట్ చేస్తే ఎన్నికల ఫలితాలపై మీడియాతో మాట్లాడుతూ..చిన్నారెడ్డి తీరుపై విరుచుకుపడ్డారు ఎమ్మెల్యే మేఘారెడ్డి. 15 నుంచి 20 గ్రామాల్లో చిన్నారెడ్డి వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి కాకుండా ప్రత్యర్థికి చిన్నారెడ్డి సపోర్టు చేసినట్లుగా తన దగ్గరఆధారాలున్నాయని చెప్పుకొచ్చారు. వనపర్తి కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట క్యాడర్‌కు హెడేక్‌గా మారిందట. నియోజకవర్గానికి చెందిన ముగ్గురు నేతలు..కీలక పదవుల్లో ఉండటంతో..క్యాడర్, లీడర్లు మూడు గ్రూపులుగా విడిపోయారట. ఏ లీడర్ వెంట నడవాలో..ఎవరి దగ్గరికి వెళ్తే ఏ నేతకు కోపం వస్తుందోనని మధన పడుతున్నారట కార్యకర్తలు. ఎమ్మెల్యే మేఘారెడ్డి, సీనియర్ నేత చిన్నారెడ్డి వర్గంగా కాంగ్రెస్ రెండుగా చీలిపోగా..ఇప్పుడు శివసేనరెడ్డి ఎంట్రీ ఇవ్వడంతో కథ గమ్మత్తుగా మారిందంటున్నారు. రానున్న రోజుల్లో డీసీసీ అధ్యక్షుడిగా ఉన్న శివసేనరెడ్డి కూడా తన వర్గాన్ని బలంగా ప్రోత్సహించడం స్టార్ట్ చేస్తే..వనపర్తి కాంగ్రెస్ రాజకీయం..మరింత రచ్చకెక్కడం ఖాయమంటున్నారు కార్యకర్తలు. పార్టీ పెద్దలు జోక్యం చేసుకుని వనపర్తి హస్తంలో గ్రూప్ పాలిటిక్స్‌కు చెక్ పెట్టాలని కోరుతున్నారు. అధిష్టానం ఏం చేయబోతోందో చూడాలి మరి.

## మెడికల్ కాలేజీల్లో పీజీ సీట్ల పెంపుకు గ్రీన్ సిగ్నల్



**హైదరాబాద్, డిసెంబర్ 20:** రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

# ఉపాధి చట్టానికి గాంధీ పేరు మార్చడం దుర్మార్గం

## కాంగ్రెస్ తెలంగాణ గిరిజన సెల్ కో ఆర్డినేటర్ పి. రఘు నాయక్

**రంగారెడ్డి జిల్లా స్పై న్యూస్ డిసెంబర్ 20:**– రంగారెడ్డి జిల్లాలోని షాద్నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ గిరిజన సెల్ కో ఆర్డినేటర్ పి. రఘు నాయక్ మీడియా సమావేశం లో మాట్లాడుతూ మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీజీ పేరు తొలగించడం ఆక్షేపణీయమని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ గిరిజన సెల్ కో ఆర్డినేటర్ పి. రఘు నాయక్ పేర్కొన్నారు పేదల బతుకుల్లో వెలుగులు నింపిన స్కీమ్‌కు వికసిత్ భారత్‌జీ రామ్‌జీగా పేరుపెట్టడం అభ్యంతరకరమని రఘు నాయక్ దుయ్యబట్టారు బీజేపీ ప్రభుత్వ తీరు సమాఖ్య వ్యవస్థపై ప్రత్యక్ష దాడిగా ఉం దని 60, 40 నిధుల నిష్పత్తిని తెరపైకి తెచ్చి ఉద్దేశపూర్వకంగా పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నదని ధ్వజమెత్తారు కొత్త నిబంధనతో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆందోళన వ్యక్తంచేశారు పైగా గాంధీజీ పేరును ఉద్దేశపూర్వకంగా తొలగించి కుట్ర చేసిందని రాజ్యాంగాన్ని సైతం అవమాన పరుస్తున్నారని, కేంద్రం నిర్ణయం పేదలకు పని కల్పించే పథకాన్ని దెబ్బతీయడమేని ఆవేదన వ్యక్తం చేశారు మోడీ ప్రభుత్వం రాష్ట్రాలకు రాజ్యాంగం కల్పించిన స్వయంప్రతిపత్తిని కాలరాస్తున్నదని రఘు మండిపడ్డారు ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని మర్శించారు కేంద్రం నిర్ణయంతో రాష్ట్రంలో లక్షలాదిమంది గిరిజనులు ఉపాధికి దూరమయ్యే ప్రమాదముందని కూడా ఆందోళన వ్యక్తం చేశారు ఉపాధి హామీ చట్టం స్థానంలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్–2025 పేరుతో నూతన బిల్లును పార్లమెంటులో ఆమోదం కోసం ప్రవేశ పెట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు ఉపాధి కరువై గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు పెరుగుతాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు పేదలు, వ్యవసాయ కార్మికులు, గిరిజనులు, దళితులు వామపక్షాలు, గిరిజన ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అప్పటి యూపీఏ ప్రభుత్వంపై పోరాడి 2005లో ఈ చట్టాన్ని సాధించుకున్నారని గుర్తు చేశారు ఉపాధి హామీ చట్టం కోట్లాది మంది జీవన ప్రమాణాలు పెంచేందుకు ఎంతగానో దోహదం చేసిందని అన్నారు రాష్ట్రంలో గిరిజన గూడాలు, తండాల్లో పనులు లేక సుదూర రాష్ట్రాలకు వలసలు వెళ్లే దుస్థితిని ఉపాధి హామీ చట్టం కొంతవరకు నివారించగలిగిందని తెలిపారు ఈ చట్టాన్ని విస్తరించి పట్టణాల్లో అమలు చేయాల్సిన అసరముండగా గ్రామాల్లోనూ తొలగించేందుకు కుట్ర చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు ప్రభుత్వాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉపాధి పనులు చూపాలనే



ఉద్దేశంతో పథకంలో మార్పులు చేయడం బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ భూస్వామ్య మనువాద భావజాలానికి నిదర్శనమని వారు ఆరోపించారు ఇప్పటి వరకు 100 శాతం నిధులిస్తున్న కేంద్రం 60 శాతమే ఇస్తామనీ మిగిలిన 40 శాతం రాష్ట్రాలు భరించేలా ఆ మార్పులు చేయడం చట్టం లక్ష్యాన్ని కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు జాబ్ కార్డుల హేతుబద్ధీకరణ పేరుతో ప్రస్తుతం ఉపాధి పొందుతున్న కోట్లాది మంది కార్డులను తొలగించేలా కొత్త నిబంధనను చేర్చిందని విమర్శించారు వ్యవసాయ పనులు జరిగే 60 రోజులు ఉపాధి నిలిపి వేయాలనుకోవడం కేవలం భూస్వాములు ధనిక రైతులపై ఆధారపడేలా చేసేందుకేనని అభ్యంతరం వ్యక్తం చేశారు నూతన ఉపాధి పథకాన్ని వ్యతిరేకించాలనీ ఉపాధికి గ్యారెంటీ ఇచ్చే పాత చట్టాన్ని అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజాస్వామ్యవాదులు, గిరిజన ప్రజా సంఘాలు పోరాడాలని పిలుపునిచ్చారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ బిల్లును వ్యతిరేకిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు.

# రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాల నిర్వహణ..

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 20(స్పై న్యూస్):** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జనవరి నెలలో రహదారి భద్రతపై జోగులాంబ గద్వాల జిల్లా ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి నెలలో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు సంబంధించి రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఏటా రహదారి ప్రమాదాల కారణంగా ఎంతోమంది మరణించడం, గాయాల పాలవడంతో బాధిత కుటుంబాలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమానులు మృత్యువాత పడితే వారిపై




ఆధారపడ్డ కుటుంబ సభ్యుల బాధలు వేదనకు గురి చేస్తాయన్నారు. రహదారి ప్రమాదాలకు అనేక కారణాలు ఉండడంతో సంబంధిత శాఖల అధికారులందరూ ప్రమాదాల నివారణకు తమ వంతుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా, పోలీస్, అబ్కారి, ఆర్ అండ్ బి, తదితర శాఖల అధికారులందరూ సమన్వయంతో జనవరి నెలలో నిర్వహించే మాసోత్సవాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గద్వాల ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రహదారి భద్రతపై సంబంధిత శాఖల అధికారులతో ఈ ఏడాది ఒక సమావేశం నిర్వహించామని, ప్రమాదాల నివారణకు తగు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జనవరిలో నిర్వహించే మాసోత్సవాలను విజయవంతం చేసేందుకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ప్రజలకు కూడా వివిధ కార్యక్రమాలు నిర్వహించి పెద్ద ఎత్తున అవగాహన కలిగించేందుకు సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. సమావేశంలో ఇన్చార్జి డిటిఓ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, ఆర్ అండ్ బి ఈఈ ప్రగతి, ఎక్సైజ్ అధికారి వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

## సి ఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ నల్లపు లింగయ్య



**నారాయణపేట డిసెంబర్ 20: (స్పైన్యూస్)** ముఖ్యమంత్రి! రేవంత్ రెడ్డి, ఈ నెల 24 న కోస్గి రానున్న నేపథ్యంలో, భద్రతా ఏర్పాట్ల ను శనివారం డీఎస్పీ నల్లపు లింగయ్య పరిశీలించా రు.ఆయనతో పాటు సీఐ సైదులు,ఎస్ బి ఎస్సై నరేష్, ఎస్ఐ లు బాలరాజు, విజయ్ కుమార్ లు కలిసి కోస్గి మండల కేంద్రం కొడంగల్ రూట్ లోని లక్ష్మీ నరసింహ ఫంక్షన్ హాల్ వద్ద బందోబస్తు, హెలిప్యాడ్ ఏర్పాటు స్థలాన్ని, పార్కింగ్ స్థలాలు, భద్రతా పరమైన అంశాలు, బ్యారికేడింగ్, బందోబస్తు వంటి ముఖ్యమైన ఏర్పాట్లను ప్రత్యేకంగా అధికారులతో సమీక్షించారు.ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయా లని అధికారులు సంబంధిత విభాగాలకు సూచించారు. ప్రజా ప్రతినిధులు పాల్గొనే సమావేశంలో భద్రతా చర్యల ను మరింత బలోపేతం చేయనున్నట్లు డీఎస్పీ తెలిపారు.

## జిల్లా వైద్యాధికారికి చిరు సత్కారం

**జోగులమ్మ గద్వాల, డిసెంబర్ 20( స్పై న్యూస్) :** జోగులాంబ గద్వాల జిల్లా వైద్యాధికారిని డాక్టర్ సంధ్య కిరణ్మయినికి దళిత జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ చిరు సన్మానం చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా వైద్యాధికారిని సంధ్యా కిరణ్మయిని శనివారం ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పేద ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, సీజనల్ వ్యాధులు వాటి నివారణ చర్యల గురించి మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వైద్యులు,సిబ్బంది ఎప్పటికప్పుడు విధి నిర్వహణలో జాగ్రత్తలు పాటిస్తూ ప్రజలకు వైద్యం అందిస్తున్నట్లు డాక్టర్ కిరణ్మయి తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులు కాసేపు జాన్ తో పాటు రాము పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు విశిష్ట అవార్డులు ప్రధానం

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 20( స్పై న్యూస్)** వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో అందించిన విశిష్ట సేవలను గుర్తించి అవార్డులను పంపిణీ చేశారు. శంషాబాద్ లోని విస్టా కన్వెన్షన్ లో నిర్వహించిన వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఐకాన్ 2025 వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వాసవి క్లబ్ మరియు వనిత క్లబ్ ఆధ్వర్యంలో అందించిన సేవలను గుర్తించి జిల్లా కేంద్రంలోని వాసవి మరియు వనితా క్లబ్ కు ఉత్తమ అవార్డును క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఇరుకుల రామకృష్ణ క్లబ్ అధ్యక్షులు అర్థం లలితా సాయి కృష్ణకు అందించారు అదేవిధంగా జిల్లా కేంద్రానికి చెందిన ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ హకీం రాజేష్ తోపాటు కోదండరాములకు సన్మానం చేశారు ఈ సందర్భంగా హకీమ్ రాజేష్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ స్థాయిలో ఇచ్చిన కార్యక్రమాలతో పాటు అనేక సేవా కార్యక్రమాలను స్థానిక క్లబ్ నిర్వహించడం జరిగిందని అన్నారు. 2026 సంవత్సరానికి సేవా కార్యక్రమాలు




నిర్వహించేందుకు నూతనంగా ఎన్నుకున్న కమిటీ కూడా విస్తృత సేవలు అందించి అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. అవార్డులు అందుకోవడం మరింత బాధ్యతను పెంచుతాయని సేవల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులు దాతలను ఎల్లప్పుడూ గుర్తించుకుంటారని అన్నారు. పేద విద్యార్థులకు తాము నిరంతరం సేవలు అందిస్తున్నట్లు వివరించారు ఈ సందర్భంగా స్థానిక క్లబ్ అధ్యక్షులు అర్థం సాయి కృష్ణ మాట్లాడుతూ 2025 సంవత్సరంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందని పేద విద్యార్థులకు అండగా నిలవడంతో పాటు సొంత నిధులతో కూడా వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించి ఉత్తమ అవార్డును అందుకోవడం సంతోషంగా ఉందని అన్నారు ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులతో పాటు 108 ఏ గవర్నర్ మిడిదొడ్డి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు

## బలంగా బహుజన ఉద్యమాలను నిర్మిస్తాం

**నాగర్ కర్నూల్ డిసెంబర్ 20( స్పై న్యూస్)** ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో గెలుపు ఓటములను స్ఫూర్తిగా తీసుకొని రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేపడుతూ బహుజన రాజ్యాధికారం సాధిస్తామని బిఎస్పి జిల్లా అధ్యక్షులు బోనాసి రామచందర్ మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న జిల్లా ఇంచార్జ్ యోసఫ్ జోన్ ఇంచార్జ్ పృథ్వీరాజ్ జిల్లా ఇన్చార్జ్ కళ్యాణ్ లు అన్నారు శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఇటీవల ఎన్నికలలో పోటీ చేసి గెలుపొందిన బిఎస్పీ అభ్యర్థులను సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో 10 వార్డ్ మెంబర్లను గెలువడం జరిగిందని వివరించారు. జిల్లావ్యాప్తంగా 52 స్థానాలలో పోటీ చేయడం జరిగిందని వాటిలో పది స్థానాలలో విజయం సాధించడం బహుజన ఐక్యతతోనే సాధ్యమైందని రాబోయే రోజుల్లో జరిగే అన్ని పోటీలలో బీఎస్పీ అభ్యర్థులను గెలిపించేందుకు అన్ని వర్గాలు కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. పాలెం నల్లవెల్లి తూడుకుర్తి జమిస్తాపూర్ గ్రామాలలో అధికార ప్రతిపక్ష పార్టీల



అభ్యర్థులకు దీటుగా నిలవడం జరిగిందని వివరించారు . రాబోయే రోజులలో గెలుపు ఓటములను అంచనా వేసుకుని మరింత ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్ని ఎన్నికల్లో బీఎస్పీ తన సత్తా చాటుతుందని ధీమా వ్యక్తం చేశారు ఈ సమావేశంలో నాయకులు ఆంజనేయులు శ్రీహర్ష కృపానందం శీను మల్లన్న నాగేష్ కురుమయ్య బాలు రమేష్ రామకృష్ణ నాగరాజు మధు శ్రీరాములు నాగేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజలు, కార్మికులను రోడ్డుపైకి తీసుకురావడమే ధర్మమా... సి పి ఎం

**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 20(స్పై న్యూస్):** చట్టాలను నిర్వీర్యం చేసి ప్రజలను, కార్మికులను రోడ్డుపైకి తీసుకురావడమే బిజెపి చెబుతున్న ధర్మమా అని సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. వెంకటస్వామి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ లో గ్రామీణ




ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005లో నాటి యూపీఏ ప్రభుత్వం తో పోరాడి వలసలను నివారించేందుకు, కరువు కాటకాలతో అల్లాడుతున్న ప్రజలకు, కార్మికులకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు వామపక్షాలు కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సాధించుకోవడం జరిగిందన్నారు.ఈ చట్టం వల్ల పనికి స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండా సమాన పని వేతనం లభించిందని అన్నారు. కానీ నేడు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వికసిత భారత్ గ్యారంటీ ఫర్ రోజ్గా అండ్ అజీవిత మిషన్ ద్వారా స్త్రీ పురుష సమానత్వాన్ని నిరోధించిందని అన్నారు. గత చట్టం ప్రకారం ఉపాధి పొందడం ప్రజల హక్కుగా ఉండేదని కానీ నేటి పథకం ప్రకారం అది కేవలం ప్రభుత్వాల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడే విధంగా తయారు చేసిందని అన్నారు. కరోనా,ఆర్థిక సంక్షోభాలు వచ్చిన ప్రతిసారి గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజలకు పని లభించేదని,అమలు చేయకపోతే న్యాయస్థానాలను ఆశ్రయించే అవకాశం ఉండేదని అన్నారు. బడ్జెట్ ను బట్టి కాక డిమాండ్ ను బట్టి బడ్జెట్ ను కేటాయించి పని దినాలను పెంచాలని పోరాటం జరుగుతుంటే నేడు కేంద్ర ప్రభుత్వం దీనిని ఒక పథకంగా మార్చి ప్రజలు కార్మికులకు ఉపాధి లేకుండా చేసిందని విమర్శించారు. సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తూ సంపదను తన వద్ద కేంద్రీకరించుకొని రాష్ట్రాలపై భారాల మోపడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు. పథకం గురించి నీతులు చెప్పే నాయకులు పనిగంటలను పెంచుతున్నామని బహిరంగంగా ఎందుకు చెప్పడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సనాతన ధర్మం గురించి నీతులు చెప్పే బిజెపి నాయకులు ప్రజలకు పని లేకుండా చేసి,చేసిన చట్టాలను నిర్వీర్యం చేసి,ప్రజలను కాలే కడుపులతో రోడ్లపైకి తీసుకురావడమే మీరు ఆచరించే ధర్మమా అని ప్రశ్నించారు.దేశంలో ప్రజలు పోరాటాలతో సాధించుకున్న చట్టాలకు సవరణలు చేస్తూ చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థల అవహేళన చేస్తున్న బిజెపికి పాలించే అర్హత లేదన్నారు.దేశంలో ధర్మం,దేశభక్తి పేరుతో బీజేపీ చేస్తున్న మోసాలను ప్రజలు గమనించాలని, సంఘటితంగా పోరాడి ఉపాధి చట్టాన్ని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఉప్పేర్ నరసింహ,కార్మికులు రంగన్న, నరేష్, కళ్యాణ్, భాస్కర్, బాబన్న,బాలు,గజేంద్ర, రామాంజనేయులు,నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నితిన్ నాబిన్‌ను కలిసిన బిజెపి పార్టీ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి

**రంగారెడ్డి జిల్లా స్పై న్యూస్, డిసెంబర్ 20:**– రంగారెడ్డి జిల్లా లోని షాద్ నగర్ నియోజకవర్గానికి చెందిన బిజెపి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ తో కలిసి భారతీయ జనతా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన శ్రీ నితిన్ నాబిన్ ను ఢిల్లీలోని



బీజేపీ కేంద్ర కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ భేటీ సందర్భంగా నితిన్ నాబిన్ బీజేపీ జాతీయ నాయకుడిగా బాధ్యతలు నిర్వహించిన రోజుల్లో తనతో జరిగిన పాత పరిచయాలు, అనుభవాలను నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి గుర్తు చేసుకున్నారు ఈ సందర్భంగా బిజెపి పార్టీ సీనియర్ నాయకులు నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్త జాతీయ స్థాయి నాయకుడిగా ఎదగగలిగే అవకాశం కల్పించే పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమే సిద్ధాంతానికి నిబద్ధంగా పనిచేసే కార్యకర్తలను గుర్తించి గౌరవించే పార్టీ బీజేపీ అని అన్నారు నితిన్ నాబిన్ గారి నాయకత్వంలో తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని భవిష్యత్ అంతా బీజేపీదే యువతరానిదే అని ఆయన పేర్కొన్నారు.

## తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా రైతుల ను ప్రోత్సహించాలి

**జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వర్...**



**నారాయణపేట డిసెంబర్ 20: (స్పైన్యూస్):** తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించేలా జిల్లా రైతులను ప్రోత్సహించాలని జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వర్ అన్నారు. పీడీ ఆత్మా నారాయణపేట ఆధ్వర్యంలో సమగ్ర పంటల యాజమాన్యం పైన, సమగ్ర ఎరువులు యాజమాన్యం – విస్తరణ పద్ధతుల పైన, ఎరువులు, విత్తనములు – పురుగుమందుల చట్టాల పైన సంబంధిత విషయ నిపుణులతో 2023–24 సంవత్సరంలో 39 మంది విత్తన, 48 మంది పురుగుమందుల డీలర్లకు 48 వారాలపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు.ఈ శిక్షణ తరగతులలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, కేంద్రీయ మెట్ట పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు, కృషి విజ్ఞాన కేంద్రం మదనాపూర్ శాస్త్రవేత్తలు, హాజరై తర్ఫీదునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమం 80 థియరీ క్లాసులతోపాటు 8 క్షేత్ర పర్యటనలు నిర్వహించారు. ప్రతి నాలుగు వారాలకు ఒకసారి ఇంటర్నల్ టెస్టులు, మిడ్ టర్మ్ ఎగ్జామినేషన్ తో పాటు, ఫైనల్ ఎగ్జామ్ నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ మేనేజ్మెంట్ సంస్థ వారు సర్టిఫికెట్స్ జారీ చేయగా, ఇందులో ఒకరు డిస్టింక్షన్ , 32 మంది మొదటి శ్రేణులు ,6 మంది ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. ఉత్తీర్ణత సాధించిన డీలర్లకు శనివారం జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా ఇన్ ఛార్జీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మెరిట్ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఇన్ ఛార్జీ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి డీలరు శిక్షణలో నేర్చుకున్న అంశాలను రైతులకు ఉపయోగపడే విధంగా చేయాలని కోరారు. తక్కువ ఖర్చు తోటి అధిక దిగుబడి, అధిక లాభాలు సాధించే విధంగా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, పాల్గొన్నారు.

వార్తాతరంగాలు
ఆదివారం 21 డిసెంబర్ 2025

## ఈ నెల 23 న “మీ డబ్బు , మీ హక్కు” పై ప్రత్యక అవగాహనా సదస్సు

**ఇంఛార్జి కలెక్టర్ గంగ్వార్**



**నారాయణపేట డిసెంబర్ 20: (స్కైన్యూస్):**కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రి త్వ శాఖ పరిదిలో ఆర్థిక సేవల విభాగం ఆదేశాలకు అనుగుణంగా “మీ డబ్బు మీ హక్కు” అనే ఇతివృత్తంతో క్లెయిమ్ చేసుకొని ఆర్థికకపరమైన ఆస్తులు (సొమ్ము) సమస్యను పరిస్కరించేందుకు చేపట్టిన కార్యక్రమ 31 వారుకు కొనసాగుతుందని నారాయణపేట జిల్లా ఇంఛార్జి కలెక్టర్ సంచిత గంగ్వార్ ఒక ప్రకటనలో తెలిపారు. క్లెయిమ్ చేసుకోని బ్యాంక్ పొదుపులు, ఇన్సూరె న్స్ ఖాతాలు , తదితరాలు క్లెయిమ్ చేసుకొనేందుకు వీలు కల్పించాలనే లక్ష్యంతో ఆర్బిఐ , సెబీ, ఐ ఆర్ డి ఎ బాంకులు ఉమ్మడి శిబిరాలు నిర్వహిస్తాయిని ఇందులో బాగంగా ఈ నెల 23 వ నారాయనపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరుకు శిబిరం నిర్వహించనట్లు తెలిపారు. బాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేసుకొని డిపాజిట్ల వివరాలు ఆర్బిఐ ఉద్గం వెబ్సైట్ ( https:// udgam.rbi.org.in/unclaimed-deposits/#/login ) ద్వారా పొందవచ్చని , క్లెయిమ్ చేసుకొని ఆర్థిక పరమైన ఆస్తులు వాస్తవ యజమానులు వాటిని పొందేందుకు శిబిరంలో బ్యాంక్ శాఖ , భీమా సంస్తని, సంప్రదించవచ్చని , ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.


## బిఆర్ఎస్ నూతన సర్పంచులకు సన్మానం

**లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సన్మానం**



**లక్ష్మీదేవి పల్లి డిసెంబరు 20(స్కై న్యూస్):**కొత్తగూడెం నియోజకవర్గం మాజీ మంత్రి కొత్తగూడెం బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ వనమావెంకటేశ్వరరావు నాయకత్వంలో 17 డిసెంబర్ 2025న జరిగిన స్థానిక సంస్థల ఎలక్షన్స్ లో బి ఆర్ ఎస్ పార్టీ సర్పంచ్అభ్యర్థి గట్టుమల్ల గ్రామపంచాయతీ నుండి గెలుపొందిన బట్టు కనకరాజు ప్రశాంతి నగర్ గ్రామపంచాయతీ నుండి ఉప సర్పంచ్ గా ఎన్నుకోబడిన ఎర్రబడి శ్రీను గడ్డిగుట్ట గ్రామపంచాయతీ ఉపసర్పంచ్గా ఎన్నుకోబడిన బట్టు స్వరూప ని బి ఆర్ ఎస్ పార్టీ లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్షులు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించడం జరిగినది ఈ యొక్క కార్యక్రమంలో ప్రశాంత్ నగర్ వార్డు మెంబర్ శ్రీకాంత్ నాయక్ , మైనార్టీ అధ్యక్షులు ఇక్బాల్ పాషా, మాజీ సర్పంచులు కోరెం చంద్రశేఖర్, తాడూరి రజాక్,బి ఆర్ ఎస్ నాయకులు పొదిలి వెంకటాచలం గోనె సురేష్, భానోత్ రవి ,లావుడియా ప్రసాద్, లావుడియా వెంకటేష్, బట్టు రవి, లావుడియా ప్రసాద్, గట్టు మల్ల వార్డ్ నెంబర్లు పడిగా నాగరాజు, చీమల రవీందర్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ఘనంగా అయ్యప్ప పూజా కార్యక్రమం





**నారాయణపేట డిసెంబర్ 20( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా మండలంలోని సింగారం గ్రామంలో 22 వ పాదం అశోక్ గురుస్వామి స్వగృహంలో అయ్యప్ప పూజ కార్యక్రమం. బైరంకొండ మాజీ సర్పంచ్ సైబన్న రామకృష్ణ గురు స్వాముల ఆధ్వర్యంలో గణపతి అయ్యప్ప సుబ్రహ్మణ్య స్వామి చిత్రపటానికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. అనంతరం అయ్యప్ప స్వాములకు . సివిల్ స్వాములకు. అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో బైరం కొండ చాకలివనీపల్లి గురుస్వాములు అయ్యప్ప బాబుస్వామి అశోక్ శరత్ . బహార్ పేట మాజీ కౌన్సిలర్ నారాయణమ్మ వెంకట్రాములు ల్యాబ్ నరసింహ గోవింద్ రాజ్ తదితరులు పాల్గొన్నారు

## సిపిఐలో చేరిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి

**కండువా కప్పి ఆహ్వానించిన కూనంనేని**



**పాల్వంచ డిసెంబర్ 20 ( స్కై న్యూస్)::** కోడిపుంజుల వాగు నూతన సర్పంచ్ అజ్మీర మహేశ్వరి శ్రీనివాస్ శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) లో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబ శివ రావు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సిపిఐ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై తాజాగా జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన కోడిపుంజుల వాగు సర్పంచ్ మహేశ్వరి సిపిఐ లో చేరారని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గ్రామపంచాయతీ పాలన ముందుకు సాగాలని, రాగద్వేషాలకు తావు లేకుండా పారదర్శకతతో పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పేదల పక్షాన అనునిత్యం పోరాడే సిపిఐ కుటుంబం లోకి రావడం అభినందనీయం అనీ, ప్రజల పక్షాన చేపట్టే ప్రతి మంచి కార్యక్రమం వెనుక సిపిఐ అండదండలు ఉంటాయని అన్నా రు.మహేశ్వరి చేరికతో స్థానిక సంస్థల్లో మరింత బలం పెరిగిందని చెప్పారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ భాష, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశం శెట్టి పూర్ణచంద్రరావు, గుండాల నాగరాజు. మన్యం వెంకన్న అజ్మీర రాములు నాయక్, అజ్మీర శ్రీనివాస నాయక్ బాదావత్ వెంకటరామ్, బాదా వత్ రాములు బాదా వత్ రాంజీ, గూగులోత్ రాములు, బాదావత్ లక్పతి, బానోత్ చందు అజ్మీరా బాలు, అజ్మీర కృష్ణ, తేజవత్ రమేష్. లచ్చిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఆహార నాణ్యత తనిఖీలు విస్తృతంగా చేపట్టాలి...

**ప్రమాణాలు పాటించని హొటళ్లను సీజ్ చెయ్యాలి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**




**నాగర్ కర్నూల్ డిసెంబర్ 20 (స్కై న్యూస్):**ఆహార భద్రత ప్రమాణాలను పాటించని హొటల్స్, రెస్టారెంట్లు, షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆహార ప్రమాణాల తనిఖీ అధికారులను ఆదేశించారు.శనివారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఆహార భద్రత, ఆరోగ్యకరమైన ఆహారాలపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం లో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఇతర ఆహారం తయారు చేసే కేంద్రాల్లో నాణ్యత తనిఖీలు ఫుడ్ ఇన్స్పెక్టర్ విస్తృతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు.ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయటం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొన్ని హొటలలో నాన్ వె జ్ వెజిటేరియన్ ఆహార పదార్థాలను కలిపి తయారు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఆహార భద్రత విషయంలో అనుబంధ శాఖల సమన్వయంతో కొన్ని బృందాలను నియమించుకోవాలని, వాటి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు, హొటళ్ళు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు.వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న 157 ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగిస్తున్న సరుకుల నాణ్యతను కూడా పరిశీలించాలన్నారు. జిల్లాలోని చిరువ్యాపారుల వివరాలు సేకరించాలని, ఆహారం తయారు చేయటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆహార వ్యాపారం చేస్తున్న వారు నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారం అమ్మకాలు సాగించేచోట పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందజేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంట గదులు, వాష్ ఏరియా పరిశుభ్రంగా ఉంచాలని, వీధి వ్యాపారులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.వచ్చే సమావేశం నాటికి జిల్లాలో ఎన్ని హొటళ్లకు లైసెన్సులు ఉన్నాయని ఏ ఏ స్థాయిలో లైసెన్సులు ఉన్నాయో పూర్తి నివేదికలు అందజేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, ఉమ్మడి జిల్లా ఫుడ్ అధికారి ఆనంద్ రావు, డీఈఓ రమేష్ కుమార్, డిఎంహెచ్వోఓ డాక్టర్ రవి కుమార్, డిటి డబ్ల్యూఓ ఫిరంగి, ఫుడ్ ఇన్స్పెక్టర్లు శ్రీలత, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

# పొగమంచుతో జాగ్రత్త సురక్షితంగా గమ్యస్థానం చేరండి...

**జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్**



**నారాయణపేట డిసెంబర్ 20: (స్కైన్యూస్)** వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగటంతో వీలైనంత వరకు వాహనదారులు రాత్రి, తెల్లవారుజామున ప్రయాణాలు చేయద్దని, అత్యవసరమైనచొ వాహనాలను నెమ్మదిగా, సురక్షితంగా నడిపి తమ గమ్యస్థానాలకు చేరాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు.వాతావరణంలో పొగమంచు తీవ్రత పెరగడం కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో జిల్లా ప్రజలు రాత్రి, తెల్లవారుజా మున దట్టమైన పొగమంచు కారణంగా రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు, పాదాచారులను గుర్తించడం, వీక్షించే సామర్థ్యం తక్కువుగా వుంటుంది. ఈ సమయంలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద ప్రమాదాలకు దారితీసే అవకాశాలు ఉన్నందున, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఈ సమయాల్లో ప్రయాణాలనుమానుకోగలరని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అలాగే పొగమంచు ఎక్కువగా ఉండే సమయం లో వాహనాలు నడుపు తున్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎస్పీ సూచిం చారు. వాహనాలను వేగంగా నడపొద్దని, వాహనదారులు శ్రద్ధతో, నిదానంగా ప్రయాణించాలి. తక్కువ వీక్షించే సామర్థ్యం కారణంగా ఇతర వాహనాలు, పాదచారులు, మలుపులు, రోడ్డు విభాగాలు సరిగా కనిపించక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉన్నందున, హెడ్లైట్లను లో బీమ్లో ఉంచి, ఫాగ్ లైట్లను వాడాలని సూచించారు.అత్యవసర సమయాల్లో ప్రయాణం తప్పనిసరి అయితే వాహనాల స్థితిని ముందుగానే తనిఖీ చేసుకోవంతో పాటు ముఖ్యంగా బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగా ఉన్నాయో లేదో సరి చూసుకోవాలని. డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగం, ఆకస్మికంగా ఓవర్టేక్ చేయడం, ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించడం, మద్యం సేవించి వాహనాలు నడపరాదు వంటి ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని. పోలీసుల సూచనలతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ వాహనదారులు వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుకోవడమే జిల్లా ఎస్పీ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు.

# పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో... వీడియో కానఫరెన్స్ ద్వారా సమీక్ష

**నిర్వహించిన జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్**





**సింగరేణి డిసెంబర్ 20( స్కై న్యూస్):**ప్రధాన కార్యలయ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ %b% సిఎస్ఆర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ %b% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో శనివారం నాడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షను నిర్వహించారు.ఈ సంధర్భముగా జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ %b% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కారుణ్యనియామకాల ద్వారా సంస్థలో నియామకమయ్యే వారసుల కు సంబందించిన ఓఎస్ఎల్ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని,సిఎంపిఎఫ్/ సిపిఆర్ఎంఎస్ యొక్క జీవన్ ప్రమాన్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్) రెన్యూవల్ ల గురించి ఈపిఆర్ నందు ఉద్యోగి జీవిత భాగస్వామి/ కుటుంబ సభ్యుల యొక్క పూర్తి వివరాలను నమోదు చేయటం విషయాల గురించి సమీక్షించి, కారుణ్య నియమకాలు టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమములో జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ %b% సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్) లు కేసా నారాయణ రావు,ఎస్.వేంకటేశ్వర రావు బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కే.ప్రవీణ్ కుమార్, సీనియర్ పిఓలు ఎం.శ్రీనివాస్, బి.రణదీప్ గౌడ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, సీనియర్ ఆసిస్టంట్ ఎం.శ్యామ్ కిరణ్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

# టీజీటీడబ్ల్యూఆర్డీసీ పాల్వంచ లో జాతీయ సదస్సు

**ముఖ్య అతిథిలుగా పి. అజయ్ కుమార్ మేనేజర్, మహేందర్ ఎస్ .ఈ (ఆపరేషన్స్)**
**డాక్టర్ జి. పాల్ దేవదానం ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్ ,యెమ్మిగనూర్, కర్నూలు ఏపీ**
**విక్షిత్ భారత్ 2047 కోసం శక్తి పరిరక్షణ స్థిరత్వం**
**టాపిక్: ఎనర్జీ కన్సర్వేషన్ అండ్ సస్టైనబిలిటీ ఫర్ విక్షిత్ భారత్ 2047**





**పాల్వంచ డిసెంబర్ 20( స్కై న్యూస్):**ఇంధన పొదుపు వారోత్సవాలు అంటే విద్యార్థులు కు విద్యుత్, ఇంధన పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించడం, దీనికోసం జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాలను నిర్వహిస్తోంది, ఇందులో భాగంగా ర్యాలీలు, పోస్టర్ విడుదలలు, విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తూ 5 స్టార్ రేటింగ్ పరికరాలు, ఎల్ ఇ డీ లైట్లు వాడటం, అవసరం లేనప్పుడు స్విచ్ ఆఫ్ చేయడం వంటివి ప్రోత్సహిస్తున్నారు.ముఖ్య ఉద్దేశ్యం ఒక యూనిట్ విద్యుత్ ఆదా చేయడం అంటే రెండు యూనిట్లు ఉత్పత్తి చేయడంతో సమానం అని, విద్యుత్ పొదుపు వల్ల ఇంధనం ఆదా అవుతుందని అవగాహన కల్పించడం. భవిష్యత్ తరాలకు వెలుగునివ్వడానికి ఇంధన పొదుపు మనందరి సామాజిక బాధ్యత అని తెలియ చేసారు కళాశాల ప్రిన్సిపాల్ పి.అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ ఆర్ సంగీత, ఏవో రాంబాబు, ఫిజిక్స్ హెచ్ .ఒ .డీ జి సునీత, కె.మానస కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## భారత్ హ్యుందాయ్ నిరుద్యోగులకు జాబ్ మేళా



**కొత్తగూడెం డిసెంబర్ 25 (స్కై న్యూస్ ):** భద్రాద్రికొత్తగూడెం జిల్లా లోని నిరుద్యోగ యువకులకు భారత్ హ్యుందాయ్ ప్రైవేట్ లిమిటెడ్, కొత్తగూడెం నందు పనిచేయుటకు మొత్తం (10) ఖాళీలకు గాను ఉద్యోగాలు కలిపించేందుకు, ఉపాధి కల్పనా శాఖా ఆధ్వర్యంలో డిసెంబర్ 22 అనగ సోమవారం నాడు జాబ్ మేళ, భారత్ హ్యుందాయ్ ప్రైవేట్ లిమిటెడ్ చుంచుపల్లి , కొత్తగూడెం షోరూమ్ , నందు నిర్వహించబడుతుంది. కావున ఈ సదావకాశాన్ని 22 నుండి 30 సంవత్సరముల గల నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధికల్పనశాఖాధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియచేయుచున్నారు. కావున అభ్యర్థులు ఉదయం 10.00 గంటల నుంచే ఇంటర్వ్యూ కొరకు సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో వచ్చి తమ పేరు నమెదు చేసుకోగలరు. సంప్రదించవలసిన నెంబర్ హెచ్ ఆర్ సెల్ నెంబర్ : 7036902902 ఫోన్ చేయగలరని జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ భద్రాద్రి కొత్తగూడెం వారు తెలియజేసినారు

# మాస్టర్ ప్లాన్ దిశగా అడుగులు...

**విజయవాడ, డిసెంబర్ 20:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానంపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఫోకస్ పెట్టారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో కూడిన గ్రీన్ ఫీల్డ్ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇక ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని జాతీయ రహదారుల నెట్‌వర్క్ బలోపేతంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ భేటీలో ప్రధానంగా కృష్ణానదిపై ప్రతిపాదించిన 6 లేన్ల ఐకానిక్ కేబుల్ స్టేడ్ వంతెన నిర్మాణంపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా చర్చించారు. రాజధాని అమరావతికి తలమానికంగా నిలిచే ఈ ఐకానిక్ వంతెన నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల సంస్థ చేపట్టాలని సీఎం చంద్రబాబు కోరారు. మూలపాడు వద్ద నిర్మించే ఈ వంతెన ద్వారా అమరావతిని మూడు కీలక జాతీయ రహదారులతో అనుసంధానించవచ్చని వివరించారు. విజయవాడ–హైదరాబాద్, చెన్నై–కోల్‌కతా జాతీయ రహదారులతో పాటు తీరప్రాంత రోడ్ కారిడార్‌ను ఈ వంతెన నేరుగా కలుపుతుందని సీఎం తెలిపారు. హైదరాబాద్ నుండి అమరావతి వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ హైవే గురించి గడ్కరీతో సీఎం చర్చించారు. ఈ హై–స్పీడ్ యాక్సెస్ కంట్రోల్ రోడ్డు అందుబాటులోకి వస్తే రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేశారు. అమరావతిని నేషనల్ హైవే గ్రిడ్‌లో ఒక మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మార్చడమే తమ లక్ష్యమని సీఎం వెల్లడించారు. దేశంలో జాతీయ రహదారుల నెట్‌వర్క్ విస్తరణలో నితిన్ గడ్కరీ చేస్తున్న కృషిని చంద్రబాబు ఈ సందర్భంగా కొనియాడారు. రహదారుల అభివృద్ధి కేవలం కనెక్టివిటీ మాత్రమే కాకుండా, ప్రాంతాల ఆర్థిక ప్రగతికి బలమైన పునాదులు వేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అమరావతిని జాతీయ రహదారులతో ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా అనుసంధానించడం ద్వారా రాజధాని అభివృద్ధి వేగవంతం అవుతుందని సీఎం విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి ఎంతో కీలకమైన ఈ ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని కోరగా, దీనిపై నితిన్ గడ్కరీ సానుకూలంగా స్పందించారు.

## మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేయాలో జగన్‌కు పక్కా ప్లాన్

**విజయవాడ, డిసెంబర్ 20:**వైసీపీ అధినేత జగన్ తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు ఎంత మేలు చేయాలో అంతా చేశారని, మళ్లీ అధికారంలోకి రాగానే చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా ఆయనకు స్పష్టమైన ప్రణాళిక ఉందని ఆ పార్టీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తాడేపల్లి సమీపంలోని కుంచనపల్లిలో జరిగిన జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి, అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలు జగన్ వెంటే ఉంటారని సజ్జల ధీమా వ్యక్తం చేశారు. "ప్రజలకు మేలు చేసేది జగన్ ఒక్కరేనని కోట్లాది మంది నమ్ముతున్నారు. అందుకే తన ఐదేళ్ల పాలనలో అందరికీ మేలు చేశారు. ఏదో ఆశించి ఆయన సహాయం చేయరు. తన వల్ల ప్రజలకు ఎంత మంచి జరుగుతుందనే నిత్యం ఆలోచిస్తారు" అని తెలిపారు. ఓదార్పు యాత్ర సమయంలోనూ, కరోనా కష్టకాలంలోనూ జగన్ ప్రజలకు అండగా నిలిచిన తీరును సజ్జల గుర్తుచేశారు. జగన్ ఏనాడూ పబ్లిసిటీ కోరుకోలేదని, పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి కాలనీలు సృష్టించారని, 17 మెడికల్ కాలేజీలు, పోర్టులు, హార్బర్లు వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ప్రచారం చేసుకోలేదని అన్నారు. చంద్రబాబు తన 18 నెలల పాలనలోనే రూ.2.70 లక్షల కోట్లు అప్పు చేశారని, కానీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు.

# బీజేపీలో చేరిన ఆమని

**హైదరాబాద్, డిసెంబర్ 20:**ప్రముఖ సినీ నటి, ఒకప్పటి స్టార్ హీరోయిన్ ఆమని భారతీయ జనతా పార్టీ లో అధికారికంగా చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమని బీజేపీ కండువా కప్పుకున్నారు. తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆమెకు పార్టీ సభ్యత్వాన్ని అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి సహా పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. ఆమనితో పాటు ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ శోభలత కూడా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన అనంతరం ఆమని మీడియాతో మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల తనకున్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. మోదీ దేశం కోసం చేస్తున్న గొప్ప పనులకు, ఆయన పనితీరుకు ఆకర్షితురాలై తాను బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. భారతీయురాలిగా చెప్పుకోవడానికి నేను



గర్విస్తున్నాను. మోదీ అడుగుజాడల్లో నడుస్తూ ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాను అని ఆమె పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం సనాతన ధర్మం మరియు భారతీయ సంస్కృతిని కాపాడటానికి చేస్తున్న కృషిని ఆమని కొనియాడారు. కేవలం రాజకీయాల కోసమే కాకుండా, సామాజిక బాధ్యతతో పని చేయాలని తాను భావిస్తున్నట్లు చెప్పారు. గత కొంతకాలంగా సోషల్ మీడియా వేదికగా సామాజిక అంశాలపై స్పందిస్తున్న ఆమె, ఇప్పుడు రాజకీయ వేదిక ద్వారా ప్రజా సేవకు అంకితమవుతానని ప్రకటించారు. 1992లో 'జంబ లకిడి పంబ' చిత్రంతో అరంగేట్రం చేసిన ఆమని, 'శుభలగ్నం', 'శుభ సంకల్పం' వంటి చిత్రాలతో అగ్ర కథానాయికగా గుర్తింపు పొందారు. ఇటీవల ఆమె 'ఆ నలుగురు', '%వీజూ%' వంటి సినిమాల్లో సహాయ పాత్రల్లోనూ మెప్పించారు. ప్రస్తుతం తెలంగాణ బీజేపీలో సినీ గ్లామర్ పెరుగుతున్న తరుణంలో, ఆమని రాక పార్టీ క్యాడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఆమె సేవలను పార్టీ ఏ విధంగా ఉపయోగించుకుంటుందో వేచి చూడాలి.

# జగన్ కు పవన్ కౌంటర్

**తాడేపల్లిగూడెం, డిసెంబర్ 20:**మెడికల్ కాలేజీలు పీపీపీ విధానంలో తీసుకున్న వారిని జైల్లోకి పంపిస్తామని వైసీపీ అధినేత జగన్ చేసిన కామెంట్స్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కౌంటర్ ఇచ్చారు. తాడేపల్లిగూడెంలోని పెరవలిలో పర్యటిస్తున్న పవన్ కల్యాణ్ అక్కడ పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడే అమరజీవి జలధార పథకానికి శంకుస్థాపన చేశారు. ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశం 7,910 కోట్లు ఖర్చు పెట్టి ఈ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అమరజీవి జలధార కార్యక్రమానికి శంకుస్థాపన చేసిన తర్వాత అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు. ఈ సందర్భంగా తన వచ్చిన విమర్శలు ఇప్పుడు వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై స్పందించారు. ఎన్నో కష్టాలు ఎదురుదెబ్బలు తిని పార్టీని పదేళ్లుగా నడుపుతూ వచ్చానని అన్నారు. ప్రజల కోసం చాలా తగ్గినట్టు చెప్పారు. దీన్ని అర్థం చేసుకోలేని వాళ్లు తాను టికెట్లు అమ్ముకున్నట్టు, డబ్బులకు లొంగిపోయినట్టు విమర్శలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ పొట్టి శ్రీరాములు లాంటి వ్యక్తిని ఆదర్శంగా తీసుకొని ఓ వ్యక్తి ప్రయాణం చేస్తున్నాడంటే, దేశమంటే, ప్రజలంటే ఎంత పిచ్చి ఉండాలని



అన్నారు. అలాంటి వ్యక్తిని అర్థం చేసుకోవడం అంత ఈజీ కాదని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇంతలా తీర్పు ఇచ్చినా కొందరికి బుద్ది రాలేదని పవన్ ఫైర్ అయ్యారు. ఇంకా రాష్ట్రంలో రౌడీయిజం చేస్తున్నారని వైసీపీ నేతలపై మండిపడ్డారు. ఇలాంటి వాటి ఆట కట్టించేందుకు తమకు రెండు రోజుల సమయం చాలని అన్నారు. ఇలాంటి వారికి సీఎం యోగి ఇచ్చే ట్రీట్మెంట్ ఇస్తే సెట్ అవుతారని వార్నింగ్ ఇచ్చారు. పిఠాపురంలో చిన్ని పిల్లలను కూడా చూపించి కుల రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. ఇంకా బరితెగించి జైల్లో పెడతామంటూ కాంట్రాక్టర్‌లను ఇతరులను బెదిరిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఇలాంటి బెదిరింపులకు భయపడే ప్రసక్తి లేదని తెలిపారు. అధికారంలో ఉన్నప్పుడే తమను ఏం పీకలేకపోయారని ఇకపై ఏం చేస్తారని అన్నారు. తాను ఎప్పుడు బయటకు వచ్చినా ఇంటికి వెళ్తానో లేదో అనే ఆలోచనతో ఉంటానని ప్రకటించారు. అందుకే తనకు భయం లేదని పేర్కొన్నారు. ఎన్ని విమర్శలైనా ఎదుర్కొనేందుకు సమాధానం చెప్పేందుకు సిద్ధమని పవన్ తెలిపారు. కానీ ప్రతి దానకి ఓ లిమిట్ ఉంటుందని, అలాంటి వారికి గట్టి ట్రీట్మెంట్ ఇస్తామని తెలిపారు. అడ్డగోలుగా ఏది పడితే అది చేస్తామంటే మాత్రం ఊరుకునేది లేదన్నారు. తాజాగా ప్రారంభించిన అమరజీవి జలధార ఐదు జిల్లాల ప్రజలకు మేలు చేస్తుందన్నారు పవన్ కల్యాణ. దాదాపు కోటీన్నర మంది దాహాన్ని తీరుస్తుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కాకినాడ, ఏలూరు, కోనసీమ జిల్లాలకు ప్రయోజనం కలుగుతుందన్నారు.

# మీర్ పేట మర్డర్ కేసులో కొత్త ట్విస్టులు

**హైదరాబాద్, డిసెంబర్ 20:**మీర్పేట్ లో ఈఏడాది జనవరిలో జరిగిన హత్య గతంలో ఎన్నడూ లేనంతగా టెర్రర్ పుట్టించింది. హత్య కేసులలో మీర్పేట్ కుక్కర్ హత్య వేరు అనేంతలా అత్యంత దారుణంగా భార్యను చంపిన తీరు, తెలుగు రాష్ట్రాల్లో ప్రతీ ఒక్కరూ ఉలిక్కిపడేలా చేసింది. మాజీ ఆర్మీ ఉద్యోగి పుట్టా గురుమూర్తి , తన భార్య మాధవిని పక్కా ప్లాన్ తో హత్య చేయడమేకాదు, ఏకంగా పోలీసులకు సవాలు విసిరేలా ఆధార్లాలు సైతం మాయం చేసిన తీరు క్రైమ్ కేసులు చేధించిన ఉద్దండులకే మతిపోయేలా చేసింది. ఇంతలా సంచలనం సృష్టించిన మీర్పేట్ గురుమూర్తి కేసులో త్జాజాగా ఊహించని ట్విస్ట్ వెలుగు చూసింది. భార్యను దారుణంగా చంపడానికి భార్య, భర్తల మధ్య గొడవలు, మనస్పర్ధలు, పుట్టింటికి వెళుతుందనే ఆగ్రహం, ఇలా ఇవన్నీ కారణాలని ఇప్పటి వరకూ అంతా అనుకున్నారు. కానీ వీటిని మించిన ప్రేమాయణం, మరదలితో సాగించిన అక్రమసంబధమే కారణమనే వార్తలు తాజాగా సోషల్ మీడియాలో, కొన్ని మీడియా ఛానళ్లలో చక్కర్లు కొడుతున్నాయి. నిందితుడు పుట్టా గురుమూర్తి , తన మరదలితో గత కొంత కాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తున్నాడని, ఈ విషయం భార్య మాధవికి తెలియడంతో నిలదీసిందని, ఇదే విషయాన్ని ఇంట్లో తల్లిదండ్రులతో చెప్పడంతో గురుమూర్తిని హెచ్చరించారని మీడియాలో వార్తలు హల్ చల్ చేస్తున్నాయి. ఊరు పెద్దల్లో పంచాయితీ పెట్టినా గురుమూర్తి తీరు మారలేదనే, మరదలి కోసమే భార్యను కిరాతకంగా చంపాడనే వార్తలు , వీడియో



కథనాలు మీడియాలో సంచలనంగా మారాయి. ఇంట్లో ఎవరూ చెప్పినా వినకుండా మరదలితో ప్రేమాయణం కొనసాగిస్తున్న గురుమూర్తికి , ఇదే విషయంపై తరుచూ భార్య మాధవితో గొడవలు పడేవాడని, మరదలితో ప్రేమాయణం ఇంట్లో అందరికీ చెప్పి తనను అల్లరి చేస్తోందని భార్య మాధవిపై కక్ష పెంచుకుని అత్యంత దారుణంగా చంపాడనే ట్విస్ట్ పెను దుమారం రేపుతోంది. అయితే ఈ వార్తలను మీర్పేట్ పోలీసులు ఖండిస్తున్నారు. ఏడాది జనవరి నెలలో సంక్రాంతి సెలవులకు పిల్లలను బంధువుల ఇంటికి పంపి,. ఇంట్లో పిల్లలు లేని సమయంలో కావాలనే భార్య మాధవితో గొడవడి,గొంతు నులిమి ఆమె ప్రాణాలు తీసిన విషయం తెలిసిందే. ఆధారాలు దొరకకుండా మాయం చేసేందుకు భార్య శరీరాన్ని ముక్కలుగా కట్ చేసి , కుక్కర్ లో ఉడబెట్టాడు. ఇలా ఎముకలను సైతం గ్రైండర్ చేసి, సమీపంలోని చెరువులో కలిపేశాడు. దుర్వాసన రాకుండా రూమ్ స్ప్రే కొట్టి, ఏం తెలియనట్లుగా సైలెంట్ అయ్యాడు. అమ్మ ఏమైయ్యిందని అడుగుతున్న పిల్లలకు కట్టుకథలు చెప్పాడు. మాధవి తల్లిదండ్రులకు అనుమానం రావడంతో మీర్పేట్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఒళ్లు గగుర్పొడిచే సీన్ బయటపడింది.

**చట్టపరంగా చర్యలు తీసుకుంటాం:** *SHO* , మీర్పేట్ పోలీస్టేషన్

ఎలక్ట్రానిక్ మీడియా, పాత్రికేయ, మీడియా మిత్రులకు ఓ విన్నపము ఏంటంటే.. గురుమూర్తికేసుకు సంబంధించిన విషయంలో పలు మీడియాలలో వస్తున్న కథనాలకుకు సంబంధించిన విషయం పూర్తిగా అవాస్తవమైనది. గురుమూర్తి కేసు హానరబుల్ కోర్టులో ట్రైల్ అవుతున్నది. ఈ సమయంలో ఇలాంటి అవాస్తవమైన విషయాలను ప్రచారములోకి తీసుకురావడం వల్ల బాధితురాలు కుటుంబం చాలా ఆవేదనకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. దయచేసి గురుమూర్తి కేసులో తాజ్హాగా మీడియాలో వస్తున్న ప్రచారాలను నమ్మవద్దు. అలాగే మీడియాలో వాటిని వేయవద్దు. అలా తప్పుడు ప్రచారం ప్రసారం లేదా ప్రచురించడం చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# మమతా పాలనలో అవినీతి....



**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:**పశ్చిమ బెంగాల్‌లోని నాడియాలో జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా మమతా బెనర్జీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. పొగమంచు కారణంగా ర్యాలీ ప్రాంతానికి చేరుకోలేకపోయిన ఆయన, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజలనుద్దేశించి మాట్లాడారు. అధికార టీఎంసీ ప్రభుత్వం బెంగాల్‌లో చొరబాటుదారులను ప్రోత్సహిస్తోందని ఆయన ఆరోపించారు. అందుకే రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తోందని అన్నారు. మమతా బెనర్జీ పాలనలో బెంగాల్లో అవినీతి, బంధుప్రీతి, బుజ్జగింపు రాజకీయాలు రాజ్యమేలుతున్నాయని మోదీ దుయ్యబట్టారు. ఇటువంటి మహా జంగిల్ రాజ్‌కు తగిన బుద్ధి చెప్పాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్‌కు అవకాశం ఇవ్వాలని కోరారు. తృణమూల్ నేతలు, ఆ పార్టీ బీజేపీని ఎంత వ్యతిరేకించినప్పటికీ బెంగాల్ అభివృద్ధిని మాత్రం తాము ఎప్పుడూ ఆపబోమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులను మమత ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. మమతా బెనర్జీ పాలనలో ఉద్రిక్తతలు, అల్లర్లు, బెదిరింపులతో విసిగిపోయిన ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. బీహార్ ఎన్నికల ఫలితం బెంగాల్ ఎన్నికల్లో తమ విజయానికి మార్గం సుగమం చేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

# భారత్ టాక్సీ: డ్రైవర్లే యజమానులు - లాభమే లక్ష్యం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న భారత్ టాక్సీ సహకార నమూనాలో నడుస్తుంది. ప్రైవేట్ క్యాబ్ దిగ్గజాలు ఓలా, ఉబర్‌లకు గట్టి పోటీనిస్తూ.. డ్రైవర్ల సంక్షేమమే పరమావధిగా ఈ సరికొత్త వ్యవస్థ పని చేయనుంది. అమూల్ సంస్థలో పాడి రైతులు ఎలాగైతే వాటాదారులుగా ఉండి లాభాలను పంచుకుంటారో 'భారత్ టాక్సీ'లో క్యాబ్ డ్రైవర్లు కూడా కేవలం పని చేసే వారు మాత్రమే కాదు, ఆ సంస్థలో వాటాదారులుగా ఉంటారు. 'సహకార్ టాక్సీ కోఆపరేటివ్ లిమిటెడ్' ఆధ్వర్యంలో నడిచే ఈ ప్లాట్‌ఫారమ్, లాభాపేక్ష లేని ప్రైవేట్ సంస్థగా కాకుండా, వేలాది మంది డ్రైవర్లు కలిసి నడిపే ఒక సహకార సంఘంగా పని చేస్తుంది. వీరికి 'సారథులు' అని పేరు పెట్టారు. ప్రస్తుతం ఓలా, ఉబర్ వంటి ప్రైవేట్ సంస్థలు ఒక్కో రైడ్‌పై డ్రైవర్ల నుండి 20% నుండి 30% వరకు కమిషన్ వసూలు చేస్తున్నాయి. కానీ, భారత్ టాక్సీ జీరో కమిషన్ మోడల్‌ను అనుసరిస్తుంది. అంటే, ప్రయాణీకుడు చెల్లించే మొత్తం నేరుగా డ్రైవర్‌కే చెందుతుంది. ఈ వ్యవస్థ నడవడానికి డ్రైవర్లు కేవలం స్వల్ప మొత్తంలో నెలవారీ లేదా రోజువారీ మెంబర్‌షిప్ ఫీజు చెల్లిస్తే సరిపోతుంది. దీనివల్ల డ్రైవర్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. కస్టమర్లకు ఈ భారత్ టాక్సీ వల్ల కలిగే అతిపెద్ద ప్రయోజనం నో సర్జ్ ప్రైసింగ్ . సాధారణంగా వర్షం పడినప్పుడు లేదా రద్దీ సమయాల్లో ప్రైవేట్ యాప్‌లు ధరలను రెట్టింపు చేస్తాయి. కానీ భారత్ టాక్సీలో ధరలు పారదర్శకంగా, ప్రభుత్వం నిర్ణయించిన రేట్ల ప్రకారం స్థిరంగా ఉంటాయి. దీనివల్ల సామాన్య ప్రయాణీకులపై అదనపు భారం పడదు.ఈ ప్రాజెక్టు వెనుక అమూల్, ఇఫ్కో , నాబార్డ్ వంటి దిగ్గజ సహకార సంస్థల మద్దతు ఉంది. ఇది ప్రభుత్వ 'డిజిటల్ ఇండియా' విజన్‌కు అనుగుణంగా డిజిలాకర్, ఉమాంగ్ వంటి ప్రభుత్వ యాప్‌లతో అనుసంధానించి ఉంటుంది. ఢిల్లీలో ప్రయోగాత్మకంగా ప్రారంభమైన ఈ సేవలు జనవరి 1, 2026 నుండి పూర్తిస్థాయిలో అందుబాటులోకి రానున్నాయి. 2030 నాటికి దేశవ్యాప్తంగా లక్ష మంది డ్రైవర్లను చేర్చుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రయాణీకుల భద్రత కోసం ఈ యాప్‌లో రియల్ టైమ్ జీపీఎస్ ట్రాకింగ్, డ్రైవర్ల వెరిఫికేషన్ మరియు స్థానిక పోలీసులతో అనుసంధానం వంటి ఫీచర్లు ఉన్నాయి. మల్టీ లాంగ్వేజ్ సపోర్ట్ ద్వారా సామాన్యులు కూడా ఈజీగా ఈ సేవలను వినియోగించుకోవచ్చు

# ఎవ్వరిపై బలవంతంగా అభిప్రాయాలు

**న్యూఢిల్లీ, డిసెంబర్ 20:**అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని, ఈ విషయాన్ని శక్తిమంతమైన దేశాలు గుర్తించాలని విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ అన్నారు. శక్తిమంతమైన దేశమైనా సరే తన ఇష్టాలను ఇతరులపై రుద్దడం సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పుణేలో సింబయోసిస్ ఇంటర్నేషనల్‌లో జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ప్రసంగించారు. ప్రపంచీకరణ మన ఆలోచన విధానంలో, పని విధానంలో ఎన్నో మార్పులు తీసుకువచ్చిందని ఆయన అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక, రాజకీయ వ్యవస్థల్లో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని, అనేక అధికార కేంద్రాలు ఉద్భవించాయని మంత్రి పేర్కొన్నారు. అధికారం అనే పదానికి ఎన్నో అర్థాలు ఉంటాయని వ్యాఖ్యానించారు. వాణిజ్యం, మిలిటరీ, ఇంధనం, సాంకేతికత, ప్రతిభ ఆధారంగా ఇవి మారుతుంటాయని అన్నారు. ఈ విధమైన అధికారం ఏ ఒక్క దేశానికీ పరిమితం కాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రపంచాధిపత్యం కలిగిన దేశాలు గుర్తించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ప్రపంచ దేశాల మధ్య సహజమైన పోటీ ఉంటుందని వ్యాఖ్యానించారు. భారత్ వంటి పెద్ద ఆర్థిక వ్యవస్థలు తయారీ రంగంలో దూసుకెళ్లాల్సిన అవశ్యకతను ఆయన గుర్తు చేశారు.

# క్రీడా స్ఫూర్తిని నిరంతరం కొనసాగిద్దాం..

**: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్ నగర్, డిసెంబర్ 20(స్త్రైన్యూస్)**క్రీడల ద్వారా యువతలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఐక్యత పెంపొందుతాయని, అందుకే ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ రెండవ రోజు పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అంతకుముందు ఆయన క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఈ క్రికెట్ టోర్నమెంట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల నుంచి మొత్తం 16 జట్లు ఉత్సాహంగా పాల్గొనడం హర్షణీయమైన విషయం అని పేర్కొన్నారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ, మౌలిక సదుపాయాలు, శిక్షణ కేంద్రాల



అభివృద్ధికి చర్యలు తీసుకుంటోందని తెలిపారు. క్రికెట్‌కు ఉన్న అపారమైన ఆదరణతో పాటు ఐపీఎల్ వంటి టోర్నమెంట్ల కారణంగా యువ క్రీడాకారులకు అవకాశాలు మరింతగా పెరిగాయని, సరైన శిక్షణతో కృషి చేస్తే ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యమేనని ఆయన స్పష్టం చేశారు. ప్రారంభమైనప్పటి నుంచే టోర్నమెంట్‌లో జరుగుతున్న మ్యాచ్‌లు క్రీడాభిమానులను ఆకట్టుకునే విధంగా ఉత్కంఠభరితంగా, మంచి క్రీడాస్ఫూర్తితో కొనసాగుతున్నాయి. యువతలో క్రీడా ప్రతిభను ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌ను సమర్థవంతంగా నిర్వహిస్తున్న ఆర్గనైజర్స్‌కు ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, పోటీల్లో పాల్గొంటున్న అన్ని జట్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ క్రికెట్ పోటీలు క్రీడాస్ఫూర్తిని పెంపొందించి, యువతలో ఐక్యతను మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుమ్మరి నరసింహ, జిల్లా కోశాధికారి బాలచందర్, పట్టణ అధ్యక్షులు అంజి యాదవ్, కార్యదర్శి రవికుమార్ యాదవ్ , ఉపాధ్యక్షులు కరీం , ఉపాధ్యక్షులు తైద శీను, శ్రీనివాస్ రెడ్డి , మాజీ జిల్లా అధ్యక్షులు గంజి శ్రీనివాసులు , ముఖ్య సలహాదారులు రాఘవులు, రాముడు , సయ్యద్ నుసురత్, బాబా, వాజిద్, ముక్తదీర్ , ఆర్గనైజర్స్, ఖదీర్, అయుబ్, అమీర్, వసీం, మల్లేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానం...

**ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

## - కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా సెమి క్రిస్మస్ వేడుకలు

**మహబూబ్ నగర్, డిసెంబర్ 20(స్త్రైన్యూస్)**ఏసు క్రీస్తు బోధనలు విశ్వశాంతికి సోపానమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్ ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసు క్రీస్తు ఈ లోకానికి ప్రేమ, క్షమ, త్యాగం, సేవ అనే అమూల్యమైన విలువలను బోధించారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రైస్తవుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రతి ఏడాది సెమి క్రిస్మస్ వేడుకలు




నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నదని అన్నారు. డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ మాట్లాడుతూ సేవాభావానికి ప్రేమకు, శాంతికి ప్రతిరూపం యేసుక్రీస్తు అని అన్నారు. పరోపకారం, ప్రాణుల పట్ల సేవాభావం కలిగి ఉండడాన్ని అలవర్చుకోవాలని సూచించారు. జిల్లాలో అన్ని పండుగలను ఒకరినొకరు కలిసిమెలిసి జరుపుకుంటారని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధియే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి , నాయకులు చంద్రకుమార్ గౌడ్, వినోద్ కుమార్, ఎన్పీ.వెంకటేశ్, జహీర్ అఖ్తర్, సిరాజ్ ఖాద్రీ, మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్ కుమార్ గౌడ్, నాయకులు బెక్కరి మధుసూదన్ రెడ్డి, అజ్మత్‌అలీ, రాములు యాదవ్, నాగరాజు, ప్రవీణ్ కుమార్, పక్రు, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పది రోజుల్లో జర్నలిస్ట్ అక్రిడిటేషన్ కార్డుల జీవో

**ఖమ్మం, డిసెంబర్ 20(స్త్రైన్యూస్)**జర్నలిస్టుల చిరకాల వాంఛలైన ఇళ్ల స్థలాలుఅక్రిడిటేషన్ కార్డుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టి డబ్ల్యు జె ఎఫ్) జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు



చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జిఓ) విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఇళ్ల స్థలాలపై స్పష్టత :జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు. టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

# సాంప్రదాయ నృత్య కళాకారిణి యామిని

యామినీ కృష్ణమూర్తి. నాట్యకళతో పెనవేసుకున్న ఈ పేరు వినని భారతీయులు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. పద్మశ్రీ, పద్మ భూషణ్, పద్మ విభూషణ్ మూడు సొంతం చేసుకున్న ప్రతిభాశాలి. నాట్య కళారీతులైన భరత నాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నృత్యాలలో పరి పూర్ణత్వం సాధించిన ప్రముఖ నాట్య శాస్త్ర కోవిదురాలు. దేశవిదేశాల్లో వేలాది నాట్య ప్రదర్శనలు ఇవ్వడమే కాక, విదేశాల్లో కూచిపూడి నాట్యానికి మిగుల ప్రచారం కల్పించిన ప్రతిభాశాలి. వివిధ రకాల నృత్యాలను కళా పూర్ణులైన గురువుల వద్ద ఎంత నేర్చుకున్నా, తనదంటూ ప్రత్యేక ఒరవడి, బాణీని ఏర్పరకుని ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. ప్రదర్శించేది ఏ నాట్య రకమైనా, ఒకదాని కొకటి మేళవింపు కాకుండా, సాంప్రదాయ పద్ధతులను అతిక్ర మించకుండా, నృత్య రీతులను కలగాపులగం చేయకుండా ప్రదర్శించడం ఆమెకే సొంతం. అంతర్జాతీయ స్థాయిలో కూచిపూడి నర్తనానికి ఖ్యాతి రావడానికి చాలా కాలం ముందే ఈమె అమెరికా, ఐరోపా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇండోనేషియా, బ్యాంకాక్, సింగపూర్, బర్మా ఇత్యాది ఎన్నోదేశాలు పర్యటించి ఆయా చోట్ల నృత్య ప్రదర్శనలిచ్చి, భారతీయ నాట్య గొప్పతనాన్ని చాటి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా, మదనపల్లిలో 1940 డిసెంబరు 20న జన్మించిన ఆమె కుటుంబంతో పాటు తమిళనాడు లోని చిదంబరంలో స్థిరపడింది. ఆమె పూర్తి పేరు యామినీ పూర్ణతిలకం. తన తండ్రి ప్రోత్సాహంతో తన 5వ ఏట చెన్నైలోని రుక్మిణీదేవి అరండేల్ కళాక్షేత్రంలో భరత నాట్యము నేర్చుకోవడము ప్రారంభించింది. భరత నాట్యంలో ఈమె గురువులు కాంచీపురం ఎల్లప్ప పిళ్ళై, చొక్కలింగం పిళ్లై, బాలసరస్వతి, తంజావూర్ కిట్టప్ప, దండాయుధ పాణి, మైలాపూర్ గౌరి అమ్మ మొదలైనవారు. ఈమె వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి, చింతా కృష్ణమూర్తి, పసుమర్తి వేణుగోపాల కృష్ణశర్మ వంటి వారి వద్ద కూచిపూడి నేర్చింది. పంకజ చరణ్‌దాస్, కేలూచరణ్ మహాపాత్రల వద్ద ఒడిస్సీ నేర్చుకొన్నది. ఎం.డి.రామనాథన్ దగ్గర కర్ణాటక సంగీతం, కల్పక్కం స్వామినాథన్ దగ్గర వీణ నేర్చుకొంది. కర్ణాటక సంగీతం కూడా నేర్చుకుని పాటపాడ్నుతూ, భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో ప్రావీణ్యం సంపాదించి, యామిని 1957లోతన 17వ యేట చెన్నైలో 1957వ సంవత్సరంలో తొలి నృత్య ప్రదర్శన ఇచ్చింది. అప్పటి నుంచి వేలాదిగా ప్రదర్శనలిచ్చి దేశ, విదేశాల్లో పేరు పొందినది. 20సంవత్సరాల వయసు వచ్చే సమయానికి ఈమె ఒక ప్రతిభావంతురాలైన నర్తకిగా గుర్తింపు పొంది, తన మకామును ఢిల్లీకి మార్చింది. దేవులపల్లి కృష్ణశాస్త్రి ఆకాశవాణి కోసం రచించిన క్షీరసాగర మధన" నృత్య రూపకాన్ని కూచిపూడి సిద్ధేంద్ర కళాక్షేత్రంలో, మొదటి సారి యామినీ కృష్ణమూర్తి "విశ్వమోహిని" పాత్రలో, ధన్వంతరి, మహావిష్ణువు పాత్రల్లో వేదాంతం సత్యనారాయణ శర్మ నటించి ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారు. భామాకలాపం"లో సత్యభామగా అవతరించే వైఖరి, "మండూక శబ్దం"లో కృష్ణదేవరాయల ప్రశస్తిని లీలగా చూపే అభినయం, భంగిమల్లోని ఠీవి, ఔచిత్యం, "సింహాసనస్థితే" శ్లోకంలో దేవిని కళ్ళకు కట్టిస్తూ పట్టే భంగిమలు, "కృష్ణశబ్దం"లో భావతీవ్రత, లాలిత్యం, వైవిధ్యం ఈమె ప్రతిభకు తార్కాణాలు. వేదాలకు కొన్ని పసందైన జతులతో ఈమె కూర్చిన నృత్యం ఈమె పాండిత్యానికి ఉదాహరణ. కూచిపూడి నృత్యానికి సంబంధించి డీవీడీలు విడుదల చేసింది. తన నృత్యప్రస్థానాన్ని "రేణుకా ఖాండేకర్" సహకారంతో "ఎ ప్యాషన్ ఆఫ్ డాన్స్" పేరుతో పుస్తకంగా రాసింది. "నృత్యమూర్తి" సీరియల్‌ను పదమూడు భాగాలుగా ఆమె రూపొందించి దూరదర్శన్‌లో ప్రసారం చేసింది. మన సంస్కృతీ వైభవానికి గోపురమై నర్తనశిల్పాల ఆధారంగా, స్థలపురాణాలు, చరిత్ర జోడించి వ్యాఘ్రపాద, పతంజలి సూక్తులు, కర్ణాటక సంగీతం రుచిచూపిస్తూ ఈ సీరియల్‌లో నృత్య సర్వస్వాన్ని ఇమిడ్చి చూపించింది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన నర్తకిగా నియమించబడింది. న్యూఢిల్లీలోని ఇందిరా ప్రియదర్శిని ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మ్యూజిక్ అండ్ డాన్స్ అనే సంస్థకు ఈమె డైరెక్టరుగా సేవలను అందించడం తో పాటు, ఢిల్లీలో నృత్య కౌస్తుభ కల్చరల్ సొసైటి యామిని స్కూల్ ఆఫ్ డాన్స్ పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి యువతకు భరతనాట్యం, కూచిపూడి నృత్యాల్లో శిక్షణ అందించడంపై ప్రధానంగా దృష్టి సారించింది. ఫిలింస్ డివిజన్ ఆఫ్ ఇండియా 1971లో ఏల్చూరి విజయరాఘవ రావు సంగీత దర్శకత్వంలో "యామినీ కృష్ణమూర్తి" పై 20 నిమిషాల ఒక డాక్యుమెంటరీ సినిమా తీసింది. క్షీరసాగర మథనం నృత్య నాటికను భారత మలి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాక్రిష్ణన్ ముందు ప్రదర్శించి ఆయన నుండి ,"భామావేణీ" బిరుదును అందుకున్నది. అంతే కాక యామిని సేవలను గుర్తించిన ప్రభుత్వం 1968లో పద్మశ్రీ 2001లో పద్మ భూషణ్ 2016లో పద్మ విభూషణ్ పురస్కారాలను ప్రదానం చేసింది. 2014లో మహిళా దినోత్సవం సందర్భంగా శాంభవి స్కూల్ ఆఫ్ డాన్స్ సంస్థ యామినికి నాట్య శాస్త్ర పురస్కారాన్ని అందించింది. 2017లో విశాఖపట్నంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ వారు ఈమెకు స్వర్ణకమలం బహూకరించి "నాట్య విద్యాభారతి" అనే బిరుదును ఇచ్చి సత్కరించారు.

## క్షయ నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి
## జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్

**జగిత్యాల :** క్షయ వ్యాధి నివారణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు..శుక్రవారం మోతే వాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టిబి అలర్ట్ ఇండియా ఆధ్వర్యంలో టిబి ఛాంపియన్ల కోసం శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై, ప్రభుత్వం చేపడుతున్న టిబి నిర్మూలన చర్యలు, ప్రతి ఏఏఎం సెంటర్ మరియు సబ్-సెంటర్ స్థాయిలో టిబి లక్షణాలపై అవగాహన కార్యక్రమాల ఆవశ్యకత గురించి టిబి ఛాంపియన్లకు వివరించారు. అలాగే, క్షయ వ్యాధిగ్రస్తులకు నిక్షయ్ పోషణ్ యోజన పథకం క్రింద ప్రభుత్వం అందిస్తున్న నెలకు 500 రూపాయల ను పోషకాహారం నిమిత్తం నేరుగా పేషెంట్ల యొక్క ఖాతాలోకి మార్చడం వంటి ప్రయోజనాల గురించి వివరించారు. కొత్త క్షయ కేసులను తొలివిడతలోనే గుర్తించి వెంటనే చికిత్సలో చేరుస్తున్న ప్రయత్నాలు గురించి ఛాంపియన్లకు వివరంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీబీ సూపర్వైజర్ శ్రీనివాస్, జిల్లా లీడ్ రవి, రిసోర్స్ పర్సన్ దత్తురామ్, ప్రతి సెంటర్ నుండి వైద్య ఆరోగ్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీనివాస్

**జగిత్యాల :** ఇటీవల నూతన జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారిగా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఆకుల శ్రీనివాస్ శుక్రవారం రాష్ట్ర షెడ్యూల్ క్యాస్ట్, షెడ్యూల్ ట్రైబ్స్, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తోపాటు జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ ఎం సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## జామే మస్జీద్ నూతన కార్యవర్గానికి ఘన సన్మానం



**కోరుట్ల :** పట్టణంలోని జామే మస్జీద్‌కు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జామే మస్జీద్ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మసిఉద్దీన్, కోశాధికారిగా ఎన్నికైన అక్రమ్ ఉల్ల ఖాన్, బషీరుద్దీన్ లను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆనంతరం మైనార్టీ రిపోర్టర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అన్వర్ సిద్దికి మాట్లాడుతూ, జామే మస్జీద్ నూతన కార్యవర్గం పట్టణంలోని ముస్లిం సమాజ ఐక్యత, అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. మస్జీద్ పాలకవర్గంలో పరదర్శకతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు మసిఉద్దీన్ మాట్లాడుతూ, తమపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలుపుతూ, జామే మస్జీద్ అభివృద్ధి, ధార్మిక కార్యక్రమాల నిర్వహణతో పాటు సమాజ హితానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు అబ్దుల్ ముబీన్, మహమ్మద్ సాజీద్ అలీ,,ముక్రం బైగ్,సలావుద్దీన్, సుజాయిత్ అలీ, జమీల్,వాజిద్,అద్నాన్, నజీబ్,ముజాహిద్,వాసిక్ ఉర్ రహమాన్, సులేమాన్, న్యాయవాది ఫసివుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు చారిత్రాత్మకం

**మెజారిటీ స్థాయిలో విజయం సాధించి తమ ప్రభుత్వ పనితీరుకు ప్రజలు అద్దం పెట్టారు.**

**రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**జగిత్యాల :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల కాలంలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలుపరుస్తున్న తీరుకు, గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు నిదర్శనమని రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన అంశం, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల విజయంపై, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్, జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య తో కలిసి చర్చించారు. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు మెజారిటీ స్థాయిలో విజయం సాధించి తమ ప్రభుత్వ పనితీరుకు అద్దం పట్టారని అన్నారు. గత దశాబ్ద కాలంలో నేనే రాజు, నేనే మంత్రి అన్నట్టుగా టిఆర్ఎస్ అగ్ర నాయకులు వ్యవహరించి, రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ప్రజలపై ఆర్థిక భారం మోపి, పైగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీరుపై విమర్శల వర్షం గుప్పిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ ప్రజలు అవేవీ పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల్లో నాలుగు ప్రధానమైన అంశాలను అమలు చేస్తూ గ్రామాలను అభివృద్ధి చేసే దిశలో ముందుకు వెళ్లేందుకే గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ పనితీరును ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వ్యవహరిస్తున్న తీరుపై ఆదరించి విజయం కట్టబెట్టారని మంత్రి అన్నారు.

## లోకేష్‌కి తప్ప... అవార్డులు

**హైదరాబాద్ :** నారా లోకేష్ తన కుటుంబ సభ్యుల విజయాలను ఉద్దేశిస్తూ చేసిన ఈ సరదా వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్థులతో పోరాడటం కంటే, తన ఇంట్లోని విజేతలతో పోటీ పడటమే అత్యంత కఠినమైన సవాలుగా మారిందని ఆయన పేర్కొన్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేష్ తన కుటుంబ సభ్యుల ప్రతిభను, వారు అందుకుంటున్న ప్రతిష్టాత్మక పురస్కారాలను ప్రస్తావిస్తూ చేసిన భావోద్వేగ స్ పోస్ట్ ఇప్పుడు నెట్టింట చర్చనీయాంశమైంది. అటు తండ్రి, ఇటు భార్య, అటు తల్లి.. చివరకు కుమారుడు కూడా తనదైన శైలిలో రాణిస్తుండటంతో "ఈ పోటీని తట్టుకోవడం నా వల్ల కావట్లేదు" అంటూ ఆయన చమత్కరించారు. లోకేష్ తన పోస్ట్‌లో ఒక్కొక్కరి గురించి ఈ విధంగా పేర్కొన్నారు తండ్రి చంద్రబాబు నాయుడు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును గెలుచుకున్నారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త సునీల్ భారతి మిట్టర్ నేతృత్వంలోని జ్యూరీ చంద్రబాబును ఈ అవార్డుకు ఎంపిక చేసింది.

# గుప్పెడు మొలకెత్తిన గింజలు తింటే శరీరంలో జరిగే మార్పులు!



ఈ రోజుల్లో చాలా మంది ఫిట్‌నెస్ పట్ల అవాహన కలిగి ఉన్నారు. అందుకే చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవటం అలవాటు చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా కొందరు తమ రోజువారి ఆహారంలో మొలకెత్తిన ధాన్యాలను చేర్చుకోవడం అలవాటు చేసుకుంటున్నారు. మొలకలు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరం. అవి శరీరానికి శక్తిని అందిస్తాయి. శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. మీరు వాటిని అల్పాహారం, సలాడ్లు, సూప్‌లు లేదా ఆరోగ్యకరమైన చిరుతిండిగా కూడా తినవచ్చు. మొలకెత్తిన గింజలను ఉదయాన్నే తినడం వలన రెట్టింపు లాభాలు ఉన్నాయి. మొలకలు విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉండే పోషకాల నిధి. అవి జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడతాయి. మీరు మీ ఆహారంలో ఆరోగ్యకరమైన, పోషకమైన ఆహారాన్ని చేర్చాలనుకుంటే మొలకలను సలాడ్స్‌గా, స్పైసీగా వీటిని తీసుకోవచ్చు. మొలకెత్తిన గింజలపై చిటికెడు ఉప్పు,నిమ్మరసం, స్పైసీగా చేసుకుని తినవచ్చు. మొలకెత్తిన విత్తనాల్లో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్ ఎ సమృద్ధిగా ఉండటం వలన రోగినిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ సి,ఈ మరియు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వలన చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటుంది. ఫైబర్, ప్రోటీన్ సమృద్ధిగా ఉన్నటువంటి మొలకెత్తిన గింజలను తినడం వలన కడుపు నిండుగా అనిపిస్తుంది. దీని వలన శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉండేటువంటి మొలకెత్తిన గింజలు తినడం వలన గుండె ఆరోగ్యం మెరుగవుతుంది. ఫైబర్, ఎంజైములు సమృద్ధిగా ఉన్నటువంటి మొలకెత్తిన గింజలు తినడం వలన జీర్ణశక్తి పెరుగుతుంది. కడుపు నిండుగా అనిపిస్తుంది. మొలకెత్తిన విత్తనాల్లో పెసలు, శనగలు, పల్లీలు, మెంతులు, కిడ్నీ బీన్స్ వంటి మొలకెత్తిన ధాన్యాలు ఆరోగ్యకరమైన, రుచికరమైన బ్రేక్‌ఫాస్ట్ అవుతుంది. ప్రోటీన్, ఫైబర్, ఇతర పోషకాలతో సమృద్ధిగా ఉన్న మొలకలు మీ ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వాటిని మరింత రుచికరంగా చేయడానికి, మీరు ఉల్లిపాయ, టమోటా, నిమ్మకాయ, దోసకాయ వంటి పదార్థాలను కూడా యాడ్ చేసుకోవచ్చు. మొలకలు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇనుము, రాగితో సమృద్ధిగా ఉంటాయి. మొలకలు తినడం వల్ల గ్లూటెన్‌కు సున్నితంగా ఉండే వ్యక్తులకు ప్రయోజనకరం. కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇవి బరువు తగ్గడానికి సహాయపడతాయి. మొలకలు యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలోని విషవ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడతాయి. మలబద్ధకం, కడుపు సమస్యలను నివారిస్తాయి. మొలకలు ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలకు గొప్ప మూలం. ఇవి గుండెకు చాలా ప్రయోజనకరం. హృదయ సంబంధ వ్యాధులు, అధిక క్తపోటు, గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. ఇవి కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడంలో కూడా సహాయపడతాయి. మొలకలలో విటమిన్ ఎ పుష్కలంగా ఉంటుంది. ఇది కంటి చూపును మెరుగుపరుస్తుంది. మొలకలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు కంటి కణాలను ఫ్రీ రాడికల్స్ నుండి రక్షించడం ద్వారా వాటిని దెబ్బతినకుండా కాపాడతాయి. రక్తహీనత ఉన్న రోగులు మొలకలు తినాలి. ఎందుకంటే వాటిలో ఇనుము పుష్కలంగా ఉంటుంది. అంతేకాకుండా, అవి ఎర్ర రక్త కణాల సంఖ్యను బాగా నిర్వహించడానికి సహాయపడతాయి.

## బాదం పప్పును తొక్కతో పాటుగా తింటున్నారా?



బాదం తొక్కతో పాటు తినాలా, లేక తొక్క తీసి తినాలా అనే సందేహం చాలా మందిలో ఉంది. నిపుణుల ప్రకారం, బాదం తొక్కలలో యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, బరువు తగ్గడంలో సహాయపడతాయి. రోజు రాత్రి నానబెట్టిన 5-7 బాదంపప్పులను ఉదయం ఖాళీ కడుపుతో, తొక్కతో సహా బాగా నమిలి తినడం వల్ల గుండె ఆరోగ్యానికి, ఎముకల బలానికి ఎన్నో ప్రయోజనాలు లభిస్తాయి. బాదం తొక్కలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి అనేక వ్యాధుల నుండి ఉపశమనం కలిగించడంలో సహాయపడతాయి. అందుకే బాదం పప్పు ఆరోగ్యానికి చాలా ప్రయోజనకరంగా భావిస్తారు. కానీ, బాదం తొక్కతో పాటు తినలా..? లేదంటే తొక్క తీసేసి తినాలా..? అని చాలా మంది సందేహం వ్యక్తం చేస్తుంటారు. బాదం తొక్కతో కలిపి తినడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంటుంది. ఇది బరువును నియంత్రించడంలో సహాయపడుతుంది. బాదం తొక్కలో ఫైబర్ అధికంగా ఉంటుంది. మంచి మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది మెరుగైన జీర్ణక్రియను నిర్వహించడంలో చాలా సహాయకారిగా ఉంటుంది. అయితే, ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు 5 నుండి 7 బాదంపప్పులను శుభ్రమైన నీటిలో నానబెట్టి, మరుసటి రోజు తినండి. ఉదయం ఖాళీ కడుపుతో బాదంపప్పు తినడం వల్ల చాలా ప్రయోజనాలు లభిస్తాయి. కానీ వాటిని త్వరగా మింగేయకుండా బాగా నమిలి తినాలని నిపుణులు చెబుతున్నారు. బాదంపప్పులో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. రోజూ బాదం తినడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాదు.. బాదం పప్పులో కాల్షియం, మెగ్నీషియం, భాస్వరం పుష్కలంగా ఉంటాయి. ఇవి ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడతాయి. ఫైబర్ అధికంగా ఉండే బాదం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అవి మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తాయి. పేగులను శుభ్రంగా ఉంచుతాయి.

## వీరికి బొప్పాయి వెరీ డేంజర్ ఎట్టి పరిస్థితుల్లోనూ తినొద్దు!



సీజన్‌తో సంబంధం లేకుండా లభించే పండ్లలో బొప్పాయి ఒకటి. బొప్పాయిలో విటమిన్ ఎ, సి, ఇ, ఫోలేట్, మెగ్నీషియం, పొటాషియం, కాపర్ ఉంటుంది. వీటి వల్ల ఇమ్యూనిటీ పెరగడంతోపాటు ఆరోగ్యం అందుతుంది. ఇన్ని ఉపయోగాలున్న బొప్పాయి అందరికీ సరిపడదని మీకు తెలుసా..? అవును కొందరు బొప్పాయి జోలికి అస్సలు వెళ్లకూడదని అంటున్నారు. బొప్పాయిలో పపైన్ ఉంటుంది. బొప్పాయి తినడం వల్ల గర్భధారణ సమయంలో గర్భాశయంలో సంకోచాలు ప్రారంభమవుతాయి. ఇవి సమయానికి ముందే ప్రసవానికి కారణమవుతాయి. కొన్నిసార్లు గర్భస్రావానికి దారితీసే ప్రమాదం ఉంది. ప్రస్తుత రోజుల్లో చాలా మంది లేటెక్స్ అలెర్జీ సమస్యతో బాధపడుతున్నారు. అలాంటి వారు బొప్పాయికి దూరంగా ఉండాలి. ఒకవేళ తింటే అలర్జీ వచ్చే అవకాశం ఉంది. దాంతో దద్దుర్లు, తుమ్ములు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది , శరీరంలో వాపు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బొప్పాయిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది కాబట్టి కడ్నీల్లో రాళ్లు ఉన్నవారు తినకపోవడం మంచిది. ఒకవేళ తింటే కిడ్నీల్లో రాళ్ల పరిమాణం మరింత పెరిగే అవకాశం ఉంటుంది. కాబట్టి బొప్పాయి అవాయిడ్ చేయడం మంచిది. బొప్పాయి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలో సహకరిస్తుంది. అయితే ఏదైనా గుండె జబ్బుతో బాధపడేవారు మాత్రం బొప్పాయి తినకపోవడం మంచిది. ఎందుకంటే బొప్పాయిలో హృదయ స్పందనలు సక్రమంగా ఉండకుండా చేసే కొన్ని పదార్థాలు ఉంటాయి. బొప్పాయి షుగర్ రోగులకు ఎంతో ఉపయోగకరం. అయితే చక్కెర స్థాయి తక్కువగా ఉన్నవారు లేదా హైపోగ్లైసీమియాతో బాధపడుతున్నవారు వైద్యుడి సలహాతో బొప్పాయిని తినాలి ఎందుకంటే ఇది గ్లూకోజ్ స్థాయిని తగ్గిస్తుంది. అలర్జీ ఉన్న వ్యక్తులు బొప్పాయి తింటే దురద, తుమ్ములు, శ్వాస సమస్యలు ఎదుర్కొనవచ్చు. థైరాయిడ్ సమస్యలున్న వారు ఉన్న కూడా బొప్పాయి తినకపోవడమే బెస్ట్ ఆప్షన్. కిడ్నీలో రాళ్లు ఉన్న వారు బొప్పాయి ఎక్కువగా తినడం హానికరం కావచ్చు.

## రాత్రి మిగిలిన చపాతీలు ఉదయం తింటే ఆరోగ్యమా?



రాత్రి మిగిలిపోయిన చపాతీలు పారేయకండి! ఆయుర్వేదం ప్రకారం ఉదయం సద్దె రొట్టె తినడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి, అధిక ఫైబర్ ఉండటం వల్ల ఆకలిని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచి, మలబద్ధకం, రక్తపోటు వంటి సమస్యల నుండి ఉపశమనం ఇస్తుంది. వేడి చేయకుండా తినడం మరింత ప్రయోజనకరం.చపాతీలు చాలామంది రోజువారీ ఆహారంలో తీసుకుంటూ ఉంటారు. మధ్యాహ్న భోజనం అయినా రాత్రి భోజనంలో కూడా కొందరు ఆరోగ్య రీత్యా చపాతీలు తింటారు. చాలా సార్లు రాత్రి సమయంలో కొన్ని చపాతీలు మిగిలిపోతాయి. కొందరు వాటిని బయట పారవేస్తారు. లేదా ఎక్కువైనా తింటూ ఉంటారు. కానీ వాటిని ఉదయం తింటే మంచిదని ఆయుర్వేదం చెబుతోంది.. రాత్రి చేసిన చపాతీల్లో చాలా ఔషధ లక్షణాలు ఉన్నాయని అంటున్నారు. ఇవి శరీరానికి మేలు చేస్తాయట. రాత్రి మిగిలిన చపాతీలు పోషకాలకు పవర్ హౌస్ అంటున్నారు ఆరోగ్య నిపుణులు.

## హార్మోన్ స్థాయిలో హెచ్చుతగ్గులు దేనికి సంకేతం?



ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒత్తిడి అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైపోయింది. అయితే, ఈ ఒత్తిడి కలిగినప్పుడు మన శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ విడుదలవుతుంది.

ఆధునిక జీవనశైలిలో పని ఒత్తిడి, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల ఒత్తిడి అనేది ప్రతి మనిషి జీవితంలో ఒక భాగమైపోయింది. అయితే, ఈ ఒత్తిడి కలిగినప్పుడు మన శరీరంలో 'కార్టిసాల్' అనే హార్మోన్ విడుదలవుతుంది. దీనిని సాధారణంగా 'స్ట్రెస్ హార్మోన్' అని పిలుస్తారు. అత్యవసర పరిస్థితుల్లో శరీరం స్పందించడానికి ఇది అవసరమే అయినప్పటికీ, దీర్ఘకాలం పాటు ఈ హార్మోన్ స్థాయిలు రక్తంలో ఎక్కువగా ఉంటే అది ఒక నిశ్శబ్ద హంతకిలా మారుతుంది. మీ శరీరంలో మీకు తెలియకుండానే కొన్ని మార్పులు వస్తున్నాయంటే, అది కార్టిసాల్ పెరుగుదలకు సంకేతం కావచ్చు. శరీరంలో కార్టిసాల్? స్థాయి పెరిగిందని ఎలా తెలుస్తుంది? కార్టిసాల్ పెరిగినప్పుడు అది శరీర మెటబాలిజంపై దాడి చేస్తుంది. దీనివల్ల ఎంత తక్కువ తిన్నా, ఎంత వ్యాయామం చేసినా బరువు పెరుగుతూనే ఉంటారు. ముఖ్యంగా పొత్తికడుపు భాగంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోతుంది. దీనిని వైద్యపరిభాషలో 'స్ట్రెస్ బెల్లీ' అంటారు. అలాగే ముఖం ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. అంతేకాకుండా, కార్టిసాల్ ప్రభావం వల్ల నిద్రలేమి సమస్య వేధిస్తుంది. రాత్రిపూట ఎంత ప్రయత్నించినా నిద్ర రాకపోవడం, ఉదయాన్నే లేవగానే తీవ్రమైన నీరసం, అలసటగా అనిపించడం దీని ప్రధాన లక్షణం. చర్మంపై ముడతలు రావడం, గాయాలు త్వరగా మానకపోవడం కూడా కార్టిసాల్ అధికంగా ఉందనడానికి లక్షణాలు. కార్టిసాల్‌ను అదుపులో ఉంచుకోవడానికి జీవనశైలిలో మార్పులు తప్పనిసరి. ప్రతిరోజూ కనీసం 15 నుంచి 20 నిమిషాల పాటు ధ్యానం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. కెఫిన్ అధికంగా ఉండే కాఫీ, టీలను తగ్గించి, గ్రీన్ టీ లేదా హెర్బల్ టీలను ఎంచుకోవాలి. మెగ్నీషియం, విటమిన్-బి పుష్కలంగా ఉండే ఆహారం తీసుకోవాలి. అన్నింటికంటే ముఖ్యం.. ప్రతిరోజూ రాత్రి కనీసం 8 గంటల గాఢ నిద్ర. మనసును ఉల్లాసంగా ఉంచుకునేందుకు మనసుకు ఇష్టమైన హాబీలను అలవాటు చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల హార్మోన్ల సమతుల్యత దెబ్బతినకుండా ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# బిజినెస్

## రూ. 2.20 లక్షలు దాటిన వెండి



ఒక్కరోజు గ్యాప్ తర్వాత వెండి ధరలు మరోసారి రికార్డు గరిష్టాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాలు బలంగా ఉండటం, సరఫరా ఆందోళనలు కొనసాగడం, వచ్చే ఏడాది అమెరికా ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందనే అంచనాల మధ్య ధరలు అమాంతం ఊపందుకున్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు సంబంధించి ఇన్వెస్టర్లు గురువారం విడుదలయ్యే నవంబర్ నెల డేటా కోసం, శుక్రవారం వెలువడే వ్యక్తిగత వినియోగ వ్యయం డేటా కోసం ఎదురుచూస్తున్న క్రమంలో విలువ లోహాలపై దృష్టి సారించారు. ప్రపంచ వాణిజ్యంలో బంగారం కంటే వెండికి గిరాకీ ఎక్కువగా కనిపిస్తోందని మార్కెట్ విశ్లేషకులు తెలిపారు. దేశీయంగా కూడా గిరాకీతో పాటు పారిశ్రామిక వినియోగం పెరగడం వంటి పరిణామాల వల్ల కొత్త గరిష్ఠాలకు చేరుతోంది. బుధవారం వెండి కిలో ఏకంగా రూ.11,000 పెరిగి రూ. 2.22 లక్షల మార్కుకు చేరాయి. ఈ ఏడాదిలో ఇప్పటివరకు వెండి ధరలు రూ. 87,578 నుంచి రూ.1,18,533 లేదా 135.34 శాతం పెరిగాయి. మరోవైపు, గోల్డ్ ఫ్యూచర్స్ సానుకూలంగా ప్రారంభమైనప్పటికీ, ఆ తర్వాత తగ్గుముఖం పట్టాయి. బుధవారం బంగారం ధరలు స్వల్పంగా పెరిగాయి. బులియన్ మార్కెట్లో స్వచ్ఛమైన పది గ్రాముల బంగారం రూ. 650 పెరిగి రూ. 1,34.510 వద్ద ఉన్నాయి. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల పసిడి 10 గ్రాములు రూ. 600 పుంజుకుని రూ. 1,23,300కి చేరాయి. అంతర్జాతీయ మార్కెట్లలలోనూ ఫిబ్రవరి డెలివరీకి సంబంధించిన కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్లు 13.1 డాలర్లు పెరిగి, ఔన్స్‌కు 4,345.1 డాలర్లకు చేరుకున్నాయి.

## బయోమెట్రిక్ విధానంలో యూపీఐ చెల్లింపులు ప్రారంభించిన అమెజాన్



ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ పేమెంట్ విభాగం అమెజాన్ పే దేశీయ మార్కెట్లో కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. దీని ద్వారా వినియోగదారులు ప్రతిసారి యూపీఐ పిన్ నంబర్ ఎంటర్ చేయడానికి బదులుగా ఫింగర్‌ప్రింట్ లేదా ఫేస్ స్కాన్ ద్వారా యూపీఐ చెల్లింపులు చేయవచ్చు. దీనర్థం కస్టమర్లు తమ ఫోన్‌లోనే బయోమెట్రిక్ వెరిఫికేషన్ ద్వారా డబ్బులు బదిలీ చేయడం, స్టోర్లలో చెల్లింపులు, అమెజాన్‌లో ఉత్పత్తులను కొనుగోలు చేయవచ్చు. ఈ ఫీచర్‌ను ఉపయోగించి చెల్లింపులను వేగంగా, సురక్షితంగా చేయవచ్చని కంపెనీ తెలిపింది. లావాదేవీల కోసం పిన్ కోడ్‌ను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉండదని కంపెనీ స్పష్టం చేసింది. గతంలో, ఎవరైనా పిన్ నంబర్‌ను దొంగలిస్తే, బాధితుడికి తెలియకుండానే చెల్లింపులు చేసే అవకాశం ఉండేది. అయితే, అలాంటివి ఇకపై జరగవని వెల్లడించింది. ఫేస్, ఫింగర్‌ప్రింట్ ప్రామాణీకత సురక్షితమైన కీగా పనిచేస్తుందని కంపెనీ చెబుతోంది. అయితే, కొత్త బయోమెట్రిక్ ఫీచర్‌ను వినియోగదారులు రూ. 5,000 వరకు లావాదేవీలనే చేయగలదని, అధిక లావాదేవీల కోసం కస్టమర్లు యూపీఐ పిన్ నంబర్‌నే ఉపయోగించాల్సి ఉంటుందని వివరణ ఇచ్చింది.

# స్వయంకృషి సంపదలో దీపిందర్ టాప్




స్వయంకృషి సంపాదనలో జొమాటో మాతృసంస్థ ఎటెర్నల్ సిఇఒ దీపిందర్ గోయల్ అగ్రస్థానంలో నిలిచారు. హురున్ ఇండియా 'టాప్ 200 స్వయంకృషి ఔత్సాహికవేత్తలు 2025' జాబితాలో డిమార్ట్ అధినేత రాధాక్రిష్ణన్ దమానిని వెనక్కి నెట్టి దీపిందర్ మొదటి స్థానంలోకి వచ్చారు. 25 సెప్టెంబర్ 2025 నాటికి సంపద ఆధారంగా ఐడిఎఫ్‌సి ఫస్ట్ ప్రయివేటు, హురున్ ఇండియా టాప్-200 వ్యాపారవేత్తల జాబితా-2025ను బుధవారం విడుదల చేసింది. బిలియన్ డాలర్ల కంపెనీగా (దాదాపు రూ.9వేల కోట్లు) ఏర్పాటు చేసిన స్వయంకృషితో పైకొచ్చిన వ్యాపారవేత్తల సంఖ్య గతేడాది 121గా ఉంటే.. ఈ ఏడాది 128కి పెరిగింది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వాటిలో 52 కంపెనీలు బెంగళూరు ప్రధాన కేంద్రంగా ఉన్నాయని నివేదిక పేర్కొంది. ఈ రిపోర్ట్ ప్రకారం.. జొమాటోకు చెందిన ఎటర్నెల్ రూ.3.2 లక్షల కోట్ల మార్కెట్ విలువను సాధించింది. ఏడాదిలో 27 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీపిందర్ తొలిసారి స్థానం దక్కించుకోగా.. జొమాటో దేశవ్యాప్తంగా 800 నగరాల్లో సేవలందిస్తోందని నివేదిక పేర్కొంది. పోటీ కంపెనీ స్విగ్గీ సహ వ్యవస్థాపకుడు శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నారు. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.1.06 లక్షల కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే 5 శాతం వద్ధి చెందింది. దమానీకి చెందిన అవెన్యూ సూపర్‌మార్ట్స్ మార్కెట్ విలువ ఏడాదిలో 13 శాతం తగ్గి రూ.3 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. ఇటీవల తీవ్ర వివాదస్పదమైన ఇండిగో ఎయిర్‌లైన్స్‌కు చెందిన వ్యవస్థాపకులు రాహుల్ భాటియా, రాకేశ్ గంగ్వాల్ హురున్ ఇండియా జాబితాలో తొలిసారి చోటు దక్కించుకున్నారు. స్వయంకషిలో ఎదిగిన వ్యాపార వేత్తల జాబితాలో మూడో స్థానంలో నిలిచారు. వీరు నెలకొల్పిన ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ విలువ రూ.2.2 లక్షల కోట్లుగా ఉంది. దేశీయ విమానయాన రంగంలో 65 శాతం మార్కెట్ వాటాతో ఇండిగో అగ్రగామిగా ఉందని హురున్ పేర్కొంది. అధునాత పద్ధతులతో అంతర్జాతీయంగానూ విస్తరిస్తోందని తెలిపింది. పేటియం వ్యవస్థాపకుడు విజరు శేఖర్ శర్మ ఈ జాబితాలో 8వ స్థానంలో నిలిచారు. ఆయన వ్యాపార సంస్థ వన్ 97కమ్యూనికేషన్ మార్కెట్ విలువ రూ.72,800 కోట్లుగా ఉంది. గతేడాదితో పోలిస్తే 67 శాతం మేర పెరిగింది. లెన్స్‌కార్ట్ సైతం 60 శాతం పెరుగుదలతో రూ.67 వేల కోట్ల మార్కెట్ విలువ సాధించగా.. ఈ కంపెనీ ఫౌండర్లు పీయూష్ బన్సల్, అమిత్ చౌదరి, నేహా బన్సల్, సుమిత్ కపాహీ ఈ జాబితాలో 10వ స్థానంలో నిలిచారు. హురున్ వెలువరించిన కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.42 లక్షల కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది రూ.36 లక్షల కోట్లుగా చోటు చేసుకుంది. దీంతో ఏడాది 15 శాతం విలువ పెరిగింది. నాలుగో స్థానంలో మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ అధినేత అభరు సోయి, ఐదో స్థానంలో స్వీగ్గీకి చెందిన శ్రీహర్ష మాజేటి, నందన్ రెడ్డి, ఆరో స్థానంలో మేక్‌మైట్రిప్ ఫౌండర్లు దీప్ కర్లా, రాజేశ్ మాగొ, ఏడో స్థానంలో పాలసీ బజార్ వ్యవస్థాపకులు యాశిష్ దహియా, అలోక్ బన్సల్, ఎనిమిదో స్థానంలో పేటియం విజరు శేఖర్ శర్మ, తొమ్మిదో స్థానంలో నైకా ఫౌండర్లు ఫల్గుణి నాయర్, అద్వైత్ నాయర్ నిలిచారు.

# ఇయర్ ఎండ్ సేల్.. రూ. 40,990కే ఐఫోన్ 16




మరో రెండు వారాల్లో ఏడాది ముగియనుంది. ఇంకో వారం రోజుల్లో క్రిస్మస్ పండుగ రానుంది. ఈ నేపథ్యంలో టాటా యాజమాన్యంలోని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ క్రోమా భారీ ఆఫర్లను ప్రకటించింది. ఇయర్ ఎండ్ సేల్‌లో భాగంగా 'క్రోమ్‌టాస్టిక్ డిసెంబర్ సేల్ ' పేరుతో స్మార్ట్‌ఫోన్‌లు, ల్యాప్‌టాప్‌లు భారీ డిస్కౌంట్లు తీసుకొచ్చింది. ఈ సేల్ డిసెంబర్ 15 నుంచి మొదలై 2026, జనవరి 4 వరకు కొనసాగుతుంది. ఈ సేల్‌లో భాగంగా క్రోమా ఐఫోన్, ప్రీమియం ఫోల్డబుల్ స్మార్ట్ ఫోన్‌లు, ఎం4 చిప్‌తో కూడిన యాపిల్ సరికొత్త మ్యాక్‌బుక్ ఎయిర్‌తో సహా అనేక పరికరాలపై తగ్గింపు ధరలను అందిస్తోంది. ఐఫోన్ 16 రూ.40,990కే లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఈఎంఐ రూ.1,833 నుంచే మొదలవుతుంది. ఐఫోన్ 15 కూడా రూ. 36,490కే కొనుగోలు చేయవచ్చు, ఈ ఫోన్ కోసం ఈఎంఐ రూ. 1,604 నుంచి ప్రారంభమవుతుంది. కానీ, ఈ తగ్గింపు ధరలు బ్యాంక్ ఆఫర్లు, ఎక్స్ఛేంజ్ ప్రయోజనాలు, క్యాష్‌బ్యాక్ అమలు తర్వాత వర్తిస్తాయని క్రోమా స్పష్టం చేసింది. అలాగే, ఇవి ప్రాంతం, స్టోర్, లభ్యతను బట్టి మారవచ్చని పేర్కొంది. శాంసంగ్ స్మార్ట్‌ఫోన్‌లపైనా భారీ రాయితీలను క్రోమా ప్రకటించింది. శాంసంగ్ గెలాక్సీ ఎస్25 అల్ట్రా రూ. 69,999కే అందుబాటులో ఉంది, ప్రీమియం శాంసంగ్ గెలాక్సీ జీ ఫోల్డ్ 7 కూడా రూ. 99,999కే లభిస్తుంది. ఈ సీజన్‌లో ల్యాప్‌టాప్ డీల్స్ మరొక ప్రధాన ఆకర్షణగా ఉండనుంది. ఎం4 చిప్‌తో కూడిన మ్యాక్‌బుక్ ఎయిర్ చాలా తక్కువ రూ. 55,911 ధరకు అందుబాటులో ఉంది. ఇవి మాత్రమే కాకుండా టీవీలు, గృహోపకరణాలపైనా అధిక తగ్గింపు ఇస్తున్నట్టు క్రోమా పేర్కొంది.

# చరిత్ర సృష్టించిన కివీస్ ప్లేయర్లు.. ప్రపంచ రికార్డు

న్యూజిలాండ్ స్టార్లు టామ్ లాథమ్, డెవాన్ కాన్వే సరికొత్త చరిత్ర సృష్టించారు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ చరిత్రలో తొలి వికెట్‌కు అత్యుత్తమ భాగస్వామ్యం నెలకొల్పిన ఓపెనింగ్ జోడీగా నిలిచారు. వెస్టిండీస్‌తో గురువారం మొదలైన మూడో టెస్టు సందర్భంగా ఈ ఘనత సాధించారు. డబ్ల్యూటీసీ (ఔజ) 2025-27లో భాగంగా కివీస్ జట్టు స్వదేశంలో విండీస్‌తో మూడు టెస్టుల సిరీస్ ఆడుతోంది. అసాధారణ పోరాటంతో వెస్టిండీస్ తొలి టెస్టు డ్రా చేసుకోగా.. రెండో టెస్టులో న్యూజిలాండ్ తొమ్మిది వికెట్ల తేడాతో గెలిచింది. ఇరుజట్ల మధ్య గురువారం 'బే ఓవల్' వేదికగా మూడో టెస్టు మొదలైంది.

### ఓపెనింగ్ జోడీగా వచ్చి.. శతకాలతో చెలరేగి

టాస్ గెలిచిన ఆతిథ్య కివీస్.. పర్యాటక విండీస్‌ను బౌలింగ్‌కు ఆహ్వానించింది. ఈ క్రమంలో ఓపెనింగ్ జోడీగా వచ్చిన కివీస్ కెప్టెన్ టామ్ లాథమ్ (ుశీవ ూఱ్‌ష్ట్రుఎ), డెవాన్ కాన్వే సెంచరీలతో చెలరేగారు. లాథమ్ 246 బంతుల్లో 15 ఫోర్లు, ఒక సిక్సర్ బాది 137 పరుగులు చేసి.. రోచ్ బౌలింగ్‌లో రోస్టన్ చేజ్‌కు క్యాచ్ ఇచ్చి అవుటయ్యాడు. మరోవైపు.. తొలిరోజు ఆట ముగిసే సరికి కాన్వే 279 బంతుల్లో 178 పరుగులతో (25 ఫోర్లు) అజేయంగా నిలిచాడు. అతడికి తోడుగా నైట్ వాచ్‌మన్ జేకబ్ డఫీ (జీుఎశీవ ఐబటటఎ) 9 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఫలితంగా గురువారం నాటి మొదటిరోజు ఆటలో న్యూజిలాండ్ 90 ఓవర్లలో వికెట్ నష్టానికి 334 పరుగులు సాధించింది.




### ప్రపంచ రికార్డు

ఇదిలా ఉంటే.. తొలి వికెట్‌కు లాథమ్, కాన్వే కలిసి 520 బంతుల్లో ఏకంగా 323 పరుగులు జతచేశారు. డబ్ల్యూటీసీ చరిత్రలో ఇదే అత్యధిక ఓపెనింగ్ భాగస్వామ్యం కావడం విశేషం. సౌతాఫ్రికాతో టెస్టులో 2019లో టీమిండియా ఓపెనర్లు రోహిత్ శర్మ- మయాంక్ అగర్వాల్ తొలి వికెట్‌కు 317 పరుగులు జోడించగా.. లాథమ్- కాన్వే తాజాగా ఈ రికార్డును సవరించారు. అంతేకాదు.. సొంతగడ్డపై టెస్టుల్లో అత్యధిక ఓపెనింగ్ పార్ట్‌నర్‌షిప్ సాధించిన జోడీగానూ లాథమ్- కాన్వే చరిత్రకెక్కారు. గతంలో ఈ రికార్డు చార్లెస్ స్టెవర్ట్ డెంప్‌స్టర్- జాన్ ఎర్నెస్ట్ మిల్స్ పేరిట ఉండేది. వీరిద్దరు కలిసి ఇంగ్లండ్‌పై 1930లో 276 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇదిలా ఉంటే.. అబుదాబిలో మంగళవారం జరిగిన ఐపీఎల్-2026 మినీ వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిపోయిన కాన్వే.. వేలం తర్వాత తన తొలి మ్యాచ్‌లోనే రికార్డు సెంచరీ సాధించడం విశేషం.

## మయాంక్ కెప్టెన్సీలో ఆడనున్న కేఎల్ రాహుల్



విజయ్ హజారే ట్రోఫీ 202526 సీజన్ కోసం 16 మంది సభ్యులతో కూడిన తమ జట్టును కర్ణాటక క్రికెట్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ జట్టులో టీమిండియా స్టార్ ప్లేయర్లు కేఎల్ రాహుల్, ప్రసిద్ధ్ కృష్ణలు ఉన్నారు. దీంతో కర్ణాటక జట్టు మరింత పటిష్టంగా మారింది. బీసీసీఐ ఆదేశాలతో వీరిద్దరూ దేశవాళీ వన్డే టోర్నీ బరిలోకి దిగనున్నారు. ఇక ఈ జట్టు కెప్టెన్‌గా స్టార్ మయాంక్ అగర్వాల్ ఎంపికయ్యాడు. అతడి డిప్యూటీగా కరుణ్ నాయర్ వ్యవహరించనున్నాడు. అదేవిధంగా అండర్-23 టోర్నీలో కర్ణాటక తరపున అదరగొట్టిన హర్షిల్ ధర్మాని, ధ్రువ్ ప్రభాకర్లకు సీనియర్ జట్టులో చోటు లభించింది. ఈ టోర్నీలో ధర్మాని తమిళనాడుపై 142 పరుగులు, ప్రభాకర్ విదర్భపై 126 పరుగులతో రాణించి సెలక్టర్ల దృష్టిని ఆకర్షించారు. స్పెషలిస్ట్ స్పిన్నర్‌గా శ్రీష ఆచార్ చోటు దక్కించుకున్నాడు. కర్ణాటక తమ గ్రూప్ దశ మ్యాచ్‌లన్నీ అహ్మదాబాద్‌లో ఆడనుంది. ఈ టోర్నీలో కర్ణాటక జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది. కర్ణాటక టీమ్ తొలి మ్యాచ్‌లో డిసెంబర్ 24న జార్ఖండ్‌తో తలపడనుంది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి దిగ్గజాల సైతం ఈ టోర్నీలో ఆడనున్నారు. మయాంక్ అగర్వాల్ (కెప్టెన్), దేవదత్ పడిక్కల్, కరుణ్ నాయర్ (వైస్ కెప్టెన్), స్మరణ్, శ్రీజిత్, అభినవ్ మనోహర్, శ్రేయాస్ గోపాల్,వ్యాషాక్, మన్వంత్ కుమార్ , శ్రీషా ూ ఆచార్, అభిలాష్ శెట్టి, శరత్ , హర్షిల్ ధర్మాని, కేఎల్ రాహుల్, ప్రభాకర్

# స్పోర్ట్స్

## పోరాడుతున్న ఇంగ్లండ్.. రెండో రోజు ఆసీస్‌దే




అడిలైడ్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న యాషెస్ మూడో టెస్టులో ఇంగ్లండ్ పోరాడుతోంది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ జట్టు 8 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. క్రీజులో కెప్టెన్ బెన్ స్టోక్స్(45), జోఫ్రా ఆర్చర్(30) ఉన్నారు. వీరిద్దరూ తొమ్మిదో వికెట్‌కు 45 పరుగుల ఆజేయ భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంగ్లండ్ జట్టు ఇంకా 158 పరుగుల వెనకంజలో ఉంది. ఈ ప్రతిష్టాత్మక సిరీస్‌లో ఇంగ్లండ్ బ్యాటర్ల పేలవ ప్రదర్శన కొనసాగుతోంది. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో స్టోక్స్, ఆర్చర్‌తో పాటు హ్యారీ బ్రూక్ (45), బెన్ డకెట్ (29) ఫర్వాలేదన్పించారు. వైస్ కెప్టెన్ పోప్(3), క్రాలీ(9), రూట్(19) తీవ్ర నిరాశపరిచారు. ఆసీస్ బౌలర్లలో కెప్టెన్ ప్యాట్ కమ్మిన్స్ మూడు వికెట్లు పడగొట్టగా.. లియోన్, బోలాండ్ తలా రెండు వికెట్లు సాధించారు. మరో వికెట్ గ్రీన్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక అంతకుముందు 326/8 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను ప్రారంభించిన ఆసీస్ 371 పరుగులకు ఆలౌటైంది. వికెట్ కీపర్ అలెక్స్ కేరీ (143 బంతుల్లో 106; 8 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలవగా..ఖవాజా(82), స్టార్క్(54) రాణించారు.


### డీఆర్ఎస్ వివాదం..

కాగా ఈ మ్యాచ్‌లో డీఆర్ఎస్ వివాదం చోటు చేసుకుంది. ఆసీస్ ఇన్నింగ్స్‌లో అలెక్స్ క్యారీ బ్యాటింగ్ చేస్తుండగా బంతి స్పష్టంగా బ్యాట్‌కు తాకినప్పటికి.. స్నికోమీటర్ సాంకేతిక లోపం వల్ల స్పైక్ రాలేదు. ఇంగ్లండ్ రివ్యూ తీసుకున్నప్పటికి స్నికోమీటర్‌లో స్పైక్ చూపించకపోవడంతో థర్డ్ అంపైర్ నాటౌట్‌గా ప్రకటించారు. అయితే ఈ విషయంపై ఐసీసీ స్పందించింది. సాంకేతిక అంగీకరిస్తూ.. ఇంగ్లండ్ కోల్పోయిన రివ్యూను తిరిగి ఇచ్చింది

# ‘శంబాల’ చిత్రీకరణలో గాయపడ్డ హీరో ఆది



టాలీవుడ్ నటుడు ఆది సాయికుమార్, అర్చనా అయ్యర్ జోడీగా నటించిన చిత్రం ‘శంబాల’.. ‘ఏ మిస్టిక్ వరల్డ్’ అనేది ఉపశీర్షిక. యుగంధర్ ముని దర్శకత్వంలో రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మించారు. ఈ నెల 25న ఈ చిత్రం విడుదల కానుంది. అయితే, ఈ మూవీ షూటింగ్‌లో కొన్ని సంఘటనలలో హీరో ఆది గాయపడ్డారని చిత్ర యూనిట్ పేర్కొంది. శంబాల మూవీని విజువల్ వండర్‌గా తీర్చి దిద్దే క్రమంలో భారీ యాక్షన్ సీక్వెన్స్‌లతో మేకర్లు ఆడియెన్స్‌ని అబ్బుర పరుస్తున్నారు. హీరోలు సైతం ఎంతో కష్టపడి యాక్షన్ సీక్వెన్స్‌ల్ని చేస్తుంటారు. అయితే కొన్ని సార్లు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా అవాంఛనీయ ఘటనలు జరుగుతుంటాయి. ఇక ‘శంబాల’ చిత్రీకరణ సమయంలోనూ ఇలాంటి కొన్ని సంఘటనలు జరిగాయని టీం చెబుతోంది. ఓ భారీ యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్న సమయంలో హీరో ఆది తీవ్రంగా గాయపడ్డారట. రాత్రి పూట చేస్తున్న ఈ షూటింగ్‌లో చాలా మంది నటీనటులున్నారట. ఆ భారీ యాక్షన్ సీక్వెన్స్ చేస్తున్న సమయంలోనే ఆదికి గాయాలు అయ్యాయి. అయితే గాయాలు అయినా కూడా షూటింగ్‌కి ఇబ్బంది కలగకుండా ప్రవర్తించారట. ఆ గాయాలతోనే అలా ఆ రాత్రి షూటింగ్ చేసి సినిమా పట్ల తనకున్న డెడికేషన్‌ను చూపించారని టీం ప్రశంసిస్తోంది. ‘శంబాల’ ఇప్పటికే ట్రేడ్ సర్కిళ్లలో హాట్ టాపిక్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. రిలీజ్‌కు ముందే నిర్మాతలు టేబుల్ ప్రాఫిట్ మీదున్నారు. అన్ని రకాల బిజినెస్‌లు క్లోజ్ అయ్యాయి. హాట్ కేక్‌లా ఓటీటీ, శాటిలైట్ రైట్స్ అమ్ముడైన సంగతి తెలిసిందే. ఇక నైజాంలో మైత్రి, ఏపీ, సీడెడ్‌లో ఉషా పిక్చర్స్ వంటి భారీ సంస్థలు ఈ మూవీని డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాయి.




# మహేష్-రాజమౌళి ‘గ్లోబల్ అడ్వెంచర్’.. ‘వారణాసి’ ఐమాక్స్ వెర్షన్ ట్రైలర్ విడుదల!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో సరికొత్త రికార్డులు సృష్టించేందుకు సిద్ధమవుతున్న ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబుల క్రేజీ ప్రాజెక్ట్ నుంచి ఒక భారీ అప్‌డేట్ వెలువడింది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ‘వారణాసి టు ది వరల్డ్’ అనే పేరుతో తాజాగా ఐమాక్స్ ఫార్మాట్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ ట్రైలర్‌ను పూర్తిస్థాయిలో ఐమాక్స్ ఫార్మాట్ కోసం ప్రత్యేకంగా చిత్రీకరించారు. 1.43 యాస్పెక్ట్ రేషియోతో విడుదలైన ఈ ట్రైలర్ ప్రేక్షకలకి సరికొత్త విజువల్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తోంది. హాలీవుడ్ యాక్షన్ సినిమాలకు ఏమాత్రం తగ్గకుండా రాజమౌళి ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక విలువలలో తీర్చిదిద్దుతున్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతుంది. ఈ సినిమా కథ ఆధ్యాత్మిక నగరం వారణాసిలో ప్రారంభమై, ప్రపంచంలోని వివిధ దేశాల మీదుగా సాగే గ్లోబల్ అడ్వెంచర్‌గా ఉండబోతోంది. ‘గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్’ జోనర్‌లో వస్తున్న ఈ సినిమాలో మహేష్ బాబు ఒక సాహసోపేతమైన ప్రయాణికుడిగా కనిపించనున్నారు.

# ప్రభాస్‌కి న్యూ ఇయర్ బ్రేక్ రద్దు..

## టైట్ షెడ్యూల్ ఫిక్స్ చేసిన సందీప్ వంగా!



దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ సినిమా ‘స్పిరిట్’ షూటింగ్ షెడ్యూల్‌లో తాజాగా కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. గతంలో నవంబర్ నెలలో వచ్చిన సమాచారం ప్రకారం, డిసెంబర్ చివరి వరకూ షూటింగ్ చేసి న్యూ ఇయర్‌కు బ్రేక్ ఇవ్వాలని వంగా భావించారు. అయితే ఇప్పుడు ఆ ప్లాన్ పూర్తిగా మారినట్టు ఇండస్ట్రీలో టాక్ వినిపిస్తోంది. లేటెస్ట్ సమాచారం ప్రకారం, ‘స్పిరిట్’ను డిసెంబర్ 2027కి కాకుండా 2027 మధ్యలోనే రిలీజ్ చేయాలని సందీప్ రెడ్డి వంగా నిర్ణయించుకున్నారని తెలుస్తోంది. అదే కారణంగా న్యూ ఇయర్ బ్రేక్‌ను రద్దు చేసి, షూటింగ్‌ను నిరంతరంగా కొనసాగించాలని టీమ్ డిసైడ్ అయ్యిందట. దీంతో న్యూ ఇయర్ సమయంలో కూడా ‘స్పిరిట్’ టీమ్ సెట్స్‌పైనే పని చేయనుంది. ఈ సినిమా షూటింగ్ నవంబర్ 27న హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రస్తుతం జరుగుతున్న తొలి షెడ్యూల్ జనవరి మొదటి వారం వరకూ కొనసాగనుంది అని సమాచారం. ఆ తర్వాత కేవలం కొద్ది రోజుల విరామం మాత్రమే తీసుకుని, వెంటనే తదుపరి షెడ్యూల్ మొదలుపెట్టే అవకాశముందని చిత్రబృందానికి దగ్గరగా ఉన్న వర్గాలు చెబుతున్నాయి.“ఈసారి న్యూ ఇయర్ బ్రేక్ లేదు” అనే స్పష్టమైన ఆదేశాలు వంగా టీమ్‌కు ఇచ్చినట్టుగా టాక్. ‘స్పిరిట్’ సందీప్ రెడ్డి వంగాకు చాలా స్పెషల్ ప్రాజెక్ట్. ముఖ్యంగా ఇది ప్రభాస్‌తో ఆయన చేస్తున్న తొలి సినిమా కావడం విశేషం. అలాగే, ఈ చిత్రంతోనే వంగా వివేక్ ఒబెరాయ్ కాంబినేషన్ కూడా మొదటిసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమాలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారని ఇప్పటికే క్లారిటీ ఇచ్చారు. యాక్షన్‌తో పాటు బలమైన డ్రామా ఈ చిత్రానికి ప్రధాన బలం అని సమాచారం. ఇక విలన్ పాత్రలో నటిస్తున్న వివేక్ ఒబెరాయ్ కోసం కూడా వంగా ఓ ప్రత్యేకమైన లుక్‌ను డిజైన్ చేసినట్టు టాక్. గతంలో ‘యానిమల్’ సినిమాలో బాబీ డియోల్‌ను పూర్తిగా కొత్తగా చూపించిన విధంగానే, ‘స్పిరిట్’లో కూడా వివేక్ ఒబెరాయ్‌ను ఊహించని అవతారంలో చూపించబోతున్నారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఆయన పాత్ర సినిమా మొత్తానికి కీలకంగా ఉండడమే కాకుండా, ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉండనుందని సమాచారం. మొత్తానికి, ‘స్పిరిట్’ను అనుకున్నదానికంటే త్వరగా పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతోనే వంగా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ప్రభాస్ అభిమానుల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

# వెంకటేష్ త్రివిక్రమ్ కాంబోలో ‘ఆదర్శ కుటుంబం’.. రిలీజ్ డేట్‌లో మార్పు?



విక్టరీ వెంకటేష్ ‘సంక్రాంతికి వస్తున్నాం’ లాంటి సూపర్ హిట్ తర్వాత అదే రేంజ్‌కు తగ్గట్టు తన నెక్ట్స్ సినిమాను ప్లాన్ చేశాడు. ప్రేక్షకులు ఎప్పటి నుంచో ఆశగా ఎదురు చూస్తున్న వెంకటేష్‌త్రివిక్రమ్ కాంబినేషన్‌లో కొత్త సినిమా తెరకెక్కుతోంది. హారిక హాసిని ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రానికి ‘ఆదర్శ కుటుంబం’ అనే టైటిల్‌ను ఫిక్స్ చేశారు. వెంకటేష్ నటించిన ‘నువ్వు నాకు నచ్చావ్’, ‘మల్లీశ్వరి’ చిత్రాలకు త్రివిక్రమ్ రైటర్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. ఆ కాంబోలో వచ్చిన సినిమాలు సూపర్ హిట్లుగా నిలవడంతో, ఇప్పుడు గురూజీ డైరెక్టర్‌గా వెంకీని తెరకెక్కించడంపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇటీవలే ఈ సినిమా షూటింగ్ ప్రారంభమవ్వగా, మొదటగా 2026 సమ్మర్ రిలీజ్‌గా ప్లాన్ చేశారు. అయితే తాజా సమాచారం ప్రకారం, సమ్మర్ కన్నా 2026 సెకండ్ హాఫ్‌లో వచ్చే దసరా ఫెస్టివల్ సీజన్‌కు రిలీజ్ చేయడం బెటర్ అనే టాక్ ఇండస్ట్రీలో వినిపిస్తోంది. దసరా పండుగ టైమ్‌లో ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్లకు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉండటంతో, ‘ఆదర్శ కుటుంబం’కు అది పర్ఫెక్ట్ స్లాట్ అని భావిస్తున్నారట. అందుకే రిలీజ్ ప్లానింగ్‌లో మార్పులు జరిగే ఛాన్స్ ఉందని సమాచారం. ఇక 2026 సెకండ్ హాఫ్‌లో ప్రభాస్ ‘ఫౌజీ’ సినిమా కూడా రిలీజ్ ప్లానింగ్‌లో ఉంది. జనవరిలో ‘రాజా సాబ్’తో ప్రభాస్ రాబోతుండటంతో, ‘ఫౌజీ’ని ఆగస్టు లేదా డిసెంబర్‌కు షిఫ్ట్ చేసే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో వెంకటేష్ సినిమా దసరాకు వస్తే బాక్సాఫీస్‌కు సేఫ్ ఆప్షన్‌గా మారుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ సినిమాలో వెంకటేష్ సరసన కెజిఎఫ్ భామ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ‘హిట్ 3’, ‘తెలుసు కదా’ వంటి సినిమాలతో ఇప్పటికే తెలుగులో మంచి పాపులారిటీ తెచ్చుకున్న శ్రీనిధికి, త్రివిక్రమ్ దర్శకత్వంలో నటించడం మరింత క్రేజ్ తీసుకొచ్చే అవకాశంగా మారింది. ‘ఆదర్శ కుటుంబం’ పూర్తయ్యాక వెంకటేష్ నెక్ట్స్ ఒక యువ హీరోతో సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు త్రివిక్రమ్ కూడా ఈ సినిమాను ‘సంక్రాంతికి వస్తున్నాం’ కంటే పెద్ద సూపర్ హిట్‌గా నిలపాలని గట్టిగా కృషి చేస్తున్నారని టాక్. ఇక గురూజీ ఈ ప్రాజెక్ట్ తర్వాత తాను ప్లాన్ చేస్తున్న మైథాలజీ సబ్జెక్ట్‌పై ఫోకస్ పెట్టాలని భావిస్తున్నప్పటికీ, ఎన్టీఆర్‌తో చేయాల్సిన మైథాలజీ మూవీ ఇంకా లేట్ అయ్యే ఛాన్స్ కనిపిస్తోంది. ఎన్టీఆర్ ప్రస్తుతం నీల్‌తో సినిమా పూర్తి చేయాల్సి ఉండగా, కొరటాల శివతో ‘దేవర 2’పై కూడా స్పష్టత లేదు. ఈ నేపథ్యంలో త్రివిక్రమ్‌ఎన్టీఆర్ ప్రాజెక్ట్ ఇప్పట్లో సెట్స్‌పైకి వెళ్లే అవకాశం లేదని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి.

# టీ పార్టీలో సరదా ముచ్చట్లు



వయనాడ్ అడవులలో లభించే ఒక మూలికను తాను వాడుతున్నానని, దానివల్ల తన అలర్జీ సమస్యలు పూర్తిగా తగ్గిపోయాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పీకర్ ఓం బిర్లా, పలువురు కేంద్ర మంత్రులతో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ అన్నారు. డిసెంబర్ 1న ప్రారంభమై 19 రోజుల పాటు సాగిన పార్లమెంట్ శీతాకాల సమావేశాలు వాడీవేడి చర్చలు, విపక్షాల ఆందోళనలతో హోరెత్తాయి. ఈ సమావేశాలు ముగిసిన అనంతరం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఎంపీలకు తేనీటి విందు ఇచ్చారు. ఇందులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ, కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, రామ్మోహన్ నాయుడు, పలువురు అఖిలపక్ష ఎంపీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక వయనాడ్ మూలికల గురించి మాట్లాడారు.

ఆమె ఇంకా మాట్లాడుతూ, ఏడాదిలో 125 రోజుల పాటు పని కల్పించే వికసిత్ భారత్ గ్యారెంటీ పర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ్) (వీబీ-జీ రామ్ జీ) బిల్లును గురువారం అర్ధరాత్రి ఆమోదించిన విషయంపై అఖిలపక్ష ఎంపీలు ప్రధానితో చర్చించారు. అర్ధరాత్రి చట్టాన్ని ఆమోదించడం ఆదర్శవంతంగా ఉండదని, కాబట్టి శీతాకాల సమావేశాలను పొడిగించి ఉండాల్సిందని ప్రధానమంత్రితో అన్నారు. అయితే ఈ బిల్లుపై ప్రతిపక్షాలు తరుచూ నిరసనలు చేపట్టడం వల్ల పార్లమెంట్ సమావేశాల్లో అంతరాయాలు ఏర్పడ్డాయని, అరిచి అరిచి వారి గొంతులు అలసిపోవద్దని తాను కోరుకుంటున్నానని మోదీ సరదాగా వ్యాఖ్యానించారు. దీంతో అక్కడున్న వారంతా చిరునవ్వులు చిందించారు.

శీతాకాల సమావేశాలను మరికొద్ది రోజులు పొడిగించి ఉండాల్సిందని ధర్మేంద్ర యాదవ్ అభిప్రాయపడగా, ఆయనకు గొంతు నొప్పి రాకుండా ఇక్కడితో ముగించామని మోదీ సరదాగా బదులిచ్చారు. బాగా ప్రిపేర్ అయి సభకు వచ్చారంటూ ఎన్‌కే రామచంద్రన్ తదితర విపక్ష ఎంపీలను పీఎం అభినందించారు. పాత పార్లమెంటు భవనంలో మాదిరిగానే న్యూ పార్లమెంట్ బిల్డింగ్‌లో ఎంపీల కోసం ఒక సెంట్రల్ హాల్ చేర్చాలని పలువురు ఎంపీలు మోదీని కోరారు. సెంట్రల్ హాలులో ఎంపీలు, రిటైర్‌మెంట్ అయిన ఎంపీలు చర్చించుకునే వారు. దీనిపై మోదీ సరదాగా స్పందించారు. అది రిటైర్‌మెంట్ తర్వాత కదా...ఇంకా మీరు చాలా సేవ చేయాల్సి ఉంది.. అని అనడంతో సమావేశంలో నవ్వులు వెల్లివిరిసాయి

**విపక్షాల హాజరుకు కారణం ఏమిటంటే?**

విపక్ష పార్టీ సభ్యులను సభలో మాట్లాడేందుకు అనుమతించడం లేదని ఆరోపిస్తూ గత పర్యాయం స్పీకర్ టీ పార్టీని రాహుల్, ఇతర విపక్ష నేతలు బాయ్‌కాట్ చేశారు. అయితే ఈసారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో విపక్షాల విషయంలోనూ స్పీకర్ సముచితంగా వ్యవహరించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అభిప్రాయ పడ్డారని, స్పీకర్ టీపార్టీకి విపక్ష ఎంపీలంతా తప్పనిసరిగా హాజరుకావాలనే నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది.

## మహిళా న్యాయవాదిపై పోలీస్ స్టేషన్‌లో లైంగిక వేధింపులు..

# సీసీటీవీ ఫుటేజ్ కోరిన సుప్రీంకోర్టు

లక్నో: ఒక క్లయింట్‌కు సహాయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన మహిళా న్యాయవాదిపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఆమెను శారీరకంగా హింసించడంతో పాటు లైంగికంగా వేధించారు. ఆ మహిళా లాయర్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ నేపథ్యంలో ఆ పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజ్‌ను అత్యున్నత న్యాయస్థానం కోరింది. డిసెంబర్ 3న అర్ధరాత్రి దాటిన తర్వాత మహిళా న్యాయవాది ఒక క్లయింట్‌కు సహాయంగా ఉత్తరప్రదేశ్ నోయిడా సెక్టార్ 126లోని పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. తీవ్రంగా గాయపడిన క్లయింట్ వినయ్ సింఘాల్ ఫిర్యాదుపై తప్పనిసరిగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె పట్టుబట్టింది. కాగా, ఆ సమయంలో డ్యూటీలో ఉన్న స్టేషన్ హౌస్ ఆఫీసర్‌తో పాటు పోలీసులు ఆ మహిళా న్యాయవాదిని అక్రమంగా నిర్బంధించారు. అర్ధరాత్రి 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆమెను శారీరకంగా హింసించారు. లైంగికంగా వేధించారు. మహిళా లాయర్ ధరించిన నల్లకోటును చించారు. రహస్య



వీడియో రికార్డర్ కోసం ఆమె దుస్తులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తన శరీరాన్ని తాకి అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఆమె ఆరోపించింది. అంతేగాక ఆ మహిళా లాయర్ మెడపై పోలీస్ అధికారి పిస్టల్ ఉంచాడు. ఆమె మొబైల్ ఫోన్ పాస్‌వర్డ్ చెప్పాలని బలవంతం చేశాడు. లేకపోతే 'నకిలీ ఎన్‌కౌంటర్'లో చంపుతానని బెదిరించాడు. మహిళా న్యాయవాది, క్లయింట్ మొబైల్ ఫోన్స్‌లో రికార్డ్ చేసిన వీడియో ఆధారాలను బలవంతంగా పోలీసులు డిలీట్ చేసినట్లు ఆమె పేర్కొంది. మరోవైపు సుమారు 14 గంటల పాటు పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలు, లైంగిక వేధింపులు అనుభవించిన ఆ మహిళా న్యాయవాది సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తన ప్రాణానికి, స్వేచ్ఛకు ముప్పు వాటిల్లినట్లు ఆరోపించింది. ఈ విషయంలో కోర్టు ప్రత్యేక జోక్యాన్ని కోరింది. కాగా, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విక్రమ్ నాథ్, ఎన్వీ అంజారియాతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. సెక్టార్ 126 నోయిడా పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజ్‌ను జనవరి 7 లోపు సీల్డ్ కవర్‌లో అందజేయాలని ఆదేశించింది. ఆ వ్యవధికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్ తొలగించకుండా చూడాలని నోయిడా పోలీస్ కమిషనర్‌కు సూచించింది.

## తలసీమియా చికిత్సకోసం వెళ్తే హెచ్ఐవీ సోకింది..

# రక్త మార్పిడితో ప్రమాదంలో చిన్నారుల జీవితాలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది. తలసీమియా తో బాధపడుతున్న ఐదుగురు చిన్నారులు చికిత్స కోసం వెళ్లగా.. వైద్యుల నిర్లక్ష్యం ఆ పిల్లలకు జీవితాన్నే లేకుండా చేసింది. చికిత్సలో భాగంగా వైద్యులు ఆ చిన్నారులకు హెచ్ఐవీ సోకిన రక్తం ఎక్కించారు. ఈ ఘటన దేశ వ్యాప్తంగా సంచలనం రేపుతోంది. సత్నాకు చెందిన కొందరు చిన్నారులు తలసీమియా వ్యాధితో బాధపడుతున్నారు. తల్లిదండ్రులు వారిని సత్నాలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పిల్లల్ని పరీక్షించిన వైద్యులు వారికి రక్తమార్పిడి చేశారు. 150 మందికి పైగా దాతల నుండి సేకరించిన రక్తాన్ని మూడు వేర్వేరు బ్లడ్ బ్యాంక్స్ నుంచి తీసుకొచ్చి చిన్నారులకు ఎక్కించారు. ఈ రక్తమార్పిడితో చిన్నారులకు ప్రాణాంతక హెచ్ఐవీ బారిన పడ్డారు. రక్తం ఎక్కించిన కొన్ని రోజులకే చిన్నారులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో వారికి రక్త పరీక్షలు చేయగా హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారణఅయింది. రిపోర్ట్స్ చూసి తల్లిదండ్రులు



ఒక్కసారిగా షాక్ అయ్యారు. కుటుంబ సభ్యుల్లో ఎవరికీ ఈ వ్యాధి లేకపోయినా.. పిల్లలకు సంక్రమించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, వ్యాధి సోకిన సూది వాడటంగానీ లేదంటే కలుషిత రక్తాన్ని ఎక్కించడం ద్వారాగానీ ఈ వ్యాధి సంక్రమించి ఉండవచ్చని సత్నా ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జ్ దేవేంద్ర పటేల్ తెలిపారు. తలసీమియాతో బాధ పడుతున్న ఈ ఐదుగురు పిల్లలకు అనేకసార్లు రక్తమార్పిడి చికిత్స జరిగినట్లు గుర్తించారు. ఇక ఈ ఘటనపై ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. బ్లడ్‌బ్యాంక్ ఇన్‌చార్జ్, ఇద్దరు ల్యాబ్ టెక్నీషియన్లను విధుల నుంచి సస్పెండ్ చేసింది. సత్నా జిల్లా ఆసుపత్రి మాజీ సివిల్ సర్జన్‌కు షోకాజు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై లిఖితపూర్వక వివరణ సమర్పించాలని ఆదేశించింది. అంతేకాదు, వివరణ సంతృప్తికరంగా లేకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా, సత్నా ప్రభుత్వ ఆసుపత్రిలో ఈ ఏడాది మార్చి నెలలో తొలి హెచ్ఐవీ పాజిటివ్ కేసు నమోదైంది. మార్చి 20వ తేదీన 15 ఏళ్ల తలసీమియా పేషంట్‌కు హెచ్ఐవీ పాజిటివ్ వచ్చింది. మార్చి 26 నుంచి 28 వరకు మరో ఇద్దరు చిన్నారులకు హెచ్ఐవీ పాజిటివ్ వచ్చింది. ఏప్రిల్ 3వ తేదీన మరో కేసు నమోదు అయింది. ఇలా మొత్తం ఐదుగురు చిన్నారులు హెచ్ఐవీ బారిన పడ్డారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పిల్లల జీవితాలతో వైద్యులు ఆటలాడుతున్నారంటూ మండిపడ్డారు.

## 'అలాంటి ఒప్పందమేదీ జరగలేదు'

# సీఎం పదవిపై కర్ణాటక సీఎం సిద్ధరామయ్య..!

కర్ణాటకలో సీఎం మార్పుపై సందిగ్ధత ఇంకా కొనసాగుతూనే ఉంది. త్వరలో కర్ణాటకలో సీఎం మార్పు ఉంటుందని, డీకే శివకుమార్ సీఎం అవుతారని డీకే వర్గం ప్రచారం చేస్తుండగా.. సీఎం మార్పు జరిగే అవకాశం లేదని, పూర్తిగా ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య సంకేతాలు ఇస్తున్నారు. ఈ విషయంపై ఆయన తాజాగా మరోసారి స్పందించారు. అసెంబ్లీలో మాట్లాడుతూ.. సీఎం పదవి షేరింగ్‌కు సంబంధించి నాడు (అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తర్వాత) ఎలాంటి ఒప్పందం జరగలేదని చెప్పారు. 'నేను ఇప్పటికే ఒకసారి ఐదేళ్లు సీఎం పనిచేశాను. ఆ తర్వాత మళ్లీ ముఖ్యమంత్రిని అయ్యాను. నాకు తెలిసినంతవరకు పార్టీ అధిష్ఠానం నాకే అనుకూలంగా ఉంది. సీఎం పదవిని ఇద్దరు



వ్యక్తులు 2.5 ఏళ్ల చొప్పున పంచుకోవాలనే ఒప్పందమేదీ జరగలేదు' అని సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో ప్రతిపక్షాల కామెంట్స్‌కు స్పందనగా.. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని సిద్ధరామయ్య చెప్పడం గత నాలుగు రోజుల్లో ఇది రెండోసారి. గత మంగళవారం కూడా ఆయన అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేల కామెంట్స్‌కు స్పందిస్తూ.. 'ఇప్పుడు మళ్లీ చెబుతున్నా. ప్రస్తుతం నేను రాష్ట్ర ముఖ్యమంత్రిని, ఇక ముందు కూడా నేను ముఖ్యమంత్రిగా ఉంటా' అని వ్యాఖ్యానించారు. కాగా సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం శివకుమార్ మధ్య వివాదం చాలారోజులుగా కొనసాగుతోంది. ఈ విషయం హైకమాండ్ సైతం జోక్యం చేసుకుని సయోధ్య కుదిర్చింది. అయినా ప్రయోజనం లేదు. సీఎం మార్పు ఉంటుందని ప్రచారం జరుగుతూనే ఉంది.

## బంగ్లాదేశ్‌లో అదుపు తప్పుతున్న పరిస్థితులు...



పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాడికల్ సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రిటన్ తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సభలు, ప్రదర్శనలకు దూరంగా ఉండాలని సూచించాయి. తీవ్ర గాయాలతో సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హాదీ, ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం కన్నుమూశాడు. ఈ విషయాన్ని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ గురువారం రాత్రి అధికారికంగా ధృవీకరించారు. హాదీ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఢాకాకు చేరుకోనుందని, శనివారం జాతీయ పార్లమెంట్ భవనం ముందు అంత్యక్రియల ప్రార్థనలు జరిగే అవకాశం ఉందని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ఈ కారణంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు, ప్రదర్శనలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. శాంతియుతంగా తలపెట్టిన కార్యక్రమాలు కూడా హింసాత్మకంగా మారవచ్చని, కాబట్టి అమెరికా పౌరులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్రిటన్ విదేశాంగ కార్యాలయం కూడా తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా హింసాత్మక ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న చిట్టగాంగ్ కొండ ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. అటు, హాదీ మృతికి సంతాపంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం (డిసెంబర్ 20) జాతీయ సంతాప దినంగా ప్రకటించింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని నివేదికలు వస్తున్నాయి.

## తమిళనాడులో ముసాయిదా

## 'సర్' ఓటర్ల జాబితా ప్రచురణ..

**చెన్నై:** తమిళనాడులో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తర్వాత ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల కమిషన్ శుక్రవారం విడుదల చేసింది. ఆ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 97 లక్షల మంది ఓటర్లను తొలగించారు. 66,44,881 మంది ఓటర్లు బదిలీ అయినట్లుగా, 3,39,278 మంది ఓటర్లు పలు ప్రదేశాల్లో నమోదు చేసుకున్నట్లుగా, 26,94,672 మంది ఓటర్లు మరణించినట్లుగా జాబితాలో పేర్కొన్నారు. కాగా, 2025 అక్టోబర్ 27 నాటికి తమిళనాడులో 6.41 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అయితే 'సర్' ప్రక్రియలో 97 లక్షల మందికిపైగా ఓటర్లను తొలగించడంతో ప్రస్తుతం 5.43 కోట్ల మంది ఓటర్లు మిగిలారు. వీరిలో 2.66 కోట్ల మంది పురుషులు, 2.77 కోట్ల మంది మహిళలు, 7,191 మంది ట్రాన్స్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. మరోవైపు 'సర్' ప్రక్రియలో భాగంగా రాజధాని చెన్నైలో అత్యధికంగా 14.25 లక్షల మంది ఓటర్లను తొలగించారు. దీంతో చెన్నై ఓటర్ల సంఖ్య 40.04 లక్షల నుంచి 25.79 లక్షలకు తగ్గింది. 12.22 లక్షల మంది ఓటర్లు బదిలీ అయినట్లు, 1.56 లక్షల మంది మరణించినట్లు, 27,323 మంది ఓటర్లు చిరునామాలో కనిపించలేదని, 18,772 ద్వంద్వ ఓటింగ్ కేసులు ఉన్నట్లు ముసాయిదా ఓటర్ జాబితాలో పేర్కొన్నారు. కాగా, కోయంబత్తూరులో 6.50 లక్షలు, దిండిగల్ జిల్లాలో 2.34 లక్షల మంది ఓటర్లను ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి తొలగించారు. కరూర్‌లో 79,690 మంది ఓటర్లను, కాంచీపురం జిల్లాలో 2.74 లక్షల మంది ఓటర్లను తొలగించారు. మరోవైపు షోలింగనల్లూరు, పల్లవరం నియోజకవర్గాల్లో అత్యధిక సంఖ్యలో ఓటర్ల తొలగింపు నమోదైనట్లు తమిళనాడు ప్రధాన ఎన్నికల అధికారిణి అర్చన పట్నాయక్ తెలిపారు. కొన్ని వర్గాల ఓటర్లను తొలగించినట్లుగా వచ్చిన ఆరోపణలను ఆమె ఖండించారు. ఏ ఓటరు పేరును ఏకపక్షంగా తొలగించలేదని మీడియాతో అన్నారు.

## ఈడీ దూకుడు



అక్రమ బెట్టింగ్ యాప్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. ఈ కేసులో భాగంగా భారత మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఊతప్పతో పాటు ప్రముఖ నటుడు సోనూ సూద్, తృణమూల్ కాంగ్రెస్ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి ఆస్తులను అటాచ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ జాబితాలో నటి నేహా శర్మ, మోడల్ ఊర్వశీ రౌతేలా తల్లి, బెంగాలీ నటుడు అంకుశ్ హజ్రాల ఆస్తులు కూడా ఉన్నాయి. మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. జప్తు చేసిన ఆస్తుల్లో యువరాజ్ సింగ్‌కు చెందిన రూ.2.5 కోట్లు, సోనూ సూద్‌కు చెందిన రూ.1 కోటి, మిమీ చక్రవర్తికి చెందిన రూ.59 లక్షలు, నేహా శర్మకు చెందిన రూ.1.26 కోట్లు, రాబిన్ ఊతప్పకు చెందిన రూ.8.26 లక్షలు, ఊర్వశీ రౌతేలా తల్లికి చెందిన రూ.2.02 కోట్ల ఆస్తులు ఉన్నాయి. విదేశాల్లో రిజిస్టర్ అయిన '1×ఎవ్' అనే అక్రమ బెట్టింగ్ యాప్ ద్వారా రూ.1000 కోట్లకు పైగా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ గుర్తించింది. ఈ కేసులో గతంలోనే ఈ సెలబ్రిటీలందరినీ ఈడీ విచారించింది. వారి ఆస్తులను 'అక్రమ సంపాదన'గా (ప్రొసీడ్స్ ఆఫ్ క్రైమ్) పరిగణించి తాజా చర్యలు తీసుకుంది. ఇదే కేసులో గతంలో మాజీ క్రికెటర్లు శిఖర్ ధావన్, సురేశ్ రైనాలకు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

## శబరిమల బంగారం కేసు..

## ఈడీ దర్యాప్తునకు విజిలెన్స్ కోర్టు అనుమతి

శబరిమల అయ్యప్ప ఆలయంలోని బంగారు విగ్రహాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కు కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. కేసులో కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సహా సంబంధిత దస్త్రాలను ఈడీకి అప్పగించాలని సిట్‌ను ఆదేశించింది. ఈ కేసులో ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, అరెస్టైన ఏడుగురు నిందితులకు సంబంధించి సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని కోర్టు తన ఆదేశాల్లో పేర్కొన్నది. ఈడీ దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం (ప్రామీూా) కింద కేసు నమోదు చేయనుంది. శబరిమల ఆలయంలోని విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసం రావడం సంచలనం రేపింది. దీనిపై ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా.. కేంద్ర దర్యాప్తు బృందం విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. అయినప్పటికీ విజిలెన్స్ కోర్టు మాత్రం ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137